'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

అన్నపూర్ణగా తెలంగాణ

సాంకేతికంగా ఎంత ముందంజ వేసినప్పటికీ మనదింకా వ్యవసాయిక దేశమే. ప్రజలకు ఆహారాన్ని సమకూర్చడమే కాకుండా అత్యధిక ఉపాధి కల్పించేదీ వ్యవసాయమే. దాని చుట్టూరా అభివృద్ధి అల్లుకొని ఉంటుంది. అందుకే, అన్నదాతను నిలబెట్టుకుంటే అన్నిరంగాలు నిలదొక్కుకుంటాయన్న ఆలోచనలతోనే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సాగుకు పెద్దపీట వేశారు. రైతు అనుకూల విధానాల పరంపరకు తెరతీశారు. తెలంగాణ వ్యవసాయ ముఖచిత్రాన్నే మార్చేశారు. నెర్రెలు వారిన బీడు నేలల దాహార్తి తీర్చేందుకు కాళేశ్వరం వంటి కార్యక్రమాలతో అపర భగీరథాన్ని ఆవిష్కరించారు. ఉచిత కరెంటుతో ఊతమిచ్చారు. అప్పుల తిప్పలు తప్పించేందుకు రైతుబంధు తెచ్చారు. రైతుబీమాతో కుటుంబాలకు భరోసా కల్పించారు. ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలు అందజేశారు. పుష్కలంగా ఎరువులు, నాణ్యమైన విత్తనాలు సరఫరా చేశారు. సాగులో సమన్వయానికి రైతువేదికలు నిర్మించారు. చివరాఖరి ఎకరానికి నీరందించడమే కాకుండా చివరి గింజ వరకు కొనుగోలు చేస్తూ నమ్మకం పెంచారు. ఈ చర్యలన్నింటి ఫలితంగా సాగు తెప్పరిల్లింది. తెలంగాణ ఘనకీర్తి తేజరిల్లింది. అరకొర సాగుతో అలమటించిన రాష్ట్రం అన్నపూర్ణగా అలరారింది. ఆహారధాన్యాల ఉత్పత్తిలో అగ్రగామిగా ఎదిగింది. 2018-19 నుంచి 2023-24 మధ్యకాలంలో మన వ్యవసాయరంగం 16.42 శాతం వృద్ధిరేటు సాధించడమే ఇందుకు తార్కాణం. కేంద్ర వ్యవసాయశాఖ తాజాగా అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తెచ్చిన గణాంకాలివి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన మంత్రివర్గ సభ్యులు చేస్తున్న దుష్ప్రచారాలను తుత్తునియలు చేసే సమాచారమిది. కేసీఆర్ అనుసరించిన విధానాలే ఈ అపూర్వ ముందంజకు తోడ్పడ్డాయని చెప్పడం చర్వితచర్వణమే అవుతుంది.

అంతటి స్వర్ణయుగం చూసిన తెలంగాణలో ఇప్పుడు రైతును పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. నమ్మి నానవోస్తే పుచ్చి బుర్రలైనట్టుగా తయారైంది పరిస్థితి. రైతుబంధు కోసం కండ్లు కాయలు కాసేలా ఎదురుచూడాల్సి వస్తున్నది. పెంచి ఇస్తామన్న సాగు సాయానికి భరోసా లేకుండాపోయింది. కక్షపూరిత రాజకీయాల ఫలితంగా ప్రాజెక్టులను ఆగమాగం చేయడంతో సాగునీళ్లకు గోస వచ్చిపడింది. కాంగ్రెస్ ప్రభుత్వం గప్పాలు కొట్టుకుని టాంటాం వేసుకున్న రుణమాఫీ రైతులను దారుణంగా వంచించింది. ఇవన్నీ అలా ఉంచితే రైతుల పట్ల కనీస మర్యాద కూడా కరువైపోయింది, అడుగడుగునా అన్నదాతలకు అవమానాలు ఎదురవుతున్నాయి. రైతుబంధు అడిగితే చెప్పుతో కొడతామని ఓ మంత్రి నోరుపారేసుకున్నారు. రుణమాఫీ కోసం రోడ్డెక్కితే గయ్యిమని లేస్తున్నారు. నిన్నటికి నిన్న సాక్షాత్తు వ్యవసాయ మంత్రి రైతుల మీద చిందులు తొక్కడం సర్కారు అసహన ధోరణికి పరాకాష్ఠ.

మాయమాటలు నమ్మి మోసపోయిన రైతులు ఇప్పటికైనా తనవారెవరో, పరులెవరో గ్రహించాలి. కడుపులో పెట్టుకొని చూసుకున్నదెవరు? కండ్లల్ల నిప్పులు పోసుకున్నదెవరు? అనేది పరకాయించాలి. బీఆర్‌ఎస్ పాలనలో సగర్వంగా తలలెగరేసిన రోజులు పోయి తలదించుకునే పరిస్థితి తెచ్చిపెట్టింది కాంగ్రెస్. మాటకారి, మాయదారి హామీలతో అరచేతిలో వైకుంఠాన్ని చూపిస్తే ఓటును చేజార్చుకున్న ఫలితమిది. మోసపోయి గోసపడుతున్న దైన్యమిది. కల్లబొల్లి కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పేందుకు సమయం ఆసన్నమైందని రైతులు గుర్తించాలి. అందుకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలే సరైన అదును.

సుప్రీం ప్రశ్నలకు జవాబు లేని ఈడీ

ఢిల్లీ మద్యం పాలసీ కేసు విషయంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవితకు ప్రమేయం ఉందనే ఆరోపణలకు సంబంధించి మొదటినుంచీ అర్థం కాని విషయాలు కొన్నున్నాయి. ఆమె ఒక సాధారణ మహిళ అయినట్టయితే ఇదంతా ఎవరి దృష్టినీ ఆకర్షించేది కాదు. కానీ, తను ప్రముఖురాలు గనుక తొలిరోజు నుంచే ఈ కేసు రెండు తెలుగు రాష్ర్టాలలో విపరీతమైన ప్రచారం పొందింది. ప్రతి చిన్న అంశం గురించి ప్రజలు చాలా చర్చించుకున్నారు. ఆ తొలి దశలోనే ప్రజలకు కొట్టవచ్చినట్లు కనిపించి, ఆశ్చర్యకరంగా తోచిన విషయాలు కొన్నున్నాయి. కవిత పేరును అభియోగ పత్రంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు మొదటిసారి పేర్కొన్నది 2022 నవంబర్ 26వ తేదీన. కానీ అంతకు సుమారు నాలుగు నెలల ముందునుంచే కొన్ని పరిణామాలు కనిపించసాగాయి. కేసులో కవిత ప్రమేయం ఉందని బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఆగస్టు నుంచే ఆరోపించటం మొదలుపెట్టారు. కొన్ని ఆందోళనలు కూడా చేశారు. తెలంగాణపైన, కేసీఆర్ కుటుంబంపైన మొదటినుంచి కక్షగట్టిన ఒక కోస్తా పత్రిక, అదే ధోరణిలో పదే పదే చెప్పుడు వార్తలు రాస్తూ పోయింది. వాటిని ఇంగ్లీషులో ప్లాంటెడ్ స్టోరీస్ అంటారు. కవిత అరెస్టు, తనకు జైలు శిక్ష తప్పవని కూడా ఆ పార్టీలతో పాటు ఆ పత్రిక ప్రకటించింది.



టంకశాల అశోక్

ఇందులో ముఖ్యంగా గమనించవలసిందేమంటే, కవిత అరెస్టు మాట అట్లుంచి ఆమె పేరును కనీసం అభియోగ పత్రంలో ప్రస్తావించటమైనా తర్వాత నాలుగు మాసాలకు గాని జరగలేదు. ఆ తర్వాత ప్రాథమిక విచారణ అయినా మరొక నెల గడిచిన తర్వాత జరిగింది. అటువంటప్పుడు నాలుగు నెలల ముందే బీజేపీ, కాంగ్రెస్‌లకు, సదరు కోస్తా పత్రికకు ఈ విషయాలు ఏ విధంగా తెలిశాయన్నది రెండు రాష్ర్టాల ప్రజలు అనేకులు అంతుబట్టక ఆశ్చర్యపోయారు. ఒకవైపు ఇదంతా అంతకాలం పాటు జరుగుతుండగా కేంద్ర ఏజెన్సీ అయిన ఈడీ అధికారులు అవునని గాని, కాదని గాని ఏమీ మాట్లాడకపోవటాన్ని కూడా పలువురు గమనించారు. దీనంతటిని బట్టి కొన్ని అనుమానాలు ఆ తొలి దశలోనే బలంగా కలిగాయి. బీజేపీ, కాంగ్రెస్‌లు తెలంగాణలో తమకు సవాలుగా నిలిచిన టీఆర్‌ఎస్‌ను దెబ్బకొట్టదలిచాయి. సదరు కోస్తా పత్రిక లక్ష్యం కూడా అదే అయింది. అప్పటి నుంచి అసెంబ్లీ ఎన్నికలకు తగిన సమయం ఉన్నందున బీఆర్‌ఎస్‌పై దాడికి ఇదొక మంచి ఆయుధం అవుతుంది. ఆ విధంగా ఆ పథకం అమలు మొదలైంది.

కవిత బెయిల్ దరఖాస్తు ఆగస్టు 27న సుప్రీం కోర్టు ఎదుట విచారణకు వచ్చినప్పుడు, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్ ఇరువురూ వేసిన అనేక సూటి ప్రశ్నలకు ఈడీ, సీబీఐ న్యాయవాదులు జవాబులు చెప్పలేకపోయారు. కొన్నింటికి డొంక తిరుగుడు సమాధానాలిచ్చారు. తరచూ తడబడ్డారు. ఒక్కోసారి తాము చేసిన వాదనలను ఇంకొకసారి తామే ఖండించుకున్నారు. ఈ విధమైన ధోరణికి న్యాయమూర్తుల చేత చీవాట్లు కూడా తిన్నారు. ఇదంతా జాతీయ మీడియా గమనించింది. వ్యాఖ్యానించింది. ఇంతకూ అనవచ్చేదేమంటే, కవిత పేరును ఈడీ వారు 2022 నవంబర్ 26న పేర్కొనటానికి నాలుగు నెలల ముందు నుంచే బీజేపీ, కాంగ్రెస్ వారు, సదరు కోస్తా పత్రిక ఆ విషయం మాట్లాడటానికి 'సమాచారం' ఎక్కడి నుంచి వచ్చిందనే ప్రశ్నపై ఆ ముగ్గురిని కోర్టులో నిలదీయగలిగి ఉంటే కొన్ని రహస్యాలు బయటికి వచ్చి ఉండేవన్నది ఆసక్తికరమైన మాట.



అధికార యంత్రాంగంలో ఏమి జరుగుతున్నదో ఒక్కోసారి కొంతమేరకు మీడియాకు, అధికార పక్ష సన్నిహితులకు లీక్ అవుతుండటం సహజం. కానీ, ఈడీ, సీబీఐ, ఇంటెలిజెన్స్ వంటి సంస్థల నుంచి సర్వసాధారణంగా జరగదు. ఎప్పుడైనా కొద్దిగా లీక్ అయి వార్తలకు, రాజకీయ ప్రచారాలకు ఎక్కితే ఆ సంస్థ అధికారులు వెంటనే జాగ్రత్త పడతారు. అందుకు ఖండన ప్రకటనలు కూడా ఇస్తారు. ఒక జర్నలిస్టుగా స్వయంగా ఢిల్లీలో దీర్ఘకాలం పాటు పని చేసిన నేను గమనించిన విషయాలివి. కవిత గురించిన వార్తల విషయమై ఇటువంటి బందోబస్తులేవీ ఏజెన్సీల వైపు నుంచి జరగకపోగా, ఆ వార్తలు ఏదో కొద్ది సార్లుగాక నెలల తరబడి సాగుతుండినా ఎటువంటి ఖండనలు గానీ, వివరణలు గాని, బందోబస్తు జాగ్రత్తలు గాని కన్పించలేదు. అది చాలదన్నట్టు మరింత వింతైన వార్తలు ఉరఫ్ లీకులు వస్తూపోయాయి. ఆ తీరునంతా గమనించినప్పుడు అనుమానాలు సహజంగానే బలపడుతూపోయాయి. ఢిల్లీ, పంజాబ్ ఆప్‌తో పాటు తెలంగాణలో బీఆర్‌ఎస్ ఒకవైపు బీజేపీకి, మరొకవైపు కాంగ్రెస్‌కు కొరకరాని కొయ్యలుగా మారాయి. ఆ ప్రచారానికి సాధనంగా ఉత్తరాదిన 'గోదీ మీడియా' (మోదీ పేరును మార్చి, ఆయన గోద్‌లో అనగా, ఒడిలో కూర్చున్న అని అర్థం) ఉండగా, తెలంగాణలో ఒక కోస్తా యాజమాన్య పత్రిక ఆ పాత్రను బాగానే పోషించింది. అందుకే అంటున్నది, ఈ 27న సుప్రీం కోర్టులో దర్యాప్తు ఏజెన్సీల న్యాయవాదుల తడబాట్లు వెల్లడించిన కథ సగం కాగా, ఈ ముగ్గురిని కూడా విచారించగలిగి ఉంటే కథ పూర్తయ్యేది.

మద్యం కేసులోని నిజానిజాలను అంతిమంగా సుప్రీంకోర్టు తేల్చుతుంది. 493 మంది సాక్షులు, 57 మంది నిందితులు, 50 వేల పేజీల డాక్యుమెంట్లు, ఈడీ, సీబీఐ అనే రెండు ఏజెన్సీలు, రెండు చార్జిషీట్లు ఉండే ఈ కేసు ఇప్పట్లో తేలేది కాదని స్వయంగా న్యాయమూర్తులన్నారు. అయితే, ఇదంతా ఒక విధమైన నేరారోపణలకు సంబంధించినది. ఈ మొత్తం వ్యవహారంలో దీనితో నిమిత్తం కలిగిన రాజకీయ కోణం ఒకటున్నది. ఉన్నట్లు పైన చెప్పుకున్న విషయాలను గమనించినవారికి తేలికగా అర్థమవుతుంది. అందువల్ల, ఈ రెండు కోణాలకు సంబంధించిన వాస్తవాలు కూడా ప్రజల ముందుకు రావాలి. ఇంకా చెప్పాలంటే ఇందులో రాజకీయ కోణమన్నది మన ప్రజాస్వామ్యానికి, జాతీయ పార్టీలనే వాటి ధాష్టీకానికి, ఫెడరలిస్టు ప్రాంతీయ పార్టీల మనుగడకు సంబంధించినది అయినందున ఆ ప్రశ్న మౌలికమైనది. కేసులో నిజాలు ఉండి సంబంధిత వ్యక్తులకు శిక్షలు పడితే అది ఆ వ్యక్తులతో ముగిసిపోతుంది. కానీ, ఆప్, బీఆర్‌ఎస్ వంటి ప్రాంతీయ పార్టీలను, జేఎంఎం, డీఎంకే, తృణమూల్ వంటి ప్రాంతీయ శక్తులను బీజేపీ, కాంగ్రెస్ వంటి సెంట్రలిస్టు, యూనిటరిస్టు పార్టీలు తమ గోదీ మీడియా తోడ్పాటుతో ధ్వంసం చేయబూనితే అది ప్రజాస్వామ్యానికి, ఫెడరలిజానికి ప్రమాదకరంగా మారుతుంది. ప్రాంతీయ ప్రజలు, దేశ ప్రజలు గ్రహించవలసిన విషయమిది. కవిత కేసుకు సంబంధించి ఈ విధమైన పన్నుగడలు లేనిపక్షంలో, నేరారోపణ పత్రాలలో కనీసం తన పేరు అయినా ప్రస్తావనకు రాని, అసలెవరూ వినని, నాలుగు నెలల ముందు నుంచే గాని, చివరికి ఈ ఆగస్టు 27న 165 రోజులు గడిచి ఆమె బెయిల్‌పై బయటకు వచ్చిన వరకు గాని ఈ శక్తుల తీరు ఈ విధంగా ఉండేది కాదు. అంతేకాదు, విడుదల ఉత్తర్వులు వెలువడినప్పటి నుంచి 24 గంటల తర్వాత సైతం వారి మాటలు, వ్యాఖ్యలు ఎంత వికృతంగా ఉన్నాయో చూస్తూనే ఉన్నాము. దీనంతటిని బట్టి కూడా స్పష్టంగా అర్థమవుతున్నది ఇందులోని రాజకీయ కోణం ఏమిటో. అందువల్ల ఈ రెండు కోణాలను కలిపి చూసినట్లయితే తప్ప అసలు విషయం బోధపడదు. పైగా, నేరకోణపు ఆరోపణలను ప్రేరేపించిందే రాజకీయ కోణం అనే భావన విస్తృతంగా ఉన్నప్పుడు.

చివరగా, బెయిల్ విచారణ సందర్భంగా ఇరువురు న్యాయమూర్తులు లేవనెత్తిన సూటి ప్రశ్నలను ఇప్పుడొక్కసారి ప్రస్తావించుకున్నట్లయితే, దర్యాప్తు సంస్థల విషయం మనకు బాగా బోధపడుతుంది. వారి ప్రశ్నలపై ఎటువంటి వ్యాఖ్యానాలు వేరుగా అవసరం లేదు కూడా. అవన్నీ అరచేతి ఉసిరిక వలె సూటిగా, క్లుప్తంగా, స్పష్టంగా ఉన్నాయి. వాటికి జవాబుగా ఆ సంస్థల లాయర్లు తడబడటం లేదా నిరుత్తరులు కావటం మినహా, తగిన వివరణలేమీ ఇవ్వలేకపోవటమన్నది ఇందులోని అంతిమ విశేషం.

ఆ ప్రశ్నలేమిటో ఇప్పుడు చూద్దాము. కేసులో కవిత పాత్ర ఉన్నట్లయితే అందుకు సాక్ష్యాధారాలేమిటి? ఎక్కడ ఉన్నాయవి? ఇంతకాలం ఇన్నిన్ని విచారణలు చేసి ఎందుకు చూపలేకపోతున్నారు? మరెవరో తనపై ఆరోపణలు చేసినట్లయితే కేవలం అటువంటి ఆరోపణల వల్లనే ఆమె నిందితురాలవుతారా? పైగా ఆరోపణలు చేసిన వారు స్వయంగా నిందితులైనప్పుడు? నిందితులలో మీరు ఎంపిక చేసిన కొద్దిమందిని అప్రూవర్లుగా మార్చుకొని కేవలం వారి వాంగ్మూలాలపై ఆధారపడి, ఇతర సాక్ష్యాధారాలు ఏవీలేకుండా ఒక వ్యక్తిని ముద్దాయిగా నిలబెడతారా? ఇన్నిన్ని విచారణలు, దర్యాప్తులలో కనీసం ఒక్క రూపాయి అయినా దొరకబట్టలేదేమి? సెల్‌ఫోన్ ఛాటింగ్‌లు, డేటాలను అవసరం లేనప్పుడు అందరూ తొలగిస్తారు. మేము (న్యాయమూర్తులం) కూడా ఆ పనిచేస్తాం. అది నేరమవుతుందా? ఫోన్‌ను ఫార్మాట్ చేయటం వేరు, ట్యాంపరింగ్ చేయటం వేరు. కవిత ఫార్మాట్ చేశారంటున్నారు గాని ట్యాంపరింగ్ చేశారనలేదు. అటువంటప్పుడు ఫార్మాటింగ్ తప్పెట్లా అవుతుంది? అసలు ఢిల్లీ ప్రభుత్వం మద్యం విధానాన్ని రూపొందించటంలోనే కుంభకోణం ఉందని ఆరోపిస్తున్నారు మీరు, ఇన్నాళ్లు గడిచినా ఆ కుంభకోణమేమిటో చెప్పలేకపోయారు. రుజువులు చూపలేకపోయారు. ఎందువల్ల? మీరనే కుంభకోణంలో కవిత పాత్ర ఎక్కడుందో కూడా చూపించలేకపోయారు. ఎందువల్ల? కనీసం ఒక్కటైనా చూపాలి గదా? విచారణలు ముగిశాయని మీరే అంటున్నారు. చార్జిషీట్లు దాఖలు చేశామని కూడా అంటున్నారు. అటువంటప్పుడు కవితను ఇంకా జైలులో ఉంచవలసిన అవసరం ఏమిటసలు? అంతా చూడగా మీ దర్యాప్తులు సక్రమంగా సాగుతున్నాయా అనే అనుమానాలు కలుగుతున్నాయి.

న్యాయమూర్తులు ప్రస్తావించిన ప్రశ్నలు నిజానికి ఇంకా ఉన్నాయి. ఉదాహరణకు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, బుచ్చిబాబు అనే వ్యక్తులకు డబ్బు చెల్లింపులలో ప్రమేయం ఉందని చెప్పిన ఏజెన్సీలు వారిని నిందితులుగా చేర్చకపోవటానికి కారణాలు ఏమిటని నిలదీశారు. అయితే, కేసు విచారణ వివరాలన్నీ ఇక్కడ అవసరం లేదు. దీనంతటిలోని ప్రధాన విషయాలు, విశేషాలన్నీ పైన పేర్కొన్న విధంగా ఇప్పటికే అర్థమవుతున్నందున అవేమిటో ప్రజలు బాగానే గ్రహించగలరు.

హైడ్రా.. వరమా? శాపమా?

పాండవులకు విలువిద్య నేర్పిన ద్రోణాచార్యుడు.. చెట్టు చివరన పక్షి బొమ్మను కట్టి, దాని కన్నును ఛేదించమని అర్జునుడికి పరీక్ష పెడతాడు. 'నీకేం కనిపిస్తుంది అర్జునా!' అని ద్రోణుడు అడిగితే.. 'పక్షి కన్ను తప్ప ఏదీ కనిపించడం లేదు' అని అర్జునుడు అన్నాడని భారతంలో ఉంది. హైడ్రా కూల్చివేతలో ముఖ్యమంత్రి గురువైతే, కమిషనర్ గాండీవధారి. అక్రమ నిర్మాణాల కూల్చివేతే తప్ప దాని పూర్వాపరాలు, పర్యవసానాలు, ప్రజల లాభనష్టాలు హైడ్రా సారథికి అవసరం లేదు. పోలీసులది ఎప్పుడూ పెద్దపులి చూపే. పైగా వారికి కోర్టులు, తీర్పులు అంటే ఒక రకమైన అసహనం. ఎంతో కష్టపడి పట్టుకున్న నేరగాళ్లకు జడ్జీలు బెయిల్ ఇస్తారని కినుక కూడా. అదే సూత్రం హైడ్రా కమిషనర్ పాటిస్తున్నట్టుంది. కోర్టుకు వెళ్తే స్టే వస్తుందనే ఉద్దేశంతో కూల్చివేతల సమాచారం రహస్యంగా ఉంచుతున్నారు. ఏమైనా లీకులు ఇస్తే సీరియస్ యాక్షన్ ఉంటుందని సిబ్బందిని హెచ్చరిస్తున్నట్టు కూడా తెలుస్తున్నది. ఇలా న్యాయవ్యవస్థను విశ్వసించకుండా ఒంటెత్తు పోకడలతో ముందుకెళ్లడమంటే కోర్టులు, న్యాయశాస్త్రాల విలువను తగ్గించినట్టే అవుతుంది. ఇది పసిగట్టే హైడ్రాకు న్యాయస్థానం బిగింపులు తెచ్చింది.



బి.నర్సన్
9440128169

హైడ్రా కొత్త కూల్చివేతల కథలను రోజువారీగా పత్రికలు, టీవీలు సీరియల్‌లా చెప్తున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేసే వీలు లేనందున ప్రజా దృష్టిని మరల్చడానికి ప్రభుత్వం హైడ్రాను సృష్టించిందనే విపక్షాల మాటల్లో కూడా నిజం ఉంది. కాంగ్రెస్‌ను గెలిపిస్తే రాష్ట్రంలో చెరువుల చుట్టూ ఉన్న నిర్మాణాలను ఫటాఫట్ కూల్చివేస్తామని ఎన్నికలప్పుడే చెప్తే ప్రజల తీర్పు మరోలా ఉండేది. ఇక కాంగ్రెస్ హామీల విషయానికొస్తే.. సగం మంది రైతులు రుణమాఫీ అవ్వక ఆగమై రోడ్లెక్కుతున్నారు. రైతుబంధు ఊసే లేదు. కొత్తగా ఒక్క ఉద్యోగ ప్రకటన కూడా రాలేదు. ఆసరా పింఛన్లు పెరగలేదు. తులం బంగారం లేకున్నా అసలు లక్ష రూపాయలు అందక కల్యాణలక్ష్మికి కంటనీరే మిగిలింది.

ఇక హైడ్రా విషయానికి వస్తే ఈ కూల్చివేతలు ఇప్పట్లో ఆగేలా లేవు. వీటివల్ల చెరువుల పరిధిలోని అక్రమ నిర్మాణాలు తొలగిపోయి, వరద ప్రభావానికి గురవుతున్న ప్రజల కష్టాలు గట్టెక్కుతాయి. చెరువులు బాగుపడి, నిల్వ సామర్థ్యం పెరిగి, నీటి సమస్య తీరవచ్చు. హైదరాబాద్ వీధులు చెరువులను తలపించే రోజులు పోతాయి. వర్షాకాలం ట్రాఫిక్‌జామ్ పీడ వదులుతుంది. నగరం పూర్వకళను సంతరించుకోవచ్చని నగరవాసుల ఆశ. అయితే ప్రస్తుతం కూలుస్తున్న కట్టడాల్లో ఎక్కువగా ఫంక్షన్ హాళ్లు, ఫామ్‌హౌజ్‌లు ఉన్నాయి. అవన్నీ ధనవంతులవే. వారికి ఈ నిర్మాణాలు కూలిపోవడం వల్ల పెద్దగా నష్టమేమీ ఉండదు. పైగా కన్వెన్షన్ల అద్దెల రూపంలో పెట్టుబడికి మించి రాబడి వచ్చి ఉండవచ్చు. వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు తమ కబ్జాల గురించి నోరు మెదపడం లేదు. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేస్తుండటంతో అక్రమ నిర్మాణాలు కొన్ని బయటపడుతున్నాయి.



చెరువు పరిధిలో కట్టిన ఫామ్‌హౌజ్‌లు, వ్యాపార కేంద్రాలు కూల్చేశాక హైడ్రా దూకుడు నివాసిత ఇళ్లపై, అపార్ట్‌మెంట్లపై మొదలవుతుందా? అనే ప్రశ్న తలెత్తుతున్నది. అదే కనుక జరిగితే వాటిలో ఉంటున్న సామాన్యుల పరిస్థితి ఏమిటి? అధికారికంగా అన్ని రకాల అనుమతులు ఉన్నాయనే కారణంగా ప్లాట్లు కొన్నవారి గతేమిటి? గూడు కండ్లముందే కూలుతుంటే వారి గుండెలు ఆగిపోవా? నగరంలో చెరువులను ఆనుకొని వందల వెంచర్లున్నాయి. లక్షల జనాభా వాటిలో నివసిస్తున్నారు. చాలామంది 10-20 ఏండ్ల కిందటే వాటిని కొనుగోలు చేశారు. ప్రశాంతంగా ఉన్నవారి జీవితాల్లోకి ఇలా చొరబడితే వారిని కాపాడేదెవరు? ఇప్పటికే ఏ అర్ధరాత్రి, ఏ ముప్పు ముంచుకొస్తుందోనని వారు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. అదీకాకుండా చాలామంది ఇలాంటి ఇండ్లను బ్యాంకు లోన్ల ద్వారా కొనుక్కున్నారు. కూల్చివేతతో బ్యాంకు రుణం తీరిపోదు. అప్పుదారులు, హామీదారుల్లో చాలామంది ఉద్యోగులే అయి ఉంటారు. వారి శాలరీల్లో కోతలు ఆగవు. మరో ఇంటి కిరాయి తప్పదు. ఈ కబ్జా సామ్రాజ్యంలో వారి పాత్ర లేకున్నా శిక్షను భరించాల్సి వస్తుంది. దీనిపై ప్రభుత్వం సమాధానమేమిటి?

అక్రమ కట్టడాల్లో స్కూళ్లు, కాలేజీలు, హాస్పిటళ్లు కూడా ఉంటాయి. వాటిలో చదువుతున్న విద్యార్థుల పరిస్థితి ఏమిటి? కట్టిన ఫీజులు ఎవరు వెనక్కి ఇస్తారు? హాస్పిటళ్లలోని రోగులు ఎటు వెళ్తారు? ఇలా ఎన్నో సమస్యలకు తక్షణ పరిష్కారం కావాలి. కూల్చేశాక ఎంత మాట్లాడినా ప్రయోజనం శూన్యం. ముందు వెనుక ఆలోచన లేకుండా ఏదో ఘనకార్యం చేస్తున్నట్టు మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వీటికి సమాధానం ముందు ఇవ్వాలి. నివాసాలకు ఎలాంటి నష్టం జరగదని హామీ ఇవ్వాలి. విద్యాలయాలు, దవాఖానలకు సమయమివ్వాలి.

18 ప్రాంతాల్లోని 166 అక్రమ కట్టడాలను హైడ్రా ఇప్పటికే నేలమట్టం చేసినట్టు తెలుస్తున్నది. ఆ శిథిలాలతో పాత యజమానికి సంబంధం ఉండదు. వాటి తొలగింపు ఎవరు చేపట్టాలి? వాటిని ఎక్కడికి తరలించాలి? వాటి కోసం ఎన్ని ఎకరాల స్థలం అవసరం? అందుకు అవసరమైన ప్రభుత్వ భూములు ఎక్కడ ఉన్నాయి? తరలింపునకు అయ్యే రూ.కోట్ల ఖర్చును ఎవరు భరిస్తారు? ఇలాంటి ఎన్నో ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానమివ్వాలి. ఖర్చును భరించడమెందుకని ఆ శిథిలాలను అలాగే వదిలేస్తే హైడ్రా లక్ష్యం నెరవేరదు. చెరువుల దురాక్రమణదారుల భరతం పట్టాల్సిందే. కానీ, పద్ధతి మాత్రం ఇది కాదు. ఒక పరిష్కారం కొత్త సమస్యలను తెచ్చి పెట్టకూడదు. దీని కార్యాచరణలో కమిషనర్ పాత్ర కీలకమైనది. ఈ వ్యవహారం న్యాయబద్ధంగా, ప్రశాంతంగా జరగాలంటే రాత్రికే రాత్రి చేపట్టే కూల్చివేతలను నిలిపివేసి ప్రజలను కలుపుకొని పోవాలి. వీలైతే ఒకరిద్దరు నిపుణులను సలహాదారులుగా నియమించాలి. వారితో ప్రాంతీయ అభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేసి, తీర్మానాలు చేయించాలి. భూసేకరణ కోసం పత్రికా ప్రకటన ఇచ్చినట్టు.. ఎక్కడెక్కడ, ఎవరెవరివి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో ఇండ్లు ఉన్నాయో సవివరంగా తెలియజేయాలి. వారంతా కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకుంటారనుకుంటే అది తప్పే. జడ్జిలు గుడ్డిగా నిర్ణయాలు తీసుకుంటారనుకుంటే వారిని అవమానించడమే. న్యాయవ్యవస్థ మద్దతు కోరాలి తప్ప దాని కన్ను కప్పకూడదు.

హైదరాబాద్ చెరువుల్లో సగానికి పైగా కబ్జాకు గురైనట్టు పలు నివేదికలు చెప్తున్నాయి. రిమోట్ సెన్సింగ్ సమాచారం ప్రకారం.. నగరం చుట్టుపక్కల 56 చెరువుల్లో 10,417 ఎకరాల విస్తీర్ణం 3,974 ఎకరాలకు కుదించుకుపోయింది. అంటే 60 శాతం దురాక్రమణ జరిగిందన్నమాట. మరి వీటన్నిటిని కూల్చుకుంటూపోతే పూర్తయేదెన్నడు? నష్టపోయే అమాయకులకు ప్రత్యామ్నాయమేమిటి? చాలా నిర్ణయాలు హైడ్రా కమిషనర్ వైపు నుంచి ప్రజలకు తెలుస్తున్నాయి. అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలుంటాయని ఆయన ఎప్పుడో అన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్, రిజిస్ట్రేషన్ అధికారులపై చర్యలు తీసుకొనే అధికారాలు హైడ్రాకు ఉన్నాయా? చెరువుల పరిధిలో స్థలాలు, ఇల్లు కొన్నవాళ్లు బిల్డర్లపై కేసులు పెట్టాలని కమిషనర్ అంటున్నారు. పెడితే ప్రయోజనమేమిటి? ప్రభుత్వ స్థలాలను పూడ్చేసిన వాహనాలను స్వాధీనం చేసుకుంటామని అంటున్నారు. ఇది అన్యాయం కాదా! ఇలాంటి విషయాలపై ప్రభుత్వమే మాట్లాడాలి. అధికారి శాసనకర్త కాదు. ఒక పెన్నుపోటుతో ఆయన ఉన్నపళంగా కేంద్ర సర్వీసులోకి వెళ్లవచ్చు. మిగిలేది కాంక్రీట్ గుట్టలు, నిర్వాసిత ప్రజలే. సమయానికి స్పందించకపోతే జరిగే లాభం కన్నా నష్టమే ఎక్కువ. ఈ నేపథ్యంలో ఆచితూచి వ్యవహరించాల్సిన అవసరం ఉన్నది.

అక్రమ కట్టడాల్లో పాఠశాలలు, కళాశాలలు, దవఖానలూ ఉన్నాయి. వాటిలో చదువుతున్న విద్యార్థుల పరిస్థితి ఏమిటి? కట్టిన ఫీజులు ఎవరు వెనక్కి ఇస్తారు? దవాఖానల్లోని రోగులు ఎటు వెళ్తారు? ఇలా ఎన్నో సమస్యలకు తక్షణ పరిష్కారం కావాలి. కూల్చేశాక ఎంత మాట్లాడినా ప్రయోజనం శూన్యం.

ఆయుష్ ఉద్యోగాల భర్తీ ఎప్పుడు?

యావత్ ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తున్న ఆయుర్వేద వైద్యం తెలంగాణ రాష్ట్రంలో మాత్రం నాణ్యతా ప్రమాణాల కొరతతో రోగులను ఆగం చేస్తున్నది. మెడికల్ అధికారులను బోధనా సిబ్బందిగా వాడుకుంటుండటమే ఇందుకు ప్రధాన కారణమని రోగులు ఆరోపిస్తున్నారు. అయితే, 'ఆయుష్ అసిస్టెంట్ ప్రొఫెసర్' పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ ఎప్పుడో ఆమోదం తెలిపింది. నోటిఫికేషన్ సిద్ధమై కూడా ఏండ్లు గడుస్తున్నది. కానీ, ఆ నోటిఫికేషన్ మాత్రం విడుదల కావడం లేదు. ఆ నోటిఫికేషన్ ఎందుకు ఆగిపోయిందో ఉద్యోగార్థులకు సైతం అంతుచిక్కడం లేదు. రాష్ట్రంలో రెండు ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలలున్నాయి. అయితే, రాష్ట్రంలో 36 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను రెండేండ్ల కిందట ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేశారు. ఆయుర్వేద విద్యనభ్యసించిన విద్యార్థులు సైతం వేల సంఖ్యలోనే ఉన్నారు. వీళ్లు నోటిఫికేషన్ కోసం కండ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. నిరుద్యోగుల కోసం కాకపోయినా, ఆయుర్వేద వైద్య విద్యనభ్యసించే విద్యార్థుల కోసమైనా 'ఆయుష్ అసిస్టెంట్ ప్రొఫెసర్' పోస్టులను భర్తీ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. తద్వారా ఆయుర్వేద వైద్య విద్య బలోపేతమయ్యే అవకాశాలున్నాయి. ఆయుర్వేద వైద్యచికిత్సపై గొప్పలకు పోయే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా వైద్య కళాశాలల్లో ఏర్పడే ఖాళీలను ఏండ్ల తరబడి భర్తీ చేయకపోవడం శోచనీయం. ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయుర్వేద కళాశాలల్లో ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేస్తాయని ఆశిద్దాం.


- రావుల రాజేశం, సామాజిక కార్యకర్త

అరాచకం సృష్టించేందుకు బీజేపీ యత్నం!



కోల్‌కతా ఘటనకు వ్యతిరేకంగా నిరసన చేస్తున్న వైద్యులను నేను బెదిరించినట్టు కొందరు ఆరోపిస్తున్నారు. అది పూర్తిగా అబద్ధం. వైద్యులకు వ్యతిరేకంగా ఒక్క మాట కూడా నేను మాట్లాడలేదు. వారి పోరాటంలో న్యాయం ఉంది. నేను మాట్లాడింది బీజేపీకి వ్యతిరేకంగా. ఎందుకంటే, కేంద్ర ప్రభుత్వం మద్దతుతో ఆ పార్టీ నేతలు రాష్ట్రంలో అరాచకం సృష్టించాలని ప్రయత్నిస్తున్నారు. అందుకే వారికి వ్యతిరేకంగా గళం విప్పాను.

- మమతాబెనర్జీ,
పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి



ముడా కుంభకోణంలో కొత్త కోణం

- అసలు రైతుకు దక్కింది కేవలం రూ.5.95 లక్షలే
- ప్రతిగా సీఎం సిద్ధరామయ్య కుటుంబానికి ముడా కట్టబెట్టిన ప్లాట్ల విలువ 65 కోట్లు
- ప్లాట్ల కేటాయింపు నిర్ణయంలో యతీంద్ర కీలక పాత్ర?
- సిద్ధరామయ్య కుటుంబానికి అనుచిత ప్రయోజనం నిజమే!
- ముడా కుంభకోణాన్ని బలపరుస్తున్న పత్రాలు



బెంగళూరు, ఆగస్టు 29: ముడా భూకేటాయింపు కుంభకోణంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మరింత లోతుల్లోకి కూరుకుపోతున్నారు. ఈ వ్యవహారంలో సిద్ధరామయ్య కుటుంబం భారీగా లబ్ధి పొందిందనే ఆరోపణలు బలపడుతున్నాయి. ఈ ఆరోపణలను నిరూపించేలా పత్రాలు ఉన్నాయని 'రిపబ్లిక్' మీడియా సంస్థ ఓ కథనం ప్రసారం చేసింది. దీని ప్రకారం.. సిద్ధరామయ్య భార్య పార్వతి నుంచి కేసరి అనే గ్రామంలో మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా) 3.16 ఎకరాలు సేకరించింది. ఈ స్థలాన్ని పార్వతి సోదరుడు మల్లికార్జున ఓ రైతు వద్ద 2004లో కొనుగోలు చేశారని, 2005లో పార్వతికి బహుమతిగా ఇచ్చినట్టు రికార్డులు చెప్తున్నాయి. కాగా, ఈ స్థలం అసలు యజమాని అయిన రైతుకు కేవలం రూ.5.95 లక్షలు మాత్రమే ఇచ్చి కొనుగోలు చేశారు. ఈ భూమిని ముడాకు ఇచ్చి ప్రతిగా ఖరీదైన ప్రాంతంలో పార్వతి అందుకున్న స్థలాల విలువ ఇప్పుడు అక్షరాలా రూ.65 కోట్లు.

ఖరీదైన ప్రాంతాల్లో స్థలాల కోసం లేఖ

ఎక్కడ స్థలం కావాలనేది తన భార్య ముడాను కోరలేదని ఇటీవల ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు. అయితే, ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉన్న ఒక లేఖ బయటకు వచ్చింది. కేసరి గ్రామంలో ఇచ్చిన భూమికి బదులుగా తనకు ఫలానా ప్రాంతాల్లో స్థలాలను కేటాయించాలని కోరుతూ 2014లో సిద్ధరామయ్య ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ముడాకు పార్వతి లేఖ రాశారు. స్థలాలు కావాలని లేఖలో పేర్కొన్నవి ఖరీదైన ప్రాంతాలు. అయితే, లేఖలో పేర్కొన్న ప్రాంతాల పేర్లను తర్వాత వైట్‌నర్‌తో తుడిపేశారు. కాగా, పార్వతికి స్థలాన్ని కేటాయించేందుకు 3,500 స్థలాలు ఉన్నప్పటికీ ఖరీదైన విజయనగర్‌లోనే ముడా కేటాయించిందనే విషయం ఆర్టీఐ ద్వారా వెలుగులోకి వచ్చింది. ఈ స్థలాన్ని కేటాయిస్తూ 2020లో నిర్ణయం జరిగిన ముడా సమావేశంలో సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర ఎమ్మెల్యే హోదాలో పాల్గొన్న విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో సిద్ధరామయ్యపై ఆరోపణలు బలపడుతున్నాయి.

ఇన్‌ఫ్లుయెన్సర్లతో ప్రభుత్వ పథకాల ప్రచారం

కర్ణాటక ప్రభుత్వం నిర్ణయం

బెంగళూరు: ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం బాటలోనే కర్ణాటక కాంగ్రెస్ సర్కారు నడుస్తున్నది. సోషల్‌మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల ద్వారా ప్రభుత్వ పథకాలకు ప్రచారం కల్పించాలని సిద్ధరామయ్య సర్కారు నిర్ణయించింది. వీరందరికీ ప్రభుత్వ ప్రచారంలో భాగంగా బ్రాండ్ అంబాసిడర్‌షిప్‌లు, స్పాన్సర్డ్ పోస్టులు, అతిథి పాత్రలు, థీమ్, హ్యాష్‌టాగ్ ప్రచారాలు, షౌటవుట్లు, రివ్యూలు, ఈవెంట్ ప్రచార బాధ్యతలు అప్పగిస్తారు. యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్, లింక్డ్‌ఇన్, వాట్సాప్‌ల్లో లక్ష కంటే ఎక్కువ ఫాలోవర్లు ఉన్నవారు వీటికి దరఖాస్తు చేసుకోవచ్చు.

వాల్మీకి స్కామ్‌లో ఈడీ దాడులు

బెంగళూరు: కర్ణాటక రాజకీయాల్ని కుదిపేస్తున్న 'వాల్మీకి కార్పొరేషన్ స్కామ్'లో ఈడీ అధికారులు మాజీ మంత్రి బీ నాగేంద్ర బంధువులు, అనుచరుల నివాసాల్లో సోదాలు నిర్వహించారు. బళ్లారి, కొప్పాల్, రాయ్‌చూర్‌లో తనిఖీలు చేపట్టారు. బళ్లారిలో నాగేంద్ర బంధువు టీ యెర్రిస్వామి, సహాయకుడు విజయ్‌కుమార్‌ల నివాసాల్లో అధికారులు సోదాలు జరిపారు. ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టర్ జశ్వంత్ రెడ్డిపైనా ఈడీ దాడులు జరిపినట్టు తెలిసింది. వాల్మీకి కుంభకోణం కేసులో చార్జిషీట్ దాఖలు చేసే సమయం వచ్చిందని, దీంతో సోదాల్ని ఉధృతం చేసినట్టు సంబంధిత అధికారులు చెప్పారు.

రెండెకరాలు అడిగితే

ఐదెకరాలు అప్పగింత!

- మల్లికార్జున ఖర్గే ట్రస్టుపై కర్ణాటక సర్కారు ప్రేమ
- ఖరీదైన ప్రాంతంలో ఐదెకరాల స్థలం కేటాయింపు
- మిగతా దరఖాస్తులన్నీ పక్కనపెట్టి మరీ సంతర్పణ
- ట్రస్టు ప్రతిపాదనపైనా వ్యక్తమవుతున్న అనుమానాలు
- రూ.10 కోట్లు పెట్టుబడి పెట్టే ప్రమోటర్లు ఎవరు?



రాహుల్ ఖర్గే, రాష్ట్ర పరిశ్రమల మంత్రి పాటిల్, ప్రియాంక్ ఖర్గే, మల్లిఖార్జున్ ఖర్గే

బెంగళూరు, ఆగస్టు 29: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో సిద్ధార్థ విహార్ ట్రస్టుకు భూకేటాయింపు వివాదం రాజకీయ దుమారం రేపుతున్నది. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుటుంబానికి చెందిన ఈ ట్రస్టుకు భూ కేటాయింపులో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలను తుంగలో తొక్కిందని, అర్హతలు చూడకుండా ప్రభుత్వం భూమి కేటాయించిందనే విమర్శలు తీవ్రమవుతున్నాయి. ఈ ఆరోపణలను బలపరిచే అంశాలు క్రమంగా వెలుగులోకి వస్తున్నాయి. అడిగిన విస్తీర్ణం కంటే ఎక్కువ భూమిని కేటాయించడం, మిగతా దరఖాస్తులను పక్కనపెట్టేసి ఒకే దరఖాస్తును పరిగణనలోకి తీసుకున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికే ముడా భూకేటాయింపు, వాల్మీకి బోర్డు కుంభకోణాలతో సతమతమవుతున్న కాంగ్రెస్ సర్కారు ప్రతిష్ఠను ఈ ఆరోపణలు మరింత పలుచన చేస్తున్నాయి.

ఎక్కువ స్థలాన్ని కేటాయించడంపై ఆరోపణలు

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు ఆయన భార్య, కుమారులు, అల్లుడు సభ్యులుగా ఉన్న సిద్ధార్థ విహార్ ట్రస్టుకు బెంగళూరు సమీపంలోని హైటెక్ డిఫెన్స్ ఏరోస్పేస్ పార్క్‌లో ప్రజా వసతులు కల్పించడానికి ఉద్దేశించిన 45.94 ఎకరాల స్థలంలో 5 ఎకరాల స్థలాన్ని కర్ణాటక పారిశ్రామిక ప్రాంతాల అభివృద్ధి బోర్డు(కేఐఏడీబీ) కేటాయించింది. మల్టీ స్కిల్ డెవెలప్‌మెంట్ సెంటర్ పెట్టేందుకు భూమి కావాలని ఈ ట్రస్టు దరఖాస్తు చేసుకుంది. 2.17 ఎకరాల ప్లాటు లేదా 5 ఎకరాల మరో ప్లాటు కేటాయించాలని ఈ ట్రస్టు రెండు ప్రతిపాదనలు పెట్టింది. చిన్న స్థలం అయినా సరిపోతుందని అడిగినప్పటికీ కేఐఏడీబీ మాత్రం పెద్ద స్థలం కేటాయించడం ఇప్పుడు వివాదంగా మారింది. ఈ స్థలాన్ని కేటాయించిన రాష్ట్రస్థాయి సింగిల్ విండో క్లియరెన్స్ కమిటీకి ఛైర్మన్‌గా మంత్రి ఎంబీ పాటిల్ ఉన్నారు. ఈ భూకేటాయింపులో బంధుప్రీతి, పక్షపాతం ఉన్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రమోటర్ల వివరాలపై గోప్యత

ఈ స్థలంలో మల్టీ స్కిల్ డివలప్‌మెంట్ సెంటర్ నిర్మాణానికి రూ.25 కోట్ల వ్యయం అవుతుందని ఈ ట్రస్టు సమర్పించిన ప్రాజెక్టు రిపోర్టులో పేర్కొన్నది. ఇందులో రూ.10 కోట్లు ప్రమోటర్లు పెట్టుబడి పెడతారని, మరో రూ.10 కోట్లు బ్యాంకుల నుంచి రుణం తీసుకుంటామని, రూ.5 కోట్లు వర్కింగ్ క్యాపిటల్‌గా పెడతామని ట్రస్టు పేర్కొన్నది. అయితే, రూ.10 కోట్లు పెట్టుబడి పెట్టే ప్రమోటర్లు ఎవరనే విషయాన్ని వెల్లడించకపోవడంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సెంటర్‌లో యువతకు ఆటోమొబైల్, సాఫ్ట్‌వేర్ నైపుణ్యాలపై శిక్షణ ఇస్తామని ట్రస్టు పేర్కొన్నది. అయితే, ఈ రంగంలో ట్రస్టుకు ఉన్న అనుభవానికి సంబంధించిన ఆధారాలను మాత్రం సమర్పించలేదని దినేశ్ కల్లహళ్లి అనే సామాజిక కార్యకర్త ఆరోపించారు. మిగతా దరఖాస్తులు అన్నింటినీ పక్కనపెట్టి కేవలం ఈ ఒక్క ట్రస్టు దరఖాస్తును మాత్రమే కమిటీ పరిగణనలోకి తీసుకున్నదని, ఇది బంధుప్రీతి, అవినీతి అని దినేశ్ పేర్కొన్నారు.

కర్ణాటకలో బీర్ల ధరలు రూ.30 పెంపు!

బెంగళూరు, ఆగస్టు 29: కర్ణాటకలో బీరు తాగేవాళ్లకు రాష్ట్ర ప్రభుత్వం షాక్ ఇవ్వబోతున్నది. రాష్ట్రంలో బీర్ల ధరల్ని రూ.10 నుంచి రూ.30 వరకు పెంచాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తున్నట్టు ప్రముఖ ఆంగ్ల దినపత్రిక వార్తా కథనం పేర్కొన్నది. బీర్ల బ్రాండు, ఆల్కహాల్ కంటెంట్‌ను బట్టి ధరల పెంపు ఉంటుంది. త్వరలో బెంగళూరులో నల్లా చార్జీలు పెంచబోతున్నట్టు ఇటీవల డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా బీర్ల చార్జీలు కూడా పెంచనున్నట్టు వార్తలు వెలువడటంతో కాంగ్రెస్ సర్కారుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాల నుంచి నీళ్ల వరకు అన్ని ధరలను సిద్ధరామయ్య సర్కారు పెంచుతున్నదని ప్రజలు మండిపడుతున్నారు.



న్యాయ కోవిదుడు ఏజీ నూరానీ కన్నుమూత

ముంబై: ప్రముఖ విద్యావేత్త, రచయిత, న్యాయ కోవిదుడు అబ్దుల్ గఫూర్ మజీద్ నూరానీ (94) గురువారం ముంబైలోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు. ఆయన 1930 సెప్టెంబరు 16న ముంబైలో జన్మించారు. ఆయన బాంబే హైకోర్టు, సుప్రీంకోర్టులో న్యాయవాద వృత్తిని ప్రాక్టీస్ చేశారు. ఆయన 'ది కశ్మీర్ డిస్ప్యూట్ 1947-2012', 'ఆర్టికల్ 370 : ఏ కాన్‌స్టిట్యూషనల్ హిస్టరీ ఆఫ్ జమ్ము అండ్ కశ్మీర్', 'ది డిస్ట్రక్షన్ ఆఫ్ హైదరాబాద్' వంటి పుస్తకాలు రాశారు. అంతేకాకుండా జాతీయ, ప్రాంతీయ వార్తా పత్రికల్లో వ్యాసాలు కూడా రాశారు. భారతీయ ముస్లింలకు సంబంధించిన అంశాల గురించి కూడా ఆయన రచనలు చేశారు. నూరానీ మృతి పట్ల జమ్ముకశ్మీరు మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, హురియత్ కాన్ఫరెన్స్ చీఫ్ మీర్వాయిజ్ ఉమర్ ఫరూఖ్, ఏఐఎంఐఎం చీఫ్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తదితరులు సంతాపం ప్రకటించారు.

గవర్నర్ స్వతంత్రంగా వ్యవహరించొచ్చు

- క్యాబినెట్ సూచనతో వెనక్కు తగ్గాల్సిన అవసరం లేదు
- సిద్ధరామయ్యపై విచారణకు అనుమతిపై హైకోర్టు వ్యాఖ్య
- ముడాస్కామ్‌లో కీలక పరిణామం



బెంగళూరు, ఆగస్టు 29: ముడా భూకేటాయింపు కేసులో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను విచారించేందుకు అనుమతించడం గవర్నర్ స్వతంత్ర నిర్ణయమని, దీనిపై మంత్రివర్గ సూచనతో వెనక్కు తగ్గాల్సిన అవసరం లేదని కర్ణాటక హైకోర్టు వ్యాఖ్యానించింది. సిద్ధరామయ్య భార్య పార్వతి నుంచి మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా) తక్కువ విలువైన స్థలాన్ని సేకరించి ఖరీదైన స్థలాన్ని కట్టబెట్టిందనే ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ అంశంలో సిద్ధరామయ్యను విచారించేందుకు ఆగస్టు 17న గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ అనుమతించారు. అయితే, రాష్ట్ర మంత్రివర్గం అనుమతి తీసుకోకుండా గవర్నర్ ఇచ్చిన ఉత్తర్వులు చెల్లవని, వీటిని కొట్టేయాలని సిద్ధరామయ్య హైకోర్టును ఆశ్రయించారు. శుక్రవారం సిద్ధరామయ్య పిటిషన్ విచారణ సందర్భంగా మంత్రివర్గ నిర్ణయంపై ఆధారపడాల్సిన అవసరం లేదని కోర్టు వ్యాఖ్యానించింది. ఈ కేసు విచారణను శనివారానికి వాయిదా వేసింది.

సిద్ధరామయ్య భార్యపై ఫిర్యాదు

ముడా భూకేటాయింపు కుంభకోణంలో సీఎం సిద్ధరామయ్య భార్య పార్వతిపై లక్ష్మిపుర పోలీస్‌స్టేషన్‌లో స్నేహమయి కృష్ణ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. ఈ కేసులో కీలకమైన డాక్యుమెంట్‌లో మార్పులు చేశారని పార్వతితో పాటు ముఖ్యమంత్రి సన్నిహితుడు, కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఎం లక్ష్మణపై ఫిర్యాదు ఇచ్చారు. అయితే, పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేయలేదు. విజయనగర్ లేఅవుట్‌లోని ఖరీదైన ప్రాంతంలో భూమిని కేటాయించాల్సిందిగా ముడాను పార్వతి అడిగారని, ఈ లేఖ బయటకు వచ్చిన తర్వాత దేవనూరు లేదా మరో ప్రాంతంలో స్థలం అడిగినట్టుగా లేఖను మార్చారని స్నేహమయి కృష్ణ ఆరోపించారు.

అక్రమాస్తుల కేసులో డీకేకు ఊరట

సీబీఐ పిటిషన్ కొట్టేసిన హైకోర్టు

బెంగళూరు, ఆగస్టు 29: అక్రమాస్తుల కేసులో కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు ఊరట లభించింది. ఆయనపై సీబీఐ దర్యాప్తునకు అనుమతిని ఉపసంహరిస్తూ కాంగ్రెస్ సర్కారు తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌ను కర్ణాటక హైకోర్టు తిరస్కరించింది. ఈ కేసును లోకాయుక్తకు అప్పగిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కూడా తోసిపుచ్చింది. ఈ అంశాలను సుప్రీంకోర్టు పరిష్కరించాలని పేర్కొంది. డీకే ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారని ఆరోపణలు రావడంతో, అప్పటి బీజేపీ ప్రభుత్వం సీబీఐ దర్యాప్తునకు ఆదేశించింది. సిద్ధరామయ్య ప్రభుత్వం సీబీఐకి అనుమతిని ఉపసంహరించింది.



మహిళల భద్రత కోసం షీ-బాక్స్ పోర్టల్

న్యూఢిల్లీ: పని ప్రదేశాల్లో మహిళల భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం షీ-బాక్స్ (SHe-Box) పోర్టల్‌ను ప్రారంభించింది. దీనిని కేంద్ర మహిళ, శిశు అభివృద్ధి శాఖ మంత్రి అన్నపూర్ణ దేవి గురువారం ప్రారంభించారు. మహిళలపై లైంగిక వేధింపులకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారం కోసం ఈ పోర్టల్ ఉపయోగపడుతుంది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లోని ఇంటర్నల్ కమిటీలు, స్థానిక కమిటీలకు సంబంధించిన సమాచారం దీనిలో ఉంటుందని ఈ మంత్రిత్వ శాఖ తెలిపింది. బాధితురాళ్లు ఈ పోర్టల్ ద్వారా లైంగిక వేధింపులపై ఫిర్యాదు చేయవచ్చు, దర్యాప్తు ఏ విధంగా జరుగుతున్నదో తెలుసుకోవచ్చు, సకాలంలో తమ సమస్యల పరిష్కారం జరిగేలా చేయవచ్చు. పని చేసే చోట జరిగే లైంగిక వేధింపుల ఫిర్యాదుల పరిష్కారానికి సమగ్ర వేదికగా ఇది పని చేస్తుందని అన్నపూర్ణ దేవి చెప్పారు.

బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన?

- ఇటీవలి పరిణామాలతో జోరుగా ఊహాగానాలు
- మమతపై అమిత్ షాకు రాష్ట్ర బీజేపీ ఫిర్యాదు
- రాష్ట్రపతి పాలన కోసం ఆ పార్టీ డిమాండ్
- హత్యాచార ఘటనపై స్పందించిన రాష్ట్రపతి

కోల్‌కతా, ఆగస్టు 29: పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన దిశగా అడుగులు పడుతున్నాయా? ఇటీవలి వరుస పరిణామాలు ఈ ఊహాగానాలను బలపరుస్తున్నాయి. కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటన తర్వాత రాష్ట్రంలో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఘటనను నిరసిస్తూ జూనియర్ డాక్టర్లు 21 రోజులుగా ఆందోళనలు చేస్తున్నారు. అసాధారణరీతిలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సైతం ఈ ఘటనపై స్పందించారు. బాధితురాలికి న్యాయం జరగాలంటూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించడం, పోలీసులు కఠినంగా వ్యవహరించడం రాష్ట్రంలో ఉద్రిక్తతలను మరింత పెంచింది. మరోవైపు బెంగాల్ తగలబడితే ఢిల్లీ సహా పలు రాష్ట్రాలు తగలబడతాయని సీఎం మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా స్పందిస్తున్నది. ఇవి దేశవ్యతిరేక వ్యాఖ్యలని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. సరైన చర్యలు తీసుకోవాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సుకాంత మజుందార్ ఫిర్యాదు చేశారు.



రాష్ట్రపతి పాలనకు బీజేపీ పట్టు

ప్రతిపక్ష నేత సువేందు అధికారి సైతం రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని, మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని పదేపదే కోరుతున్నారు. ఇటీవల బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్ ఢిల్లీ వెళ్లి రాష్ట్రపతి, హోంమంత్రిని కలిశారు. తాజాగా ఆయన మాట్లాడుతూ.. 'గవర్నర్‌గా అన్నీ చూస్తున్నా. నా నిర్ణయాలు ప్రజల్లో చెప్పడంలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయి. రాష్ట్రంలో పరిస్థితులు, అసాధారణంగా ఉన్నాయి' అని వ్యాఖ్యానించారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర నాయకులు గవర్నర్‌ను కలిసి రాష్ట్రాన్ని, ప్రజల హక్కులను కాపాడేందుకు సరైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ వరుస పరిణామాలను పరిశీలిస్తున్న విశ్లేషకులు బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించే అవకాశాలు లేకపోలేదని అంటున్నారు.

కాల్ రికార్డుల కలకలం

కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటనను దాచిపెట్టేందుకు దవాఖాన వర్గాలు ప్రయత్నించిన తీరు కాల్ రికార్డింగులతో బయటకొచ్చింది. ఘటన జరిగిన ఆగస్టు 9న బాధితురాలి తండ్రికి ఆర్జీ కర్ వైద్య కళాశాల, దవాఖాన అసిస్టెంట్ సుపరింటెండెంట్ ఫోన్ చేశారు. 'మీ కూతురికి ఆరోగ్యం బాగోలేదు. మేము దవాఖానలో చేరుస్తున్నాం. మీరు దవాఖానకు రండి' అని చెప్పి ఫోన్ పెట్టేశాడు. ఆ తర్వాత కొద్ది సేపటికే మరోసారి ఫోన్ చేసి 'మీ అమ్మాయి పరిస్థితి విషమంగా ఉంది. ఆమె ఆత్మహత్యాయత్నం చేసుకొని ఉండవచ్చు. మీరు త్వరగా రండి' అంటూ చెప్పాడు. తర్వాత కొంతసేపటికే మరోసారి ఫోన్ చేసి..'మీ అమ్మాయి ఆత్మహత్య చేసుకొని చనిపోయినట్టుంది.' అంటూ మరణవార్తను చెప్పారు.

మరోవైపు, 'బెంగాల్ తగలబడితే ఢిల్లీ కూడా తగలబడుతుందని గుర్తుంచుకోండి' అంటూ మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యపై ఢిల్లీ పోలీసులకు సుప్రీంకోర్టు న్యాయవాది వినీత్ జిందాల్ ఫిర్యాదు చేశారు.

ఎంపీలో దళిత మహిళపై దాష్టీకం

- మహిళను, కుమారుడ్ని చితకబాదిన పోలీసులు
- 10 నెలల తర్వాత విచారణకు ప్రభుత్వం ఆదేశం



భోపాల్, ఆగస్టు 29: బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో పోలీసుల తీరు వివాదాస్పదంగా మారింది. ఓ దళిత మహిళ, ఆమె కుమారుడ్ని(15) పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చిన అక్కడి సిబ్బంది, వాళ్లద్దర్నీ చితకబాదారు. కుమారుడి కండ్లెదుట దళిత మహిళను జుట్టు పట్టుకొని కిందపడేసి కొట్టారు. ఈ ఘటన దాదాపు 10 నెలల క్రితం జరిగినట్టు తెలిసింది. ఇంతకాలం ఈ విషయం అందరికీ తెలియకుండా కప్పిపెట్టేందుకు సీఎం మోహన్ యాదవ్ నేతృత్వంలోని బీజేపీ సర్కార్ ప్రయత్నించిందని ఆరోపణలు వెలువడుతున్నాయి. కాట్ని జీఆర్‌పీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. ఈ ఘటనపై విపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయటంతో, ప్రభుత్వం డీఐజీ స్థాయి అధికారితో విచారణకు ఆదేశించింది. సదరు పోలీస్ స్టేషన్ సిబ్బంది తీరు ఒళ్లు జలదరించేలా ఉందని, శాంతి భద్రతల పేరుతో గూండాయిజం ప్రదర్శిస్తున్నారని విపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. పది నెలల దాకా.. ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని నెటిజన్లు విమర్శించారు.

యూపీలో ఆపరేషన్ భేడియా

- భరూచ్‌లో తోడేళ్ల దాడిలో ఏడుగురి మృతి
- వాటిని బంధించేందుకు ప్రత్యేక ఆపరేషన్



బహ్రెయిచ్: ఉత్తరప్రదేశ్‌లోని భరూచ్‌లో పలు గ్రామాల ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న తోడేళ్లను పట్టుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆపరేషన్ భేడియా చేపట్టింది. తోడేళ్ల దాడిలో ఇటీవల ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. దీంతో ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి ప్రభుత్వం ఇప్పటివరకు నాలుగు తోడేళ్లను పట్టుకున్నది. బారాబంకీ డివిజినల్ ఫారెస్ట్ ఆఫీసర్, 'ఆపరేషన్ భేడియా' ఇన్‌ఛార్జి ఆకాశ్‌దీప్ బధవాన్ మాట్లాడుతూ, సిసయ్య చూడామణి గ్రామం సమీపంలో తాము ఏర్పాటు చేసిన వలల్లో ఒక మగ తోడేలు పడిందన్నారు. అయితే ఈ ప్రాంతంలో ఎన్ని తోడేళ్లు తిరుగుతున్నాయో స్పష్టంగా తెలియడం లేదని అధికారులు చెప్తున్నారు.

గురుగ్రామ్‌లో సౌతాంప్టన్ వర్సిటీ క్యాంపస్

ఎన్‌ఈపీ కింద తొలి విదేశీ విశ్వవిద్యాలయం ఇదే..

న్యూఢిల్లీ: నూతన జాతీయ విద్యా విధానం కింద తొలి విదేశీ విశ్వవిద్యాలయం ఆఫ్‌షోర్ క్యాంపస్ గురుగ్రామ్‌లో ఏర్పాటు కాబోతున్నది. బ్రిటన్‌కు చెందిన సౌతాంప్టన్ వర్సిటీ దీనిని ఏర్పాటు చేస్తుందని కేంద్రం గురువారం తెలిపింది. దీనికి సంబంధించిన లెటర్ ఆఫ్ ఇంటెంట్‌ని విదేశాంగ మంత్రి జైశంకర్ ఈ వర్సిటీ ప్రతినిధులకు అందజేశారు. మన దేశంలోని సౌతాంప్టన్ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో ఇచ్చే డిగ్రీలు బ్రిటన్‌లో ఆ విశ్వవిద్యాలయం ఇచ్చే డిగ్రీలతో సమానమైనవేనని యూజీసీ చైర్మన్ జగదీశ్ కుమార్ చెప్పారు. విద్య, నాణ్యత ప్రమాణాలు సమానంగా ఉంటాయన్నారు.

పాక్ గూఢచర్యం కేసులో ఎన్‌ఐఏ సోదాలు

తెలంగాణ సహా 7 రాష్ట్రాల్లో తనిఖీలు

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): పాక్ గూఢచర్యం కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) బుధవారం తనిఖీలు చేపట్టింది. తెలంగాణ, గుజరాత్, కర్ణాటక, కేరళ, ఉత్తరప్రదేశ్, బీహార్, హర్యానా రాష్ట్రాల్లో మొత్తం 16 చోట్ల సోదాలు నిర్వహించినట్టు తెలిపింది. భారత నౌకాదళానికి చెందిన కీలక సమాచారాన్ని తెలుసుకునేందుకు పాకిస్థాన్ పన్నిన కుట్ర విశాఖపట్నం వేదికగా 2021లో వెలుగు చూసింది. ఏపీకి చెందిన కౌంటర్ ఇంటెలిజెన్స్ సెల్ కేసు నమోదు చేసి, విచారణ చేపట్టింది.

ముస్లింల వివాహాలు, విడాకుల రిజిస్ట్రేషన్ తప్పనిసరి

బిల్లుకు అస్సాం అసెంబ్లీ ఆమోదం

గువాహటి: ముస్లింల వివాహ, విడాకుల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి అస్సాం ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ రెండింటి నమోదును తప్పనిసరి చేస్తూ అస్సాం శాసనసభ గురువారం బిల్లును ఆమోదించింది. సీఎం హిమంత మాట్లాడుతూ, గతంలో ఖాజీలు నిర్వహించిన వివాహాలు చెల్లుబాటు అవుతాయని, కొత్త చట్టం అమలులోకి వచ్చిన నాటి నుంచి వివాహాలను వారు నమోదు చేయరాదని, తప్పనిసరిగా ప్రభుత్వం వద్ద రిజిస్ట్రేషన్ చేయాలని అన్నారు.



నేవీ అమ్ములపొదిలోకి ఐఎన్‌ఎస్ అరిఘాత్

న్యూఢిల్లీ, ఆగస్టు 29: అణ్వస్త్ర సామర్థ్యమున్న 'ఐఎన్‌ఎస్ అరిఘాత్' నేవీ అమ్ములపొదిలోకి చేరింది. ఏపీలోని విశాఖపట్నంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమక్షంలో జలాంతర్గామిని ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. భారత నౌకాదళంలో ఐఎన్‌ఎస్ అరిఘాత్ రెండో అణు జలాంతర్గామి అని, దీని ప్రవేశంతో దేశ అణు సామర్థ్యం మరింత బలోపేతం అవుతుందన్నారు. తొలి అణు జలాంతర్గామి అరిహంత్‌ను 2016లో ప్రారంభించారు. దానికి అడ్వాన్స్‌డ్ వెర్షన్‌గా మరిన్ని ఆధునిక హంగులతో అరిఘాత్‌ను నిర్మించారు. ఐఎన్‌ఎస్ అరిఘాత్ సముద్ర ఉపరితలంపై గంటకు 12-15 నాటికల్ మైళ్ల వేగంతో, సముద్ర అంతర్భాగంలో గంటకు 24 నాటికల్ మైళ్ల వేగంతో ప్రయాణించగలదు.



స్మార్ట్‌ఫోన్ వ్యసనానికి విరుగుడు

లండన్, ఆగస్టు 29: స్మార్ట్‌ఫోన్ వ్యసనాన్ని తగ్గించే సరికొత్త ఫోన్‌ను హెచ్‌ఎండీ అనే యూరోపియన్ ఫోన్ల తయారీ కంపెనీ తయారు చేసింది. అయితే ఈ ఫోన్‌లో స్మార్ట్‌ఫోన్‌లో ఉండే ఫీచర్లు ఏమీ ఉండవు. వాట్సాప్, సోషల్ మీడియా యాప్‌లు ఇందులో కనిపించవు. అసలు ప్లే స్టోర్ అనేదే ఈ ఫోన్‌లో ఉండదు. టచ్‌స్క్రీన్ బదులు కీప్యాడ్ ఉంటుంది. సెల్ఫీలు దిగేందుకు ఫ్రంట్ కెమెరా ఉండదు. కేవలం ఒకే ఒక్క మామూలు వీడియో గేమ్ మాత్రమే ఉంటుంది. మొబైల్ ఇంటర్నెట్ కూడా చాలా తక్కువ స్పీడ్‌తో మాత్రమే వస్తుంది. ఒకరకంగా చెప్పాలంటే తొలుత కనీస ఫీచర్లతో ఫోన్‌లు ఎలా ఉండేవో ఈ ఫోన్ కూడా అలానే ఉంటుంది. ప్రస్తుతం దాదాపు రూ.11 వేల ధరకు ఈ ఫోన్ యూకే, యూరోప్‌లో అందుబాటులోకి వచ్చింది.



రాత్రివేళ సూర్యకాంతి విక్రయిస్తాం!

కాలిఫోర్నియా, ఆగస్టు 29: రాత్రివేళ సైతం సూర్యకాంతిని అందిస్తామని చెప్తున్నది కాలిఫోర్నియాకు చెందిన రిఫ్లెక్ట్ ఆర్బిటల్ అనే కంపెనీ. ఈ దిశగా తమ ప్రణాళికలను ఈ సంస్థ సీఈఓ బెన్ నోవాక్ వెల్లడించారు. సహజంగా సౌర విద్యుత్తు సూర్యకాంతి ఉన్నప్పుడే ఉత్పత్తి అవుతుంది. కానీ, ఆ సమయంలో విద్యుత్తు అవసరం తక్కువ. విద్యుత్తు అవసరం ఎక్కువగా ఉండే రాత్రివేళ సౌర విద్యుత్తు ఉత్పత్తి కాదు. ఈ సమస్యకు పరిష్కారంగా రాత్రిపూట కూడా సౌర విద్యుత్తు ఉత్పత్తి చేసే అవకాశాన్ని కల్పిస్తామని, ఇందుకోసం సూర్య కాంతిని విక్రయిస్తామని నోవాక్ చెప్తున్నారు. ఇందుకు గానూ 57 చిన్న ఉపగ్రహాలను భూమి నుంచి 370 మైళ్ల ఎత్తుకు పంపించనున్నట్టు చెప్పారు. ఈ ఉపగ్రహాలకు ఒక్కోదానికి 33 చదరపు అడుగుల మైలార్ అద్దాలు ఉంటాయి. నింగిలో ఈ అద్దాలపై పడే సూర్యకాంతి భూమిపై ఉండే నిర్దేశిత సౌర ఫలకాలపై ప్రతిబింబించేలా చేస్తామని, తద్వారా సూర్యాస్తమయం తర్వాత సైతం విద్యుత్తు ఉత్పత్తికి అవకాశం ఉంటుందని నోవాక్ తెలిపారు. తాజాగా, హాట్ ఎయిర్ బెలూన్ ద్వారా తమ ఆలోచనను ప్రయోగించి చూపించారు.



శునకం ఆస్తులు రూ.3,300 కోట్లు!

న్యూఢిల్లీ: శునకానికి ఏకంగా రూ.3,300 కోట్ల ఆస్తి ఉందంటే నమ్మగలరా? ఈ ఫొటోలో కనిపిస్తున్న జర్మన్ షెఫర్డ్ శునకం పేరు గుంథెర్-6. రూ.3వేల కోట్లకు పైగా ఆస్తులతో ప్రపంచంలోనే అత్యంత సంపన్న శునకంగా ఇది గిన్నిస్ రికార్డులకెక్కింది. దీనికి ఓ విమానం, యాట్ సహా బీఎండబ్ల్యూ కారు ఉన్నాయి. దీని సేవలకు 27 మంది సిబ్బంది, రుచికరమైన ఆహారాన్ని సిద్ధం చేయడానికి ఓ చెఫ్ కూడా ఉన్నారు. కర్లోటా లీబెన్‌స్టీన్ కుమారుడు 1992లో మరణించడంతో తన ఆస్తినంతటినీ గుంథెర్-3 పేరు మీద రాశారు. ఈ ఆస్తుల నిర్వహణ బాధ్యతలను తన ఇటాలియన్ స్నేహితుడు మౌరిజియో మియాన్‌కు అప్పగించారు. మియాన్ ఈ ఆస్తులను విపరీతంగా పెంచడంతో గుంథెర్-6కు కళ్లు చెదిరే స్థాయిలో ఆస్తులు సంక్రమించాయి.

ఒలింపిక్స్‌లో మెడల్ గెలవడమే కాదు, ఆ క్రీడాంగణంలో అడుగుపెట్టడం కూడా సాహసమే! ఈ మైదానంలో సత్తా చాటింది జర్నలిస్ట్ గీతికా తాలుక్దార్. క్రీడాకారిణిగా కాదు.. కెమెరా ఉమెన్‌గా! అప్పటి నుంచి ఆమె సెలెబ్రిటీగా మారిపోయారు! ఒలింపిక్స్ న్యూస్ కవరేజ్ కోసం ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీ ఎంపిక చేసిన ఏకైక భారతీయ మహిళా స్పోర్ట్స్ ఫొటో జర్నలిస్ట్ ఆమె. గతంలో జపాన్ ఒలింపిక్ క్రీడల్లో ఈ ఘనత సాధించింది. మళ్లీ పారిస్ ఒలింపిక్స్‌లో క్లిక్‌మనిపిస్తూ తన రికార్డుని తానే అధిగమించి విజయ గీతిక అనిపించుకుంది!





ఒలింపిక్స్ విజయ గీతిక





ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న భారత దేశం పారిస్ ఒలింపిక్స్ పతకాల పట్టికలో ఎక్కడో చివరన నిలిచింది. మనుబాకర్, నీరజ్ చోప్రా, అమన్ సెహ్రావత్ విజయాలు ఊరటనిచ్చేవే! అలాంటిదే మరో విజయం భారతదేశానికి దక్కింది. ప్రపంచమూ ఆ విజయంవైపు చూసింది. కానీ, భారతదేశమే పెద్దగా పట్టించుకోలేదు. పతకాలు గెలిచిన క్షణాలు చేజారిపోకుండా చేసిన విజయం ఆమెది. ఆ విజేత పేరు గీతికా తాలుక్దార్. అస్సాంలోని తిన్‌సుకియా జిల్లా, డూమ్‌డూమా పట్టణం ఆమె స్వస్థలం. అక్కడి కేంద్రీయ విద్యాలయంలో పాఠశాల విద్య పూర్తి చేసింది గీతిక. తర్వాత గువాహటిలో ఉన్నత విద్య అభ్యసించింది. పాటలు బాగా పాడేది. సాంస్కృతిక పోటీల్లో అందరికంటే ముందుండేది. కాలేజీ చదువు పూర్తయిన తర్వాత పాత్రికేయ వృత్తిని ఎంచుకుంది. పదిహేనేండ్లపాటు వివిధ పత్రికలు, ప్రచురణ సంస్థల్లో జర్నలిస్టుగా పనిచేసింది.



జర్నలిస్ట్ జీవితం సంతృప్తికరంగా ఉన్నా ఇంకా ఏదో చేయాలనే తపనతో ఉండేది గీతిక. తన ఆసక్తికి తగినట్టుగా దక్షిణ కొరియాలోని 'సియోల్ నేషనల్ యూనివర్సిటీ'లో ప్రతిష్ఠాత్మకమైన స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ కోర్సు చదవాలనుకుంది. 2020లో ఆ కోర్సుకు దరఖాస్తు చేసింది. ఆ దేశ క్రీడా శాఖ నుంచి స్కాలర్‌షిప్ అందుకుంది. ఈ ఆర్థిక సాయంతో చదువు పూర్తి చేసింది. మాస్టర్స్ అయిన వెంటనే ఆమెకు టోక్యో ఒలింపిక్స్‌లో పాల్గొనే అవకాశం వచ్చింది. కొవిడ్ ప్రకంపనల మధ్యే ఆనాటి పోటీలు జరిగాయి. అలాంటి భయానక సమయంలోనూ ఒలింపిక్స్ విశేషాలను ప్రపంచానికి చాటడానికి భారీ కెమెరాను చేతుల్లోకి తీసుకుంది గీతిక. టోక్యో ఒలింపిక్స్‌లో ఫొటో జర్నలిస్ట్‌గా పనిచేసింది. విపత్కర పరిస్థితుల్లో ఆమె చూపిన వృత్తి ధర్మానికి ఎన్నో ప్రశంసలు దక్కాయి. మరెన్నో ప్రపంచ స్థాయి క్రీడా వేడుకల్లో పాల్గొనేందుకు ఆమెకు ఆహ్వానాలు అందాయి. పదిహేనేండ్ల పాత్రికేయ వృత్తిలో ఎందరో జర్నలిస్టులకు దక్కని అవకాశాలు, విజయాలు ఆమెను వరించాయి.

పారిస్ ఒలింపిక్స్ 2024 వార్తా విశేషాలను ప్రపంచానికి తెలియజేసేందుకు ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీ ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ జర్నలిస్టులను ఎంపిక చేసింది. క్రీడా వేడుకల్లో పనిచేసిన అనుభవం, ప్రతిభ ఆధారంగా వారికి ఆహ్వానం పలుకుతుంది. టోక్యోలో ప్రతిభ కనబరచిన గీతికకు పారిస్ నుంచి పిలుపు అందింది. ఆటల్లో వెనక్కి నెట్టినట్టే స్పోర్ట్స్ జర్నలిజం, ఫొటో జర్నలిజంలోనూ ఆడవాళ్లను వెనక్కి నెట్టే పరిస్థితులు ఉన్నాయి. ఆమె పట్టుదల ముందు అవన్నీ తోకముడిచాయి. 'స్పోర్ట్స్ జర్నలిజం ఆడవాళ్లకు సవాళ్లతో కూడుకున్న పని. అనేక ప్రాంతాలు తిరుగుతూ ఉండాలి. క్రీడల షెడ్యూల్ ప్రకారం రాత్రీపగలూ పని చేయాల్సి వస్తుంది. గంటలపాటు నిలబడాలి. పరిగెత్తుతూనే ఉండాలి. వీటిని నేను కష్టంగా భావించను. కెమెరా అందుకోగానే.. నా లెన్స్ మంచి చిత్రం కోసం 360 డిగ్రీలూ కలయజూస్తాయి. ఈ కెరీర్‌లో పురుషాధిక్యత అంటారా! దాన్ని నేనెప్పుడూ లక్ష్యపెట్టలేదు' అని చెబుతుంది గీతిక.

టోక్యో ఒలింపిక్స్ 2020 వేడుకల తర్వాత పారిస్ ఒలింపిక్స్ 2024కి ముందు ఆమె ఎన్నో అంతర్జాతీయ స్పోర్ట్స్ ఈవెంట్లలో పాలుపంచుకుంది! ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో జరిగిన ఫిఫా మహిళల వరల్డ్ కప్‌లో ఫొటో జర్నలిస్ట్‌గా పనిచేసింది. ఫిఫా వరల్డ్ కప్– కతార్, ఫిఫా ఉమెన్ వరల్డ్ కప్–ఫ్రాన్స్, ఫిఫా వరల్డ్ కప్– రష్యా, ఐసీసీ క్రికెట్ వరల్డ్ కప్, ఐపీఎల్, కామన్‌వెల్త్ గేమ్స్, సౌత్ ఏషియా గేమ్స్.. ఇలా ఎన్నో అంతర్జాతీయ క్రీడా సంబురాలను ఆసక్తిగా కవర్ చేసింది. తాజాగా పారిస్ ఒలింపిక్స్‌లో అదిరిపోయే చిత్తరువులు తీసి శభాష్ అనిపించుకుంది. ఒలింపిక్స్‌ని కవర్ చేసిన మొట్టమొదటి భారతీయ మహిళా స్పోర్ట్స్ ఫొటో జర్నలిస్ట్‌గా క్రీడా చరిత్రలోనే కాదు పాత్రికేయ చరిత్రలోనూ ఆమె పేరు నిలిచిపోతుంది.

పెండ్లికి ముందే.. అర్థం చేసుకుందాం

ప్రేమ పండాలంటే రెండు మనసులు చాలు. కానీ, పెండ్లి కుదరాలంటే ఇద్దరు వ్యక్తులు, రెండు కుటుంబాలు మనస్ఫూర్తిగా కలవాలి. ఉద్యోగం, ఆస్తిపాస్తులు, రూపలావణ్యాల ఒరవడిలో కొట్టుకుపోతున్న ఈ తరం.. పెండ్లి విషయంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటున్నది. కాస్త స్థిమితంగా ఆలోచించి నిర్ణయం తీసుకుంటే.. మీ పెండ్లిపుస్తకం ఓ అందమైన కావ్యంగా మారుతుంది. పెండ్లి ప్రయత్నాల్లో ఉన్న యువతీ యువకులు దృష్టి సారించాల్సిన అంశాలు ఇవి..

వయసు మీద పడుతుందనో, పెద్దల ఒత్తిడికి తలొగ్గో, బంధువులు సిఫారసు చేశారనో పెండ్లి విషయంలో నిర్ణయానికి రావొద్దు. వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టడానికి మీరు సిద్ధంగా ఉన్నారా? లేదా? అని మీ మనసును అడగండి. సమాధానం 'సిద్ధం' అని వచ్చినప్పుడే... ఏడడుగులకు రెడీ అని ఇంట్లో వాళ్లకు చెప్పండి.

ఈ రోజుల్లో పెండ్లిచూపుల తంతు చిత్రవిచిత్రంగా సాగిపోతున్నది. అమ్మాయి, అబ్బాయి మాట్లాడుకునే వెసులుబాటు అన్ని ఇండ్లలో ఉంటున్నది. అయితే, గంటల తరబడి మాట్లాడుకుంటున్నా... ఇరువురికీ స్పష్టత రావడం లేదు. దీనికి కారణం.. ఎవరి అంచనాలు వాళ్లకు ఉండటమే! మీకేం కావాలో స్పష్టత కలిగి ఉంటే.. ఈ పరిస్థితి తలెత్తదు. మనిషితోపాటు కుటుంబానికీ ప్రాధాన్యం ఇవ్వాలన్న సంగతి మర్చిపోకండి.



'నూరు అబద్ధాలు ఆడైనా ఒక పెండ్లి చేయాలి' అంటారు పెద్దలు. పెండ్లి పెటాకులు కావడానికి.. నూరు దాకా ఎందుకు ఒక్క అబద్ధం చాలు! అందుకే, పెండ్లిచూపుల వేళ.. అన్నీ నిజాలే చెప్పండి. అవతలి వ్యక్తినీ నిజాలే చెప్పమని కోరండి. ఆ నిజాల్లో నిజాయతీ ఉందనిపిస్తే.. ఆ సంబంధం గురించి పాజిటివ్‌గా ఆలోచించొచ్చు. అదెలా తెలుస్తుంది అంటారా! మాటల్లో నిజాయతీ కరువైనప్పుడు అవి చెప్తున్న వ్యక్తి కండ్లల్లో అపరాధ భావన తొంగిచూస్తుంది.

పెండ్లికి ముందు ఎన్ని చెప్పుకొన్నా.. వివాహం తర్వాత సర్దుకుపోయే మనస్తత్వం తప్పనిసరి. పెండ్లి బాజాలు మోగడానికి ముందు రోజుల తరబడి చాటింగ్‌లో ఊసులు పంచుకున్నా, ఎన్నిసార్లు కలుసుకున్నా.. పెండ్లయ్యాక ఒకరిపై ఒకరికి అనుకోకుండానే ఆధిపత్యం వస్తుంది. మన వివాహ వ్యవస్థలో ఇది సర్వసాధారణం. దాన్ని అంగీకరించకుండా.. ఈ పెత్తనాలేంటి? అనుకున్నారో, పేచీలు ఖాయం. అలా కావొద్దంటే.. ఒకరి ఇష్టాలను మరొకరు గౌరవించాలి. ఒకరి ఇబ్బందులను మరొకరు అర్థం చేసుకోవాలి. పెండ్లయ్యాక కనీసం ఆరు మాసాలు ఒకరినొకరు స్టడీ చేయాలి. ఎదుటి వ్యక్తిలోని లోపాలను గుర్తించడమే పనిగా పెట్టుకోవద్దు. వారిలోని మంచి గుణాలనూ అంచనా వేయాలి. వాటికి అనుగుణంగా మీ వ్యవహార శైలిని మార్చుకోవాలి. అప్పుడు ఆల్ హ్యాపీస్!

ఊహలు.. ఊసులు

హాట్ అప్‌డేట్

మనసులోని భావాలను వ్యక్తపరచడానికి అక్షరాలు సరిపోవు. అందుకే నిన్నటి తరం కవితలను అల్లుకున్నది. కావ్యాలను నమ్ముకున్నది. 5జీకి హాయ్ చెబుతున్న ఈ తరం అక్షరాలను అరకొరగా వాడుతున్నది. వాట్సాప్ మెసేజింగ్‌లో ఎమోజీలు, జిఫ్‌లు, యానిమేటింగ్ స్టిక్కర్స్ సంధిస్తూ.. ఔరా! అనిపించుకుంటున్నది. ఇప్పుడు వీటికి తోడు 'ఏఐ' వచ్చింది. దీంతో సందేశాల్లో స్టిక్కర్లు చక్కర్లు కొడుతున్నాయి. ఇక వాట్సాప్‌లో కొత్తగా 'ఇమేజిన్' ఆప్షన్ వచ్చి చేరింది. ఇది 'మెటా ఏఐ'తో అనుసంధానమై పనిచేస్తుంది. మీరు ప్రత్యేకంగా ఏదైనా స్టిక్కర్ పంపాలనుకుంటే కమాండ్స్ ఇస్తూ రూపొందించొచ్చు. ఉదాహరణకు మీ స్నేహితుడికి 'గుడ్ నైట్' చెబుతూ ఓ స్టిక్కర్‌ని పంపాలనుకుంటే.. 'నైట్ విత్ ఏ ఫుల్ మూన్ అండ్ స్టార్స్' అని కమాండ్ ఇస్తే చాలు... మెటా ఏఐ అదిరిపోయే ఇమేజ్‌లను క్రియేట్ చేస్తుంది. దాన్ని యానిమేట్ కూడా చేయొచ్చు. ఇలా మీ ప్రియమైన వారికి మనసైన స్టిక్కర్లు పంపొచ్చు. 'ఇమేజిన్' ఆప్షన్ కోసం.. వాట్సాప్ మెసేజింగ్ బార్‌లో అటాచ్‌మెంట్స్ ఐకాన్‌ను ట్యాప్ చేయాలి. మెనూలో చివరిగా ఇమేజిన్ ఆప్షన్ ఉంటుంది. దాన్ని సెలెక్ట్ చేసుకొని.. కమాండ్స్ ఇస్తే సరి! ఇంకెందుకు ఆలస్యం మీ ఊసులకు ఊహల రెక్కలు తొడిగేయండి.




అధరహో అనిపించాలంటే

అతివల పెదాల గురించి వర్ణించాలంటే పదాలు సరిపోవు. అయితే, గులాబీ రేకుల్లాంటి పెదాలు కంటపడితే దేవదాసు సైతం కాళిదాసుగా మారిపోతాడు. మరి మీ మోవి గని మోజుపడాలంటే.. అధరాలు తేనెలూరాలి. అలా ఉండాలంటే.. ఇదిగో ఇవి ప్రయత్నించండి..

ఒక టేబుల్ స్పూన్ కలబంద జెల్‌లో కొద్దిగా తేనె కలపాలి. ఆ మిశ్రమాన్ని పెదాలకు రాసి 15 నిమిషాల తర్వాత శుభ్రం చేసుకోవాలి. దాంతో పెదాలు హైడ్రేటెడ్‌గా మారుతాయి. సాఫ్ట్‌లుక్‌తో మెరుస్తాయి.

ఆరోగ్యంతోపాటు అందానికి కూడా బీట్‌రూట్ ఉపయోగపడుతుంది. బీట్‌రూట్ రసాన్ని వేళ్లతో పెదాలపై మెత్తగా రుద్దాలి. కాసేపటి తర్వాత శుభ్రం చేయాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే.. మీ పెదాలు వర్ణరంజితమై ముద్దులొలుకుతాయి.

ఒక టీ స్పూన్ ఆల్మండ్ ఆయిల్, టీ స్పూన్ తేనె, రెండు స్పూన్ల చక్కెర ఒక కప్పులోకి తీసుకొని బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని పెదాలపై మెల్లగా రుద్దాలి. దీనివల్ల పెదాలపై ఏర్పడిన డెడ్‌స్కిన్ తొలగిపోతుంది. మోవిపై ఉన్న నల్లదనం మాయమై నల్ల ఇరుక్కే అనిపిస్తాయి.



వెట్ న్యాప్‌కిన్‌తో గానీ, మెత్తని టూత్‌బ్రష్‌తో గానీ పెదాలపై మెల్లగా రుద్దాలి. దీని వల్ల పెదాలపై డ్రైగా ఏర్పడిన లేయర్ తొలగిపోతుంది. దీనివల్ల రక్త ప్రసరణ కూడా మెరుగుపడుతుంది. రాత్రి సమయంలో నిద్రకు ఉపక్రమించే ముందు ఇలా చేయడం మంచిది. తర్వాత పెదాలకు కొబ్బరినూనె రాసుకుంటే మరీ మంచిది.

ఆమె.. సేఫ్!

కఠినమైన చట్టాలు ఎన్ని వస్తున్నా మహిళలపై జరిగే అరాచకాలకు అడ్డుకట్ట పడటం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో బయటికి వెళ్లాలంటేనే యువతులు భయపడుతున్నారు. ప్రభుత్వాలు ఎన్ని చర్యలు చేపడుతున్నా అతివలపై అకృత్యాలు మాత్రం తగ్గడం లేదు. ఈ సమాజంలో మహిళలు వాళ్లకు వాళ్లు రక్షణ కల్పించుకోవడం కూడా చాలా అవసరం. ఇందుకోసం ప్లే స్టోర్‌లో ఎన్నో సెక్యూరిటీ అప్లికేషన్లు వచ్చాయి. వాటిలో ఒకటి షీ సేఫ్ (SHE Safe). అత్యవసర సమయాల్లో మహిళలకు భద్రత కల్పించే ఉద్దేశంతో.. సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్, సైబరాబాద్ పోలీస్ ఈ యాప్‌ను సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. గూగుల్ ప్లే స్టోర్ నుంచి దీన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఫోన్ నంబర్, మెయిల్ ఐడీతో రిజిస్టర్ చేసుకోవాలి. ఎమర్జెన్సీ సమయాల్లో ఇందులోని ఎస్‌ఓఎస్ బటన్ క్లిక్ చేస్తే చాలు.. పోలీసులకు అలెర్ట్ మెసేజ్ వెళ్తుంది. మీరు ఉన్న ప్రదేశం వివరాలు తెలిసిపోతాయి. ఈ యాప్ ఉపయోగించాలంటే లొకేషన్ ఆన్‌లో ఉంచడం తప్పనిసరి. ఎమర్జెన్సీ సమయాల్లో మాత్రమే కాదు.. ఇందులోని మార్గదర్శక్, సంఘమిత్ర, సేఫ్ స్టే, రేడియంట్ హైదరాబాద్, బీ అవేర్ తదితర ఆప్షన్స్‌ను మామూలు సమయాల్లోనూ వినియోగించవచ్చు. పోలీసు శాఖ హెల్ప్‌లైన్ నంబర్లు కూడా చూసుకోవచ్చు. ఈ యాప్‌ను ఇప్పటివరకు దాదాపు 10వేల మంది ఉపయోగిస్తున్నారు.



ఆమె పేరు కనిక. అస్సాం రాష్ట్రంలోని బోర్జార్ అనే పల్లెటూరువాసి. భర్తతో ఉన్నప్పుడు ఏ రందీ లేదామెకు. ఈ దంపతుల మూడేండ్ల కాపురానికి గుర్తుగా ఓ బిడ్డ పుట్టింది. చిన్నారి నెలల పాపగా ఉన్నప్పుడే ఆమె భర్త అనారోగ్యంతో కన్నుమూశాడు. భవిష్యత్తు అంధకారంగా మారింది. నెలకు ఓ రెండు వేలు సంపాదిస్తే చాలు, నా బిడ్డ బాగోగులు చూసుకోవచ్చు అనుకుంది కనిక. అలా అనుకున్న ఆవిడే.. స్వయం కృషితో ఇప్పుడు నెలకు రూ.3.5 లక్షలు సంపాదిస్తున్నది. పది మందికీ ఉపాధి కల్పిస్తున్నది. ఎవరీ కనిక... ఏమా కథ!

'జై' బోలో కనిక



భర్త పోయాక కనిక రోజులు భారంగా గడవసాగాయి. రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి. నేత కార్మికురాలిగా పనిచేస్తూ పొట్టపోసుకునేది. ఒకరోజు అనుకోకుండా ఓ వర్క్‌షాప్‌లో పాల్గొన్నది. అక్కడ వర్మికంపోస్ట్ తయారీ గురించి తెలుసుకుంది. ఇదేదో తన తలరాత తను మార్చేలాగే ఉంది అనుకుంది కనిక. స్థానిక అధికారుల సాయంతో కృషి విజ్ఞాన కేంద్రాన్ని సంప్రదించింది. ఆ సంస్థ ఆసరాతో కేవలం రూ.500 పెట్టుబడితో వర్మికంపోస్ట్ తయారీ రంగంలోకి ప్రవేశించింది. తమ గ్రామంతోపాటు పరిసర ప్రాంతాల నుంచి ఆవుపేడ, ముడి పదార్థాలు సేకరించి వర్మికంపోస్ట్ తయారీకి శ్రీకారం చుట్టింది కనిక. 'జై వర్మికంపోస్ట్' బ్రాండ్‌తో అమ్మకాలు మొదలుపెట్టింది.



అక్కడితో ఆగిపోలేదు ఆమె. గ్రామంలోని రైతులకు వర్మికంపోస్ట్ వాడకం ద్వారా కలిగే ప్రయోజనాలను చెప్పేది. అలా రైతులు సేంద్రియ సాగుకు మొగ్గు చూపేలా చేయగలిగింది. ఆమె కష్టం వృథాపోలేదు. అంచెలంచెలుగా ఎదుగుతూ 'జై' బ్రాండ్ జయకేతనం ఎగురవేసింది. వ్యాపారం మొదలుపెట్టిన తొలి ఏడాది కేవలం 35 కిలోల వర్మికంపోస్ట్ విక్రయించిన కనిక.. ఇప్పుడు నెలకు 35 టన్నుల ఎరువులు ఉత్పత్తి చేసే స్థాయికి చేరుకుంది. పదుల సంఖ్యలో మహిళలకు ఉపాధి కల్పిస్తున్నది. అస్సాం వ్యవసాయశాఖతోపాటు మేఘాలయ, అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్‌లోని పలు నర్సరీలు 'జై వర్మికంపోస్ట్'ను కొనుగోలు చేస్తున్నాయి. కేవలం రూ.500 పెట్టుబడితో మొదలైన ఆమె ప్రయాణం ఇప్పుడు లక్షలకు చేరింది. ఒకప్పుడు నెలకు రూ.2వేలు సంపాదిస్తే చాలు అనుకున్న కనిక ఇప్పుడు నెలకు రూ.3.5 లక్షలు ఆర్జిస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నది. 'ఈ ప్రపంచంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయి. వాటిని అందిపుచ్చుకుంటే సరిపోదు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అందుకు నిరంతరం పరిశ్రమించాలి. అప్పుడు విజయం తప్పక లభిస్తుంది అనడానికి నేనే ఉదాహరణ' అని గర్వంగా చెబుతున్నది కనిక.

శనగలకు శాస్త్రీయత ఏమిటి?

ఫుడ్ సైన్స్

హలో మేడం. మొలకెత్తిన శనగలను శ్రావణ మాసంలో వాయనంగా ఇస్తారు. వర్షాకాలం, వేడుకలు నోములు ఎక్కువగా ఉండే ఈ సమయంలో వీటిని పంచడం, తినడం వెనుక ఏమైనా శాస్త్రీయత ఉందంటారా! ఈ సమయంలో ఇలా శనగలు తినడం ఆరోగ్యాన్ని ఏ విధంగా ప్రభావితం చేస్తుంది.

• ఓ పాఠకురాలు



వానకాలంలో వ్యాధులు త్వరగా వ్యాపిస్తాయి. అపరిశుభ్ర వాతావరణం వల్ల ఆహారం త్వరగా కలుషితం అవుతుంది. ముఖ్యంగా మాంసాహారంతో ఈ సమస్య ఎక్కువ. బహుశా అందుకే ఈ పూజల కాలంలో దీన్ని దూరం పెట్టమని పెద్దలు చెప్పి ఉంటారు. చాతుర్మాస్య దీక్షల్లో భాగంగా ఒక నెల ఆకుకూరలు, ఒక నెల పాల పదార్థాలు... ఇలా కొన్నిటిని నిషేధించడంలోనూ ఇదే మూలంగా చెప్పొచ్చు. ఎందుకంటే వానకాలం ఆకుకూరలు కూడా బాగా కలుషితం అవుతాయి. నేలకు తక్కువ ఎత్తులో ఉండే వీటి ఆకులు ఎక్కడెక్కడి నుంచో కొట్టుకొచ్చే వాన నీళ్లలో మునుగుతుంటాయి. ఇది ప్రమాదం కలిగించే విషయం. ఇక, సాధారణంగా వానకాలంలో జీర్ణశక్తి మందగిస్తుంది. మాంసం తినం కాబట్టి, ఆ స్థానంలో శరీరానికి శాకాహార ప్రొటీన్ అందించాలి. దానికి శనగలు చక్కని పరిష్కారం. ఇందులో మాంసకృత్తులతో పాటు, పీచు ఎక్కువగా ఉంటుంది. ఐరన్, కాల్షియం, జింక్, మెగ్నీషియంలాంటి సూక్ష్మపోషకాలూ అందుతాయి. నానబెట్టడం వల్ల ఇందులోని ఫైటిక్ యాసిడ్ స్థాయులు తగ్గిపోతాయి. మాంసకృత్తుల్ని శరీరం శోషించుకోవడాన్ని ఈ యాసిడ్ తగ్గిస్తుంది. నానబెట్టి, ఉడికించి తింటే గ్యాస్ కూడా రాదు. ముఖ్యంగా శనగలు మొలకెత్తడం వల్ల అందులోని పోషక విలువలు అధికమవుతాయి. ఇక, శ్రావణ మాసంలో పూజలు, వేడుకలు అధికంగా ఉంటాయి. ఉపవాసాలు, వేళకు తినలేకపోవడాలు కూడా ఎక్కువే కాబట్టి.. శాకాహారులకు మరింత బలాన్ని చేకూర్చేందుకు శనగలను ఆహారంలో భాగం చేశారని చెప్పొచ్చు.

ఇక ఈ శనగల్ని ఎలా తిన్నా మేలే. కాస్త ఉడికించి కీర, క్యారెట్ ముక్కలు జతచేసి సలాడ్ లాగా తినొచ్చు. లేదంటే పసుపు, జీలకర్ర, ఆవాలు, ఇంగువ, అల్లం ముద్దతో తాలింపు వేసి... గుగ్గిళ్లు చేసుకోవచ్చు. ఈ సమయంలో అల్లం, జీలకర్ర, ఇంగువ లాంటివి జీర్ణాశయ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. అలాగే హంగ్‌కర్డ్‌లో... ఉడకబెట్టిన శనగలు, క్యారెట్ తురుము, బీట్‌రూట్ తురుము, జీలకర్ర పొడి, ఇంగువ, ఉప్పు, మిరియాల పొడి కలుపుకొని తిన్నా రుచిగా ఉంటుంది. ఇలా రోజుకు ఒక చిన్నకప్పు తినొచ్చు. శనగలు పొట్ట నిండిన భావనను కలిగించి, బరువు తగ్గేందుకూ సాయపడతాయి.



మయూరి ఆవుల
న్యూట్రిషనిస్ట్
Mayuri.trudiet@gmail.com



రామారావుమహారాజ్ తండాలో కూల్చిన ఇంటిని పరిశీలిస్తున్న లోకాయుక్త కమిటీ

ఇండ్ల కూల్చివేతలపై లోకాయుక్త కమిటీ విచారణ

పెద్దకొడప్‌గల్, ఆగస్టు 29: కామారెడ్డి జిల్లా పెద్దకొడప్‌గల్ మండలంలోని రామారావు మహారాజ్ తండాలో అటవీ అధికారులు ఇండ్లు కూల్చివేసిన ఘటనపై లోకాయుక్త కమిటీ గురువారం విచారణ చేపట్టింది. అటవీ భూముల్లో ఇండ్లను నిర్మించుకున్నారని మూడేండ్ల క్రితం అటవీ అధికారులు వాటిని కూల్చివేశారు. బాధితులు లోకాయుక్తను ఆశ్రయించగా, ఫిర్యాదును స్వీకరించి విచారణకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో లోకాయుక్త కమిటీ సభ్యుడు మాథిక్ కోషి గురువారం రామారావు మహారాజ్ తండాకు వచ్చి విచారణ చేపట్టారు. బాన్సువాడ ఆర్డీవో నుంచి కూడా వివరాలు సేకరించారు.

హైడ్రా ముసుగులో వసూళ్లు!

- కూల్చివేతల్లో నిజాయితీ ఏది?
- బీజేపీఎల్పీ నేత ఏలేటి ఫైర్



హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): హైడ్రా ముసుగులో పెద్దఎత్తున బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారని బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. ఈ విషయం తన దృష్టికి వచ్చినట్టు స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి కూడా మీడియా ముఖంగా చెప్పారని గుర్తుచేశారు. అక్రమ వసూళ్లకు పాల్పడుతుంటే ఇక హైడ్రా పారదర్శకత ఎక్కడ ఉన్నదని నిలదీశారు. అసెంబ్లీ మీడియా హాల్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ.. చెరువుల ఆక్రమణలను కూల్చడాన్ని బీజేపీ స్వాగతిస్తున్నదని, అయితే ఆక్రమణలపై ప్రభుత్వం దూకుడు తగ్గించకుండా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. పాతబస్తీ సల్కం చెరువు వద్ద జరుగుతున్న అక్రమ నిర్మాణాలను కూల్చే విషయంలో ప్రభుత్వం సమర్థంగా వ్యవహరించాలని కోరారు. సల్కం చెరువులో అక్రమంగా నిర్మించిన ఒవైసీ భవనాలకు ప్రత్యేక సమయం ఇవ్వడం వెనుక ఉన్న ఉద్దేశాలు ఏమిటి? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంఐఎంకు భయపడి పాతబస్తీ వైపు చూడటం లేదని ఆరోపించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ తన అధికారిక హోదాను వదిలిపెట్టి, రాజకీయ నాయకుడిగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 'మీరు కమిషనరా లేదా పొలిటికల్ లీడరా?' అని ప్రశ్నించారు.

అనుమతి ఇచ్చిన అధికారులపై కేసులు

ఆక్రమిత నిర్మాణాలకు సంబంధించి పోలీసులకు ఇరిగేషన్ శాఖ, హైడ్రా ఫిర్యాదు

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ స్థలాలు, ఎఫ్‌టీఎల్‌లో కబ్జా చేసి నిర్మించిన వారితోపాటు సహకరించిన అధికారులపై హైడ్రా కేసులు పెడుతున్నది. ఈ నెల 20న బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎర్రకుంట చెరువులో నిర్మాణాలు చేసిన మ్యాప్స్ ఇన్ మేనేజింగ్ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డిపై ఇరిగేషన్ అధికారులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఈ కట్టడాన్ని గతవారం హైడ్రా కూల్చేసింది. బిల్డర్ ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి నిర్మించడానికి నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్, బాచుపల్లి తహసీల్దార్, మేడ్చల్ ఏడీఈ, హెచ్‌ఎండీఏ ఏపీవోలను నిందితులుగా చేర్చాలంటూ గురువారం హైడ్రా ఫిర్యాదు చేసింది. మదీనాగూడలోని ఎర్ల చెరువులో నిర్మాణాలు చేశారంటూ చందానగర్‌లో ఇరిగేషన్ అధికారులు మరో కేసు నమోదు చేశారు. నిర్మాణాలు చేపట్టిన స్వర్ణలత, కృష్ణకిశోర్‌పై కేసు నమోదవగా, తాజాగా చందానగర్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీలను ఆ కేసులో నిందితులుగా చేర్చాలంటూ సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు.

దివ్యాంగుల ఇండ్లపైకి బుల్డోజర్

మొదటిపేజీ తరువాయి...

అస్సలనుకోలేదు! ఎలాంటి నోటీసులు లేకుండా రాత్రికి రాత్రే బుల్డోజర్లతో దిగిన అధికారయంత్రాంగం తెల్లవారుజాము వరకు ఏకంగా 75ఇండ్లను కూల్చడంతో వందలాది మంది బతుకులు రోడ్డున పడ్డాయి. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో రెవెన్యూ అధికారులు రెచ్చిపోయారు. రాష్ట్ర రాజధానిలో హైడ్రా పేరిట జరుగుతున్న కూల్చివేతల పర్వాన్ని పాలమూరులోనూ ప్రత్యక్షంగా చూపించారు. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని ఆదర్శనగర్‌లో 15 ఏండ్ల కిందట కాంగ్రెస్ హయాంలో పేదలకు ఇచ్చిన స్థలాల్లో కట్టుకున్న 75 ఇండ్లను ఎలాంటి నోటీసులు లేకుండా, ఆక్రమణలు అని తేల్చకుండా పోలీసు బందోబస్తు నడుమ నిశిరాత్రి నేలమట్టం చేశారు. బాధితులు నెత్తీనోరు బాదుకుంటూ కాళ్లావేళ్లా పడ్డా కనికరించలేదు. కూల్చినవాటిలో అంధులు, దివ్యాంగుల కుటుంబాలకు సంబంధించి 25 ఇండ్లు ఉన్నా దయ చూపలేదు. తెల్లవారుజామున 3 గంటలకు ప్రారంభమైన కూల్చివేతల పర్వం ఉదయం 6 గంటల వరకు ఏకధాటిగా సాగింది. తెల్లారేసరికే పేదల కలల సౌధాలు కండ్లముందే కూలిపోయాయి.

ఎవరి ఆదేశాల మేరకు వచ్చారో?

పాలమూరు కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలోనే ఆదర్శనగర్ ఉన్నది. ఎవరి ఆదేశాల మేరకు వచ్చారో తెలియదు కానీ రెవెన్యూ, పోలీసు సిబ్బంది హఠాత్తుగా బుధవారం అర్ధరాత్రి తర్వాత బుల్డోజర్లతో ప్రత్యక్షమయ్యారు. పడుకున్నవారిని లేపి

గురువారం తెల్లవారు జాము నుంచి కనిపించిన ఇంటినల్లా కూల్చేయడం మొదలుపెట్టారు. బాధితులు ఎవరూ దగ్గరికి రాకుండా పోలీసులను మోహరించారు. కొందరు శుభకార్యాల కోసం వివిధ ప్రాంతాలకు వెళ్లినవారంతా సమాచారం తెలిసి హుటాహుటిన పరిగెత్తుకొచ్చి కూలిన తమ ఇండ్లను చూసి లబోదిబోమన్నారు. మొండి గోడలను పట్టుకొని రోదించారు. మట్టిపెల్లల మధ్య మిగిలిన సామాన్లు తీసుకొని కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. ఓ కాంగ్రెస్ ప్రజాప్రతినిధి కనుసన్నల్లోనే ఇదంతా జరిగినట్టు తెలుస్తున్నది.

నాడు పట్టాలిచ్చి.. నేడు కూల్చి

మహబూబ్‌నగర్‌లోని 523 సర్వే నంబర్‌లో సుమారు 90 ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉన్నది. ఇందులో 30 శాతం భూమిలో గత కేసీఆర్ ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించి అందించింది. 15 ఏండ్ల కిందట సుమారు 2,000 మందికి పైగా ఇండ్లు లేని నిరుపేదలకు కాంగ్రెస్



మహబూబ్‌నగర్‌లోని ఆదర్శనగర్ కాలనీలో అధికారులు కూల్చివేసిన నిర్మాణాలు

ప్రభుత్వం ఇండ్ల పట్టాలు అందించింది. అప్పట్లో కంప చెట్లతో ఎగుడు దిగుడు స్థలాలు ఉండడంతో ఇండ్లు కట్టుకోలేక చాలా మంది ఖాళీగా ఉంచారు. కలెక్టర్ రొనాల్డ్‌రాస్ వచ్చాక చాలామంది అనర్హులున్నారని గుర్తించి కొందరి పట్టాలను రద్దుచేశారు. ఆ తర్వాత 500 మందిని అర్హులుగా ప్రకటించి మళ్లీ పట్టాలు ఇచ్చారు. ఇదేఅదనుగా రెవెన్యూ సిబ్బంది సహకారంతో కొందరు దళారులు పెద్ద ఎత్తున ఆదర్శనగర్‌లో పట్టాలు సృష్టించి స్థలాలు విక్రయించారు. రూ.లక్షలు పెట్టి పేదలు కొనుగోలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన పట్టాలను బీఆర్‌ఎస్ సర్కారు కొనసాగించింది. ఎలాంటి చర్యలు తీసుకోకుండా నివాసయోగ్యం కల్పించింది. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే పేదల ఇండ్లపై ప్రతాపం చూపింది.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే : తహసీల్దార్

పట్టణంలో సర్వే నంబర్ 523లోని మూడెకరాల్లో అక్రమ నిర్మాణాలు ఉన్నట్టు తేల్చామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే తొలగించామని అర్బన్ తహసీల్దార్ ఘన్సీరాం వెల్లడించారు. స్థానిక కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎవరి ఆదేశాల మేరకు ఇదంతా జరిగిందని అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పకుండా దాటవేశారు.

కలెక్టరేట్ ఎదుట బాధితుల ఆందోళన

ఆదర్శనగర్‌లో తమ ఇండ్లను కూల్చివేయడంతో బాధితులంతా కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగారు. కనీసం నోటీసులు ఇవ్వకుండా, ఎలాంటి సమాచారం లేకుండా తమ ఇండ్లను కూల్చివేశారని మండిపడ్డారు. తిరిగి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, నష్టపరిహారం కింద రూ.5 లక్షలు ఇవ్వాలని, కూల్చివేతకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'కాంగ్రెస్ వస్తే మార్పు వస్తుందని ఓట్లేసినం.. చివరికి ఆ ప్రభుత్వం చేసిన ఘన కార్యమిది' అంటూ కన్నీరుపెట్టారు. బాధితులెవరినీ అధికారులను కలవనీయకుండా పోలీసులు కట్టడి చేయడంతో చేసేది లేక బాధితులంతా వెనుదిరిగారు.

అంధులు, దివ్యాంగుల ఇండ్లనూ కూల్చిన సర్కార్

ఇండ్లు నేలమట్టమైన బాధితుల్లో మరుగుజ్జులు, దివ్యాంగులు, చివరికి అంధులు కూడా ఉన్నారు. వీరికి చెందిన 25 ఇండ్లను కూడా అధికారులు కూలగొట్టరు. 'గత ప్రభుత్వం ప్లాట్లుగా ఇచ్చిన భూముల్లోనే మా రక్తాన్ని చెమటగా ధారబోసి కట్టుకున్న ఇండ్లను ఒక్క రాత్రిలో కూలగొట్టింర్రు' అంటూ వారు కుమిలిపోతున్నారు. తమ దగ్గర ప్రభుత్వం ఇచ్చిన పట్టాలు ఉన్నాయని వాటిని చూపిస్తూ ఆందోళన చేశారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పరిశీలనకు రాగా ఆయన ఎదుట ఒక్కో బాధితుడు వచ్చి తమ గోడును వెల్లగక్కారు.

దివ్యాంగులు, పేదలన్న కనికరం లేదా? : మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

'దివ్యాంగులు, అంధులు అని కూడా చూడకుండా వారి ఇండ్లను కూలగొట్టారు. ఇండ్లు కూల్చితే పేదలు ఎక్కడ ఉండాలె అన్న ఆలోచన కూడా చేయకపోవడం దారుణం' అని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆవేదన వ్యక్తంచేశారు. గురువారం సాయంత్రం ఆదర్శనగర్‌లో కూలిన ఇండ్లను ఆయన పరిశీలించారు. విచారణ జరపకుండా, ఎలాంటి నోటీసులివ్వకుండా కూల్చివేయడం ఎంతవరకు సమంజసమని మండిపడ్డారు. బాధితులకు కూల్చిన చోటే ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, ఈ వ్యవహారంపై విచారణ జరిపి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులతో మాట్లాడి అండగా ఉంటామని భరోసానిచ్చారు. రోడ్డునపడ్డ పేదలకు వసతి, భోజన సదుపాయం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒకవేళ దొంగ పట్టాలుంటే వీళ్లకు పట్టాలిచ్చిన వారిపై కేసులు పెట్టాలని, పేదలకు అన్యాయం చేయడం తగదని చెప్పారు.

కాంగ్రెస్‌ను నమ్మితే ఇంటినే కూల్చింది



నా భర్త కాంగ్రెస్ మనిషి.. మా కాంగ్రెస్ అనుకుంట ఆ పార్టీలో తిరుగుతడు. ఇప్పుడు ఆ కాంగ్రెస్ పార్టే మాకు ఉండనీకి గూడు లేకుండజేసింది. నా కుడికాలు విరగడంతో రాడ్డు వేసింర్రు. ఇబ్బంది అయితే నిన్న దవాఖానకు పోయిన. డాక్టర్లు పరీక్షలు చేసింర్రు. టెస్టులు వచ్చాక ఏం చెప్తరో అని అక్కన్నే ఉన్న. పక్క ఇంటోల్లు ఫోన్ చేసి మీ ఇల్లు కూలగ్గొట్టింర్రు అని చెప్పంగనే గుండెల బండ వడ్డట్టయ్యింది. ఇక్కడికి వచ్చి చూసినంక దుఃఖం ఆగలే. ఎంత ఏడిస్తే ఏం లాభం. మొండి గోడలు మిగిలియన్. కడుపుమాడ్చుకొని కట్టుకున్న ఇంటిని కూలగొట్టింర్రు.. వీళ్ల శేతులకు జెట్టలువుట్ట.

- ఉప్పరి లలిత, బాధితురాలు, ఆదర్శనగర్, మహబూబ్‌నగర్

హైడ్రాకు మరిన్ని అధికారాలు

- ఓఆర్‌ఆర్ పరిధిలోని అన్ని చెరువులు, పార్కులు, నాలాలు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ బాధ్యతలు
- హైడ్రా నుంచే అన్ని రకాల ఆక్రమణలకు నోటీసులు : సీఎస్

హైదరాబాద్, ఆగస్టు 29(నమస్తే తెలంగాణ): ఆక్రమణల తొలగింపునకు సంబంధించి హైడ్రాకు మరిన్ని అధికారాలు అప్పగించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నదని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. ఓఆర్‌ఆర్ పరిధిలోని చెరువులు, పార్కులు, నాలాలు, ప్రభుత్వ స్థలాలు, వివిధ శాఖల కింద ఉన్న ఆక్రమణ స్థలాల పరిరక్షణకు నోటీసులు ఇచ్చే అధికారాన్ని హైడ్రాకు ఇవ్వనున్నట్టు వెల్లడించారు. చెరువుల ఆక్రమణల తొలగింపు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణపై రాష్ట్ర హైకోర్టు జారీ చేసిన ఆదేశాలను పరిగణనలోకి తీసుకుంటూ సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకు సీఎస్ గురువారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడారు. చెరువులు, కుంటలు, పార్కులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణల తొలగింపుపై ప్రస్తుతం నీటిపారుదల, జీహెచ్‌ఎంసీ, పురపాలక, పంచాయితీరాజ్, వాల్టా తదితర విభాగాలు వేర్వేరుగా నోటీసులు జారీ చేయడంతో గందరగోళం ఏర్పడుతున్నదని అభిప్రాయపడ్డారు. దీనిని నివారించడానికి ఓఆర్‌ఆర్ పరిధిలో అన్నిరకాల ఆక్రమణల తొలగింపు నోటీసులను హైడ్రా ద్వారానే చేపట్టేందుకు విధి విధానాలు ఖరారు చేయాలని మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ, ల్యాండ్ ఎన్‌క్రోచ్‌మెంట్, ల్యాండ్ గ్రాబింగ్, వాల్టా, నీటిపారుదల శాఖ చట్టాల ద్వారా జారీ చేసే అన్ని రకాల నోటీసులు, తొలగింపులను హైడ్రా పరిధిలోకి తెస్తామని వివరించారు. గండిపేట, హిమాయత్‌సాగర్ చెరువుల పరిరక్షణ జలమండలి నుంచి హైడ్రా పరిధిలోకి తెస్తామని వెల్లడించారు. హైడ్రా ఆధ్వర్యంలో మొత్తం 72 బృందాలు ఏర్పాటయ్యాయని, వీటిని మరింత బలోపేతం చేయడానికి కావాల్సిన పోలీస్, సర్వే, నీటిపారుదల శాఖల నుంచి అధికారులు, సిబ్బందిని త్వరితగతిన కేటాయిస్తామని తెలిపారు.



హైడ్రా కమిషనర్‌ను కలిసిన ఎంపీ అనిల్

25 లక్షల ఎంపీ నిధుల కేటాయింపు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ) : హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను గురువారం బుద్ధభవన్‌లోని ఆయన కార్యాలయంలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్‌ను కలిశారు. హైడ్రా పనితీరుపై హర్షం వ్యక్తం చేస్తూ ఎంపీ లాడ్స్ నుంచి రూ. 25 లక్షలు కేటాయిస్తూ కమిషనర్‌కు లేఖను అందజేశారు. హైడ్రాకు పూర్తి మద్దతు ఇస్తున్నామని ఎంపీ చెప్పారు. హైడ్రాను ఇతర జిల్లాల్లో కూడా అమలు చేయాలని ప్రభుత్వానికి వినతులు అందుతున్నాయని, ఆ మేరకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

హైడ్రా పేరుతో అవినీతికి పాల్పడితే చర్యలు

- అధికారులకు సీఎం హెచ్చరిక
- కూల్చివేతల బెదిరింపులపై ఫిర్యాదుల వెల్లువ

హైదరాబాద్, ఆగస్టు 29(నమస్తే తెలంగాణ): హైడ్రా పేరుతో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. హైదరాబాద్‌లో హైడ్రా పేరు చెప్పి భయపెట్టి, బెదిరించి కొందరు కిందిస్థాయి అధికారులు అవినీతికి పాల్పడుతున్నారంటూ వచ్చిన ఫిర్యాదులపై సీఎం స్పందించారు. గతంలో ఇచ్చిన నోటీసులు, రెండు మూడేండ్ల కిందటి ఫిర్యాదులను అడ్డంగా పెట్టుకొని కొన్నిచోట్ల రెవిన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందని చెప్పారు. ఇలాంటివాటికి పాల్పడేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. హైడ్రా పేరుతో వసూళ్లకు పాల్పడుతున్న అధికారులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఏసీబీ, విజిలెన్స్ అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అనంతరం గణేశ్ ఉత్సవాల నిర్వహణపై సచివాలయంలో రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. సమావేశానికి పలువురు మంత్రులు, సీఎస్, పోలీస్ శాఖ ఉన్నతాధికారులు, గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులు హాజరయ్యారు.

పేదలకు 7 రోజులు.. పెద్దలకు 30 రోజులు!

అది రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలంలోని దుర్గం చెరువు ప్రాంతం.. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో అక్రమ కట్టడాలను గుర్తించిన రెవెన్యూ అధికారులు దాదాపు 200కు పైగా నోటీసులు జారీ చేశారు. మాదాపూర్‌లోని అమర్ కో-ఆపరేటివ్ సొసైటీలో ఉంటున్న ముఖ్యమంత్రి సోదరుడు తిరుపతిరెడ్డితోపాటు కావూరిహిల్స్, నెక్టర్స్‌కాలనీ, డాక్టర్స్‌కాలనీ, అమర్‌సొసైటీ వాసులకు నెల రోజుల వ్యవధితో నోటీసులు జారీ చేశారు. నెలలోపు అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామని సదరు నోటీసులో పేర్కొన్నారు.

అది మేడ్చల్ మాల్కాజిగిరి జిల్లా ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో బోయిన్ చెరువు. 40 ఏండ్ల పైబడి కూలీ పనిచేసుకుంటున్న దాదాపు 120 కుటుంబాలకు బాలానగర్ రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్నదని, ఏడు రోజుల వ్యవధితో ఆక్రమణలను కూల్చివేస్తామని నోటీసుల్లో పేర్కొన్నారు.

- కూల్చివేతలు, నోటీసుల జారీలో ద్వంద్వ వైఖరి
- కొనసాగుతున్న ప్రభుత్వ 'హైడ్రా'మా

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): ఈ రెండు ఉదంతాలను పరిశీలిస్తే, హైడ్రా పేరుతో ప్రభుత్వం ఎలా ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నదో అర్థమవుతుంది. కొన్ని రోజులుగా హైడ్రా రోజుకో రీతిలో స్వరం మారుస్తూ, ఆక్రమణల కూల్చివేతల్లో ద్వంద్వ విధానాలను అమలు చేస్తున్నది. సామాన్య ప్రజల నుంచి బడా నేతలు, సెలబ్రేటీలకు చెందిన అక్రమ కట్టడాల కూల్చివేతలో తన, మన అనే తేడా లేకుండా ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి. కానీ, పేదోళ్ల గూడుపైనే అత్యధికంగా బుల్డోజర్ల దాడులు జరుగుతున్నాయి. ఆక్రమణలపై నోటీసుల జారీలోనూ ద్వంద్వ విధానాలు అమలు చేస్తున్నది. పేదోళ్లకు ఏడు రోజులు, పెద్దలకు 30 రోజులు సమయం ఇస్తూ వ్యత్యాసం చూపుతున్నది. ఇందుకు బోయిన్‌పల్లి బోయిన్‌చెరువు, దుర్గంచెరువు పరిధిలో ఉన్న నోటీసులు అందుకున్న వారే సాక్ష్యం.

హైడ్రా అడుగులన్నీ అనుమానాస్పదమే

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రభుత్వ ఆస్తులు, చెరువులు, కుంటలు, నాలాల పరిరక్షణే ధ్యేయంగా ఏర్పాటైన హైడ్రా.. ఏకపక్షంగా వ్యవహరిస్తున్నదనే విమర్శలను ఎదుర్కొంటున్నది. ఇప్పటికే నందగిరిహిల్స్ లేఅవుట్ విషయంలో పేదల బస్తీలపై ప్రతాపం చూపడంతో కాంగ్రెస్ పార్టీ పంచన చేరిన స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై సీఎంకు ఫిర్యాదు చేశారు. ఇటీవల శేరిలింగంపల్లి మండలంలోని రాయదుర్గం 1 నుంచి 41 వరకు ఉన్న సర్వే నంబర్లలో 37.08 ఎకరాల భూమి విషయంలో జరిపిన కూల్చివేతల్లో ఐదు కుటుంబాలను రోడ్డుపాలు చేశారు. తాజాగా బోయిన్‌పల్లి డివిజన్‌లోని పేదలపై ప్రతాపం చూపేందుకు రంగం సిద్ధంచేయడంతో బాధితులు హైడ్రాపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. నలభై ఏండ్లుగా ఇక్కడ కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నామని, గడిచిన నాలుగు రోజులుగా రెవెన్యూ విభాగం అధికారులు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధి అంటూ నోటీసులు ఇస్తున్నారని స్థానికులు వాపోయారు. 1980 నుంచి ఇండ్లు కట్టుకొని ఉంటున్నామని చెప్తున్నారు.



దుర్గం చెరువు బఫర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడి ఇల్లు

నోటీసుల జారీలో సమన్వయం ఏదీ?

ఓఆర్‌ఆర్ పరిధిలోని అన్ని చెరువులు, పార్కులు, నాలాలతోపాటు అన్ని ప్రభుత్వ స్థలాల పరిరక్షణ బాధ్యతలను హైడ్రాకు ప్రభుత్వం అప్పగించింది. అయితే, ఇప్పటి వరకు ఆక్రమార్కులకు హైడ్రా నోటీసులు జారీ చేయడం లేదు. నీటిపారుదల శాఖ, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, రెవెన్యూ శాఖలు ఎవరికి వారే అన్నట్టుగా నోటీసులు జారీ చేస్తున్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, నాలా ఆక్రమణ, వాల్టా చట్టం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఆయా శాఖలు వేర్వేరుగా నోటీసులు జారీ చేస్తున్నాయి. దీంతో ఈ వ్యవహారం గందరగోళంగా మారుతున్నది.

సమయం ఇవ్వండి.. సామాన్లు సర్దుకుంటాం: సీఎం సోదరుడు

దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో తన ఇల్లు ఉన్నదంటూ శేరిలింగంపల్లి రెవిన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి తెలిపారు. 2016-17లో అమర్‌సొసైటీలో నివాసం భవనం కొనుగోలు చేశానని, ఆ సమయంలో ఈ భవనం ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్టు తనకు ఎటువంటి సమాచారం లేదని చెప్పారు. తన ఇల్లు అక్రమంగా ఉంటే కూల్చివేయాలని, అందుకు తనకు కొంత సమయం ఇస్తే ఇంటిలోని ఫర్నీచర్ సహా ఇతర వస్తువులను తీసుకుని బయటకు వెళ్తానని పేర్కొన్నారు. ఈ లే అవుట్‌కు 1995లో అనుమతి ఇచ్చారని, తనపై కొందరు కావాలనే రాజకీయం చేస్తున్నారని వ్యాఖ్యానించారు.



ఇరిగేషన్ విభాగం గురువారం నోటీసులు జారీ చేసిన దుర్గంచెరువు సమీపంలోని అమర్‌సొసైటీ పరిధిలోని ఇండ్లు

కూల్చివేత కాదు.. షోకాజ్ నోటీసులు

- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు
- దుర్గంచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాల కూల్చివేతల నోటీసులపై పిటిషన్లు

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గుట్టలబేగం ప్రాంతంలో దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ ఏరియాలో నిర్మాణాల తొలగింపునకు ఇచ్చిన నోటీసులను షోకాజ్ నోటీసులుగా పరిగణించాలని హైకోర్టు ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ చేసింది. షోకాజ్ నోటీసులకు పిటిషనర్లు తమ వద్ద ఉన్న వివరాల ఆధారాలను సంబంధిత అధికారులకు చూపించాలని తెలిపింది. ఆధారాలను పరిశీలించాకే చర్యలు తీసుకోవాలని తెలిపింది. శేరిలింగంపల్లి మండలం గుట్టబేగంపేటలో 58.08 ఎకరాల్లో 280 ప్లాట్లతో వేసిన లేఔట్లలోని స్థలాలను కొనుగోలు చేసి 1998లో ఇండ్లు నిర్మించుకున్నవాళ్లను తొలగించేందుకు వాల్టా చట్టంలోని సెక్షన్-23 కింద డిప్యూటీ కలెక్టర్, తహసీల్దార్ నోటీసులు జారీచేశారు. వీటిని సవాలు చేస్తూ పలు వ్యాజ్యాలు దాఖలయ్యాయి. వాటిపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల న్యాయవాదులు వాదిస్తూ.. 1998లో వేసిన లేఔట్‌లోని ప్లాట్లలో ప్రభుత్వ శాఖల అనుమతులతో ఇండ్లను నిర్మించుకున్నారని వివరించారు. నోటీసు ఇవ్వకుండా, వివరణ కోరకుండానే ఇండ్లు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయని, వాటిని తొలగించేస్తామని నోటీసులు ఇచ్చారని తెలిపారు. కావూరిహిల్స్‌లోని అపార్టుమెంట్లు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయని చెప్తున్నారని, వాటిని తొలగించాలంటూ ఈ నెల 3న నోటీసులు ఇచ్చారని వెల్లడించారు. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి స్పందిస్తూ.. ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలను తొలగించాలంటూ డిప్యూటీ కలెక్టర్, తహసీల్దార్ ఇచ్చిన నోటీసులను షోకాజ్‌లుగా పరిగణిస్తామని, గడువులోగా పిటిషనర్ల వివరణ తీసుకుంటామని చెప్పారు. ఇందుకు హైకోర్టు అనుమతి ఇస్తూ విచారణను ముగిస్తున్నట్టు ప్రకటించింది.

హైడ్రాను రాష్ట్రమంతా అమలు చేస్తాం

- చెరువుల పరిరక్షణ కోసమే హైడ్రా ప్రయత్నం
- మంత్రి పొన్నం ప్రభాకర్



కరీంనగర్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): హైడ్రాను రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసే ఆలోచనలో ఉన్నామని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. గురువారం కరీంనగర్‌లోని క్రీడా పాఠశాలలో జరిగిన జాతీయ క్రీడా దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. హైడ్రా ఏర్పడక ముందే కరీంనగర్‌లో భూ ఆక్రమణదారులు, చెరువుల కబ్జాలపై చర్యలు తీసుకునేందుకు జిల్లా యంత్రాంగానికి పూర్తిగా స్వేచ్ఛనిచ్చామని, అన్ని రకాల చర్యలు తీసుకునే విధంగా అధికారులకు ధైర్యాన్ని ఇచ్చామని తెలిపారు. హైదరాబాద్ అయినా, ఏ జిల్లా యంత్రాంగమైనా ప్రభుత్వ ఉద్దేశం స్పష్టంగా ఉందని చెప్పారు. కరీంనగర్ పరిసరాల్లోని స్థలాల్లో ఆక్రమణలు జరుగుతున్నాయని, ఆధారాలుంటే.. ఆర్‌టీఐ ద్వారా సమాచారం ఇస్తే త్వరగా పరిష్కరించే ప్రయత్నం చేస్తామని చెప్పారు. ప్రభుత్వం ఏ స్థలాల మీద ఆంక్షలు విధించదని, కేవలం చెరువుల పరిరక్షణ కోసమే ప్రయత్నిస్తుందని వివరించారు.

విపత్తు నిర్వహణ వ్యవస్థ బలోపేతం

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 29(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో విపత్తుల నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేస్తున్నట్టు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం సచివాలయంలో వరద కార్యాచరణ ప్రణాళికపై మంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో వరదలపై సంబంధిత శాఖలు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర స్థాయిలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ తరఫున టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని చెప్పారు. ఎటువంటి విపత్కర పరిస్థితి ఎదురైనా అధిగమించడానికి వీలుగా అధునాతన పరికరాలను సిద్ధం చేసుకోవాలని కోరారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ బలోపేతానికి తీసుకుంటున్న చర్యలను హైడ్రా కమిషనర్ రంగనాథ్ వివరించారు. గతంలో 30 బృందాలు ఉండగా దాన్న 70కి పెంచామని, సిబ్బంది సంఖ్యను 1,800 నుంచి 3,500 వరకు పెంచినట్టు వివరించారు. హైడ్రాకు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని, అందుకు అవసరమైన ప్రతిపాదనలను పంపించాలని హైడ్రా కమిషనర్‌కు సూచించారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్, రెవెన్యూ శాఖ సంయుక్త కార్యదర్శి పాల్గొన్నారు.

సీఎం సోదరుడి ఇంటి వద్ద మరో మహిళా జర్నలిస్టుపై దౌర్జన్యం

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి ఇంటికి రెవెన్యూ శాఖ నోటీసులు జారీచేసేందుకు వెళ్లిన సమయంలో కవరేజీకి వెళ్లిన ఓ మహిళా జర్నలిస్టుపై ఆయన అనుచరులు దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఇటీవల సీఎం సొంత గ్రామం కొండారెడ్డిపల్లిలో ఇద్దరు మహిళా జర్నలిస్టులపై కాంగ్రెస్ కార్యకర్తల దాడి ఘటన మరువకముందే సీఎం సోదరుడి ఇంటివద్ద అలాంటి ఘటనే ఎదురైంది. మీడియా కవరేజీకి వచ్చిన ఓ మహిళా జర్నలిస్టును అడ్డుకోవడంతోపాటు, ఆమె కెమెరాను లాక్కోవడానికి తిరుపతిరెడ్డి అనుచరులు ప్రయత్నించడం వివాదాస్పదమైంది. కాగా విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులను అడ్డుకోవడం, మీడియాపై దాడి చేయడం కాంగ్రెస్ పాలనలో నిత్యకృత్యమైందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ప్రజాపాలన అని ప్రచారం చేసుకుంటూ, మీడియా స్వేచ్ఛను హరించడం సిగ్గుచేటని, మీడియా పై జరుగుతున్న వరుస దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని ఎక్స్ వేదికగా తెలిపారు.

ఫార్మా విలేజ్ వద్దే వద్దు

- ప్రాణాలైనా ఇస్తాం కానీ సాగు భూములను ఇవ్వం
- ప్రభుత్వ నిర్ణయంపై భగ్గుమంటున్న కొడంగల్
- రైతుల ఆందోళనలు, కార్యాలయాల ముట్టడి
- కాలుష్య ఫార్మా కంపెనీలు వస్తే ఊర్లు ఖాళీ అవుతాయంటూ రైతుల ఆవేదన
- వికారాబాద్ జిల్లా దుద్యాలలో భూ సేకరణకు నోటిఫికేషన్ జారీ


ఫార్మా విలేజ్ వద్దంటూ కేటీఆర్‌కు వివరిస్తున్న రైతులు (ఫైల్)

వికారాబాద్, ఆగస్టు 29(నమస్తే తెలంగాణ)/బొంరాస్‌పేట: సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో ఏర్పాటు చేయ తలపెట్టిన ఫార్మా విలేజ్‌కు వ్యతిరేకంగా రైతుల ఉద్యమిస్తున్నారు. నెల రోజులుగా ప్రతిరోజూ కడా కార్యాలయంతోపాటు తహసీల్దార్ కార్యాలయం ముందు రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. 'ప్రాణాలైనా ఇస్తాం కానీ ఎన్నో ఏండ్లుగా మా కుటుంబాలు ఆధారపడిన భూములను మాత్రం ఇచ్చేది లేదు' అని తెగేసి చెప్తున్నారు. కాలుష్యం వెదజల్లే ఫార్మా కంపెనీలు వస్తే తమ బతుకులు ఆగం అవుతాయని, ముంబై, దుబాయ్‌లకు వలస పోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. తాము వేసిన ఓట్లతో సీఎం అయిన రేవంత్‌రెడ్డి.. తమను రోడ్డు పాలు చేస్తామంటే ఊరుకునేది లేదని, తగిన బుద్ధి చెప్తామని హెచ్చరిస్తున్నారు. అసైన్డ్ భూములకు ఇచ్చిన విధంగానే పట్టా భూములకు కూడా అంతే నష్టపరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించడంతో ఒప్పుకునే ప్రసక్తే లేదని స్పష్టంచేస్తున్నారు. పట్టా భూములకు రెండింతలు అధికంగా నష్టపరిహారం ఇస్తామని స్థానిక అధికారులు సర్ది చెప్తున్నా శాంతించడం లేదు. జిల్లా కలెక్టర్ నుంచి గానీ, కడా అధికారి నుంచి కానీ అధికారికంగా ప్రకటన రాకపోవడంతో భూములిచ్చేది లేదని స్పష్టం చేస్తున్నారు. ఫార్మా విలేజ్‌కు సేకరించే పట్టా భూములకు ఇచ్చే నష్టపరిహారంతోపాటు ఫార్మా విలేజ్‌తో ఎలాంటి కాలుష్య సమస్యలు ఏర్పడవని ప్రభుత్వం నుంచి స్పష్టమైన అధికారిక ప్రకటన వచ్చేంత వరకు భూములిచ్చేది లేదని, భూముల వద్దకు వస్తే ఊరుకునేది లేదని రైతులు హెచ్చరిస్తున్నారు.

ఆది నుంచీ అడగడుగునా వ్యతిరేకత

కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల మండలంలో ఫార్మా విలేజ్ ఏర్పాటు చేయాలన్న నిర్ణయంపై ఆది నుంచీ వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ఫార్మా విలేజ్ కోసం హకీంపేట, పోలేపల్లి, లగచెర్ల గ్రామాల పరిధిలోని 1,274.25 ఎకరాల ప్రభుత్వ, పట్టా భూములను సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పట్టా భూములను సేకరించాలన్న నిర్ణయంపై రైతులు భగ్గుమంటున్నారు. తరతరాల నుంచి భూములపై ఆధారపడి జీవనం సాగిస్తున్నామని, ఇప్పుడు కంపెనీల కోసం భూములిచ్చి తాము ఎలా బతకాలని నిలదీస్తున్నారు. ఫార్మా విలేజ్ వల్ల గ్రామాల్లో నీటి, వాయు కాలుష్యం పెరుగుతుందని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని, పంటలు పండే పరిస్థితి ఉండదని రైతులు భావిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఫార్మా కంపెనీల కోసం సాగు భూములను ఇచ్చేది లేదని తెగేసి చెప్తున్నారు. ఇప్పటికే రైతులకు మద్దతుగా పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఆందోళనలు నిర్వహించాయి. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాస్తారోకోలు నిర్వహించారు. తమ గోడును కేటీఆర్, హరీశ్‌రావు దృష్టికి కూడా రైతులు తీసుకెళ్లారు. మూడు గ్రామాల రైతులు దుద్యాల తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీలు నిర్వహించగా, మంగళవారం పోలేపల్లి గ్రామానికి చెందిన ఒక మహిళా రైతు పురుగుల మందు డబ్బాతో ఆత్మహత్యా యత్నానికి ప్రయత్నించారు.

703.65 ఎకరాల సేకరణకు నోటిఫికేషన్

ఫార్మా విలేజ్‌పై రైతుల ఆందోళనను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పోలేపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 67లో 130 ఎకరాలు, హకీంపేటలోని 252 సర్వే నంబర్‌లో 366 ఎకరాలు, లగచెర్లలో 102 సర్వే నంబర్‌లో 140 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నది. ప్రభుత్వ భూమి సరిపోక పోవడంతో ప్రభుత్వ, పట్టా భూములను కలిపి మూడు గ్రామాల పరిధిలో మొత్తం 1274.25 ఎకరాలను సేకరించాలని నిర్ణయించింది. హకీంపేటలో 505.37 ఎకరాలు, పోలేపల్లిలో 130 ఎకరాలు, లగచెర్లలో 643 ఎకరాలను సేకరించాలని నిర్ణయించింది. ఇప్పటికే లగచెర్ల గ్రామ పరిధిలోని 632.26 ఎకరాలు, పోలేపల్లిలో 71.39 ఎకరాల పట్టా భూములను సేకరించడానికి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది.


ఫార్మా విలేజ్‌కు వ్యతిరేకంగా ధర్నా నిర్వహిస్తున్న రైతులు(ఫైల్)

మా భూములు మాకే ఉండాలి



ఫార్మా విలేజ్ మాకు వద్దే వద్దు. మా భూములు మాకే ఉండాలి. సాగు భూములను కంపెనీలకు ఇచ్చి మేమెలా బతకాలి. ఫార్మా కంపెనీల నుంచి వచ్చే కాలుష్యంతో మా ప్రాణాలకే నష్టం కలుగుతుంది.

-పుర్ర శ్రీమన్నారాయణ, మాజీ ఎంపీటీసీ పోలేపల్లి

రైతులను బజారు పాలు చేయొద్దు



ఫార్మా విలేజ్ కోసం సాగు భూములను లాక్కొని మమ్మల్ని బజారు పాలు చేయొద్దు. ఏడాదికి మూడు పంటలు పండించుకుని భూములనే నమ్ముకుని చాలామంది పేద రైతులు బతుకుతున్నారు. ఇప్పుడు అలాంటి భూములను కాలుష్యం వెదజల్లే ఫార్మా కంపెనీలకు ఇస్తే మేమంతా ఏం కావాలి.

-బోగమోని సురేశ్‌రాజ్, రైతు, లగచెర్ల.

కడుపు కొట్టొద్దు



భూములపైనే ఆధారపడి బతికే పేద రైతులం. వాటిని తీసుకుంటే మేం బతకలేము. భూములకు బదులుగా ఎన్ని రూ. లక్షలు ఇచ్చినా మాకు వద్దు. సాగు భూములను తీసుకుని రైతుల పొట్ట కొట్టొద్దు.. ఫార్మా కంపెనీ పెట్టి మమ్మల్ని ఇబ్బంది పెట్టొద్దు. ఫార్మా కంపెనీ వద్దని గతంలో కలెక్టర్‌తోపాటు కడా ప్రత్యేకాధికారికి, సీఎం సోదరుడు తిరుపతిరెడ్డికి కూడా చెప్పాం.

-కుమ్మరి శివకుమార్, హకీంపేట


కొండభీమనపల్లిలోని బీసీ గురుకుల పాఠశాలలో ఎలుకల దాడికి గురైన విద్యార్థులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

ఇవేం గురుకులాలు? ఇంత అధ్వానమా?

- ఎలుకలు కరిచిన ఘటనపై మాజీ ఎమ్మెల్యే ఆరా
- వసతిగృహానికి వెళ్లి విద్యార్థులకు రవీంద్రకుమార్ పరామర్శ

దేవరకొండ రూరల్, ఆగస్టు 29 : గురుకులాల్లో పరిస్థితులు రోజురోజుకు దిగజారుతుంటే కాంగ్రెస్ సర్కార్ ఏం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్ ప్రశ్నించారు. దేవరకొండ మండలం కొండభీమనపల్లి శివారులోని బీసీ బాలుర గురుకుల పాఠశాలలో 13 మంది విద్యార్థులను ఎలుకలు కరిచిన విషయం తెలుసుకున్న ఆయన గురువారం ఆ వసతి గృహాన్ని సందర్శించారు. విద్యార్థులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల మెదక్ జిల్లాలోని గురుకులంలో, డిండి ఎస్సీ బాలిక గురుకులంలో, తాజాగా కొండభీమనపల్లి గురుకులంలో విద్యార్థులపై ఎలుకలు దాడి చేశాయన్నారు. గురుకులాల్లో పరిస్థితి ఇంత అధ్వానంగా ఉంటే కాంగ్రెస్ సర్కార్ ఏం చేస్తుందని నిలదీశారు. ఓవైపు పాముకాట్లతో విద్యార్థులు ప్రాణాలు కోల్పోతుంటే.. మరోవైపు కలుషిత ఆహారం తిని దవాఖానపాలవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. 8 నెలల కాలంలో 500 మందికి పైగా విద్యార్థులు దవాఖానపాలు కాగా, 36 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. గురుకులాల అధ్వాన పరిస్థితికి, విద్యార్థుల మరణాలకు విద్యాశాఖకు బాధ్యుడిగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాల మీద నోరు పారేసుకోవడంమాని పాలన మీద దృష్టి పెట్టాలని సూచించారు.

సీఎం, మంత్రుల మొద్దునిద్ర

- గురుకుల సమస్యలపై పట్టించుకోని పాలకులు
- బీఆర్‌ఎస్ నేతలు వాసుదేవరెడ్డి, బాలరాజుయాదవ్



హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): గురుకులాల్లో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు మొద్దునిద్రలో ఉన్నారని బీఆర్‌ఎస్ నేతలు కే వాసుదేవరెడ్డి, బాలరాజుయాదవ్ ధ్వజమెత్తారు. హైడ్రా పేరిట ప్రజాసమస్యలను పక్కదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో గురువారం వారు మీడియా సమావేశంలో మాట్లాడారు. గురుకులాల్లో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని, రేవంత్ సర్కార్ ప్రభుత్వ గురుకుల వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నదని వాసుదేవరెడ్డి ఆరోపించారు. ఇప్పటివరకు 38 మంది గురుకుల విద్యార్థులు వివిధ కారణాలతో చనిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా సీఎం, మంత్రులకు చీమ కుట్టినట్టయినా లేదని ఆరోపించారు. చాలా రోజుల నుంచి తాము గురుకులాల స్థితిగతుల గురించి హెచ్చరిస్తూనే ఉన్నామని తెలిపారు. ఇలా ఎంతకాలం విద్యార్థులు బాధపడాలని ప్రశ్నించారు. ప్రజాపాలన పడకేసిందని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి గురుకులాల వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నారని బాలరాజు యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో గురుకులాలను కంటికి రెప్పలా కాపాడుకున్నారని తెలిపారు. రాష్ర్టానికి శనిలా రేవంత్ పాలన దాపురించిందని, ముందు ప్రజా సమస్యల పరిష్కారం గురించి ఆలోచించాలని హితవు పలికారు.

కాంగ్రెస్ పాలనకు గురుకులాలే నిదర్శనం

- సొంత శాఖపై సీఎం ఏంచేస్తున్నట్టు?
- విద్యార్థులను ఎలుకలు కరిచిన ఘటనపై హరీశ్ ఆగ్రహం

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): గురుకుల విద్యార్థులు ఎలుకలు కరిచి దవాఖానల పాలవుతుంటే సీఎం ఏం చేస్తున్నారంటూ మాజీమంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలన ఎట్లుందో చెప్పడానికి సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్న గురుకులాలే నిదర్శనమన్నారు. మొన్న రామాయంపేట గురుకుల పాఠశాలలో 12మంది విద్యార్థుల మీద, నిన్న నల్లగొండ జిల్లాలోని కొండభీమనపల్లి గురుకుల పాఠశాలలో 13 మంది విద్యార్థుల మీద ఎలుకల దాడి చేశాయని గురువారం ఎక్స్ వేదికగా హరీశ్ తెలిపారు. పాముకాటుకు గురై విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నారని, కలుషిత ఆహారం తిని, ఎలుకల కాటుకు గురై దవాఖానల పాలవుతున్నారని పేర్కొన్నారు. 8 నెలల కాలంలో 500 మం ది పైగా గురుకుల విద్యార్థులు దవాఖానల పాలయ్యారని, 36 మంది విద్యార్థులు ప్రా ణాలు కోల్పోయారని ఆందోళన వ్యక్తంచేశారు. విద్యాశాఖ మంత్రిగా కూడా ఉన్న రేవంత్‌రెడ్డే బాధ్యుడని స్పష్టం చేశారు.

లోన్ యాప్ వేధింపులకు యువకుడి ఆత్మహత్యాయత్నం

ఓదెల, ఆగస్టు 29 : లోన్ యాప్ వేధింపులు తాళలేక ఓ యువకుడు ఆత్యహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ కు చెందిన తూండ్ల శ్రీనివాస్ (27) లోన్ యాప్‌ల ద్వారా రూ.4 లక్షల వరకు రుణా లు తీసుకున్నాడు. కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్న అతడిని లోన యాప్ వాళ్లు ఫోన్లలో బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి కొలనూర్ రైల్వే స్టేషన్ సమీపానికి వచ్చి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. ఆ తర్వాత బంధువులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే వారు కొలనూర్‌కు వచ్చి అతడిని మొదట సుల్తానాబాద్, అక్కడి నుంచి కరీంనగర్ దవాఖానకు తరలించారు. పూర్తిగా కాలిన శ్రీనివాస్ పరిస్థితి విషమంగానే ఉన్నట్టు బంధువులు తెలిపారు.

ఓటరు జాబితా ఆధారంగానే బీసీ రిజర్వేషన్లు

- కామారెడ్డి డిక్లరేషన్‌కు కాంగ్రెస్ తిలోదకాలు
- అసెంబ్లీ తీర్మానం, 150 కోట్లు.. ఉత్త ముచ్చటే
- కాంగ్రెస్ మాట మార్చడంపై నిలదీస్తున్న బీసీ నేతలు
- 2న కలెక్టరేట్ల ముట్టడికి బీసీ సంఘాల పిలుపు



హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): బీసీ కులగణన చేపడతాం. రిజర్వేషన్లను 42శాతానికి పెంచుతాం. అంటూ అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హడావుడి చేసింది. సామాజిక, ఆర్థిక సర్వే నిర్వహిస్తామని అసెంబ్లీలో తీర్మానం చేసింది. రూ.150 కోట్లను మంజూరు చేస్తూ ఉత్తర్వులు సైతం జారీచేసింది. అదంతా ఉత్తముచ్చటేనని తేలిపోయింది. ఓటర్ల జాబితా ఆధారంగానే బీసీ రిజర్వేషన్ల స్థిరీకరణకు సిద్ధమైంది. చిట్‌చాట్ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఈ అంశాన్ని స్పష్టంగా తెలియజేశారు. అంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఉత్త ముచ్చటేనని తేటతెల్లమైంది.

కులగణన రాష్ట్రం పరిధి కాదు

జనగణన 1948 చట్టం ప్రకారం జనాభా లెక్కల సేకరణ, కులగణన చేపట్టే అధికారం కేవలం కేంద్రానికి మాత్రమే ఉన్నది. రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే కులగణనకు చట్టబద్ధత లేక పోగా.. వాటిని అమలు చేసే అవకాశం కూడా లేదు. ఇటీవల బీహార్ రాష్ట్ర సర్కారు నిర్వహించిన కులగణన కోర్టుకెక్కింది. బీహార్ ప్రభుత్వం కులగణన నిర్వహించి ఓబీసీ, ఎస్సీ, ఎస్టీల లెక్కలు తీసింది. వాటి ఆధారంగా రిజర్వేషన్లను 65 శాతానికి పెంచింది. ఈడబ్ల్యూఎస్ కోటా కలుపుకుంటే రిజర్వేషన్లు 75 శాతానికి పెరిగాయి. సుప్రీంకోర్టు గతంలో విధించిన 50 శాతం కోటా పరిమితిని మించిపోతున్నదని, బీహార్ ప్రభుత్వానికి కులగణన చేపట్టే అధికారాలు లేవని అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ పలువురు కోర్టుకెక్కారు. దీంతో రిజర్వేషన్ల అమలు మళ్లీ మొదటికి వచ్చింది.

అటకెక్కిన కులగణన

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో భాగంగా బీసీ కులగణన చేపడతామని, రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఎన్నికల అనంతరం పదేపదే ఈ అంశాన్ని పునరుద్ఘాటించారు. చట్టబద్ధత కల్పిస్తామని చెప్పి చివరకు అసెంబ్లీలో తీర్మానం చేయడంతోనే కాంగ్రెస్ తన మోసపూరిత వైఖరిని బయటపెట్టుకుంది. ఆ తరువాత కులగణనకు రూ.150 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసినా ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. కులగణన నిర్వహణపై బీసీ కమిషన్‌కు ఎలాంటి మార్గదర్శకాలను జారీ చేయలేదు. ఇప్పుడు ఏకంగా ఓటరు జాబితా ఆధారంగానే రిజర్వేషన్ల స్థిరీకరణ చేపడతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం గమనార్హం.

ఓటరు జాబితా ప్రకారమే..

చాలా రాష్ట్రాలు ఓటరు జాబితా ఆధారంగానే రిజర్వేషన్లను స్థిరీకరించాయి. ఇప్పుడు అదే బాటలో నడించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం మొగ్గు చూపుతున్నది. కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన తాజా ఓటరు జాబితాను అనుసరించి, గ్రామం, మండలం, నియోజకవర్గం, జిల్లా, రాష్ట్రం యూనిట్‌గా తీసుకుని బీసీ రిజర్వేషన్లను ఖరారు చేయనున్నారు. ఇందులో ఆయా యూనిట్ల వారీగా రాజకీయాల్లో ఆయా బీసీ వర్గాల ప్రాతినిధ్యం ఆధారంగా రిజర్వేషన్లను స్థిరీకరించనున్నారు.

ఒడిశా తరహాలోనే..

సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అనుసరించి గుజరాత్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ ఓటరు జాబితా ఆధారంగా బీసీల రిజర్వేషన్లను స్థిరీకరించాయి. బీహార్, కర్ణాటక సమగ్ర కులసర్వేలను నిర్వహించాయి. వాటి ఆధారంగా బీసీ రిజర్వేషన్లను స్థిరీకరించేందుకు కసరత్తు చేస్తున్నాయి. ఒడిశా ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను రద్దు చేసి, వాటన్నింటినీ జనరల్ స్థానాలుగా మార్చింది. అయితే బీసీలకు పార్టీ పరంగా 50 శాతం టిక్కెట్లను కేటాయించింది. ఇప్పుడు ఇక్కడ కాంగ్రెస్ సర్కార్ సైతం అదే ఎత్తుగడను అమలు చేసేందుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తున్నది. బీసీ కమిషన్‌ను నియమించి, రిజర్వేషన్లను 23 శాతంగా స్థిరీకరించాలని, మిగిలిన 19 శాతం రిజర్వేషన్‌ను పార్టీ పరంగా టిక్కెట్లు కేటాయించి, తద్వారా 42 శాతం హామీని నిలబెట్టుకోవాలనే చూస్తున్నట్టు తెలుస్తున్నది. దీనిపై రాజకీయవర్గాల్లో జోరుగా ప్రచారం కొనసాగుతున్నది. తాజాగా ఓటరు జాబితా ద్వారా రిజర్వేషన్ల స్థిరీకరణ అని సీఎం ప్రకటించడంతో అదే విషయం తేటతెల్లమవుతున్నది.

నిలదీస్తున్న బీసీ సంఘాలు..

కామారెడ్డి బీసీ డిక్లరేషన్ హామీని అమలు చేయాలని రాష్ట్రంలోని బీసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. సమగ్ర కులగణన నిర్వహించి, బీసీలకు ఉపకులాల వారీగా రిజర్వేషన్లు కల్పించిన అనంతరమే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని అల్టిమేటం జారీ చేస్తున్నాయి. గతంలో మాదిరిగానే ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం పూనుకుంటే తీవ్రస్థాయిలో పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నాయి.

2న బీసీ సంఘాల కలెక్టరేట్ల ముట్టడి

రాష్ట్రంలో సమగ్ర కుల గణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ రెండున రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ల ముట్టడి చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. అందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను దోమలగూడలోని బీసీ భవన్‌లో గురువారం ఆవిష్కరించారు సమగ్ర కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అగ్రనేత ఒకమాట చెప్తుంటే, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మరోవిధంగా వ్యవహరిస్తున్నదని ధ్వజమెత్తారు. రాజకీయ పార్టీలకతంగా సమస్త బీసీ సమాజం ప్రత్యక్షంగా పాల్గొని కలెక్టరేట్ల ముట్టడిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వినాయక చవితి తర్వాత లక్ష మందితో హైదరాబాదును దిగ్బంధిస్తామని హెచ్చరించారు.


లంచం తీసుకుంటూ పట్టుబడిన శ్రీనివాస రాజు

మేడ్చల్ కలెక్టరేట్‌లో ఏసీబీ దాడి

లక్ష లంచం తీసుకుంటుండగా పట్టుబడిన అసిస్టెంట్ రిజిస్ట్రార్

మేడ్చల్ కలెక్టరేట్, ఆగస్టు 29: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ రూ.లక్ష లంచం తీసుకుంటూ పట్టుబడి అరెస్టు అయ్యాడు. జిల్లాకు చెందిన నవభారత్ కో-ఆపరేటివ్ బ్యాంకు అధికారులు, ఖాతాదారులకు ఇటీవల వివాదం చోటుచేసుకున్నది. ఖాతాదారులు తమ సమస్యను పరిష్కరించాలని జిల్లా కో ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ బీ శ్రీనివాసరాజును 24న ఆశ్రయించారు. సమస్యను పరిష్కరించేందుకు రూ.5 లక్షల లంచం ఇవ్వాలని అసిస్టెంట్ రిజిస్ట్రార్ డిమాండ్ చేశాడు. రూ.లక్ష ఇస్తామని ఒప్పందం చేసుకున్నారు. ఏసీబీ అధికారులను ఆశ్రయించిన ఖాతాదారులు గురువారం కలెక్టరేట్‌లోని ఆ అధికారిని కలవగా, తన కారులో ఆ లంచం సొమ్ము పెట్టాలని చెప్పాడు. ఖాతాదారులు ఆ డబ్బును కారులో పెట్టగానే, పథకం ప్రకారం ఏసీబీ అధికారులు వచ్చి అనంతరం అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాసరాజును అదుపులోకి తీసుకొని, సొమ్మును స్వాధీనం చేసుకున్నారు.

• తాగునీటి కోసం మహిళల ఆందోళన


భూపాలపల్లిలోని కారల్ మార్క్స్ కాలనీ 25వ వార్డులో తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం సీపీఐ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో మహిళలు ధర్నా నిర్వహించారు. తాగు నీటి సౌకర్యం లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ నాయకులు సతీష్, ప్రవీణ్ తెలిపారు.- భూపాలపల్లి రూరల్

• సాగునీటి కోసం రోడ్డెక్కిన రైతన్న


వరద కాల్వకు నీళ్లివ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం కుక్కడంలో అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై 8 గ్రామాల రైతులు రాస్తారోకో చేశారు. 28 రోజుల క్రితం మంత్రులు వరద కాల్వ నీటిని విడుదల చేసినా నేటికీ చివరి భూములకు నీరందడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాడ్గులపల్లి, దాచారం, చెరువుపల్లి, ఇందుగుల, మర్రిగూడెం, తోపుచర్ల గ్రామాల రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నదని ఆవేదనచెందారు. – మాడ్గులపల్లి

• ఓసీ-3 వద్ద కొండంపల్లి గ్రామస్థుల ధర్నా


జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం ధర్మరావుపేట శివారులోని ఓసీ-3 వద్ద కొండంపల్లి గ్రామస్థులు గురువారం ధర్నా నిర్వహించారు. తమ పిల్లలకు ఉపాధి, ఉద్యోగాలు వస్తాయనే ఆశతో విలువైన పంట భూములను సింగరేణి యాజమాన్యానికి అందిస్తే వారి భవిష్యత్‌ను అంధకారం చేస్తున్నదని వారు మండిపడ్డారు. – గణపురం

• కొనసాగుతున్న బీసీ డిక్లరేషన్ దీక్ష


బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని వరంగల్ జిల్లా గీసుగొండలో రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమారస్వామి చేపట్టిన నిరాహార దీక్ష గురువారం నాటికి ఐదో రోజుకు చేరుకున్నది. ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ భిక్షపతి, కుడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్, బీఆర్‌ఎస్ నాయకుడు సాంబారి సమ్మారావు శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. – గీసుగొండ

కారుణ్య నియామకాలు చేపట్టాలి: టీఎన్జీవో


హైదరాబాద్, ఆగస్టు 29(నమస్తే తెలంగాణ): జిల్లా పరిషత్‌లలో పని చేస్తూ మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు కల్పించాలని టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం హుస్సేని డిమాండ్ చేశారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యను పరిష్కరించాలని కోరారు. 2016లో దరఖాస్తు చేసుకున్న వారికి సైతం ఉద్యోగాలివ్వలేదని, వీరికి జిల్లా పరిషత్ వివిధ కార్యాలయాల్లో ఉద్యోగాలు కల్పించాలని కోరారు. బాధితులు గురువారం నాంపల్లిలోని టీఎన్జీవో భవన్‌లో అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, నాయకులతో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు.


టీఎన్జీవో భవన్‌లో మారం జగదీశ్వర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు


సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నేతలు

కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించండి

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ) : టూరిజం సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని తెలంగాణ టూరిజం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. గురువారం సీఎం నివాసంలో ఎమ్మెల్యే సాంబశివరావుతో కలిసి యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజమౌళి వినతిపత్రాన్ని సమర్పించారు.


కరీంనగర్ జిల్లా గుండ్లపల్లిలో ఎమ్మెల్యే కవ్వంపల్లిని అడ్డుకున్న గ్రామస్థులు

ఎమ్మెల్యే కవ్వంపల్లికి నిరసన సెగ

గన్నేరువరం, ఆగస్టు 29: కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం గుండ్లపల్లిలో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు నిరసన సెగ తగిలింది. గుండ్లపల్లి ఎక్స్ రోడ్డు వద్ద ఉన్న ప్రాంతాన్ని ఒక గ్రామంగా, లోపలి వైపు ఉన్న ప్రాంతాన్ని మరో గ్రామంగా విభజిస్తున్నారన్న సమాచారం మేరకు వారు ఆయన్ను నిలదీశారు. దీంతో చేసేదేమీ లేక ఎమ్మెల్యే అక్కడి నుంచి తిరిగి వెళ్తుండగా స్థానిక కాంగ్రెస్ నాయకులు కలుగజేసుకొని గ్రామస్థులకు సర్ది చెప్పించారు. ఎమ్మెల్యేను తీసుకొచ్చి ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమానికి శంకుస్థాపన చేయించారు. గ్రామస్థులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. గ్రామాన్ని విభజించకుండా తనవంతు ప్రయత్నం చేస్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు.



జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో జాతీయ రహదారిపై రైతుల నిరసన

రుణమాఫీపై రైతన్న కన్నెర్ర

షరతులు లేకుండా మాఫీ చేయాలని డిమాండ్

నమస్తే తెలంగాణ న్యూస్‌నెట్‌వర్క్, ఆగస్టు 29: అర్హతలున్నా రుణమాఫీ కాని రైతులు గర్జించారు. రేవంత్‌రెడ్డి సర్కార్ తీరును నిరసిస్తూ గురువారం జగిత్యాల, పెద్దపల్లి, కామారెడ్డి జిల్లాలో ధర్నాలు చేపట్టారు. కాగా జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో నిర్వహించిన అఖిలపక్ష మహాధర్నాలో మెట్‌పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాలకు చెందిన వందలాది మంది రైతులు పాల్గొన్నారు. మొదట మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి ర్యాలీగా 63వ జాతీయరహదారి మీదుగా పాత బస్టాండ్ వద్దకు చేరుకున్నారు. శాస్త్రీ చౌక్ వద్ద రహదారిపై బైఠాయించి తమ నిరసన తెలిపారు. నినాదాలతో హోరెత్తించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందంటూ మండిపడ్డారు. సుమారు గంటన్నరపాటు రైతుల మహాధర్నా చేపట్టగా ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం అందుకున్న ఆర్డీవో శ్రీనివాస్, డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు రైతుల వద్దకు వచ్చి వినతిపత్రం తీసుకున్నారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ రైతుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. కాగా ఇదే జిల్లాలోని మేడిపల్లిలోనూ రైతులు ధర్నాకు దిగారు. పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద రైతులు నిరసన తెలిపారు. సర్వర్ డౌన్ కావడంతో రైతులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి జిల్లా చిన్న మల్లారెడ్డి గ్రామంలో రైతులు ఆందోళనకు దిగారు.



కామారెడ్డి జిల్లా చిన్నమల్లారెడ్డిలో రోడ్డుపై బైఠాయించిన రైతులు

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి: సీపీఎం

సంగారెడ్డి కలెక్టరేట్/బచ్చన్నపేట/రామగిరి, ఆగస్టు 29: ఎలాంటి షరతులు లేకుండా వెంటనే రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టారు. ఆయా జిల్లాల్లోని కలెక్టరేట్లు, మండల కార్యాలయాల ఎదుట ధర్నాలు చేపట్టి అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి, డీఆర్వోకు వినతి పత్రం అందజేశారు. జనగామ జిల్లా బచ్చన్నపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. నల్లగొండ కలెక్టరేట్, భువనగిరి ఆర్డీవో కార్యాలయం, మోత్కూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు.

రైతును ముంచిన గజదొంగ రేవంత్

మొదటిపేజీ తరువాయి...

మరే గ్రామంలోనైనా పర్యటిద్దామని.. 100 శాతం రుణమాఫీ అయినట్టు చూపించాలని సవాల్ విసిరారు. గురువారం తెలంగాణభవన్‌లో మీడియాతో ఇష్టాగోష్టిలో మాట్లాడిన హరీశ్‌రావు.. రుణమాఫీ విషయంలో రాహుల్ గాంధీని కూడా రేవంత్ తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. దొంగే దొంగ దొంగా అన్నట్టుగా రేవంత్ వ్యవహారం ఉన్నదని విమర్శించారు. మాఫీ విషయంలో మంత్రులు ఒకలా, సీఎం మరోలా.. పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తున్నారని అన్నారు. రుణమాఫీ అంశంపై రేవంత్ ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదని.. డిసెంబర్ 9 అని, మార్చి అని, ఆ తర్వాత ఆగస్టు 15 అని చెప్పి ఎందుకు ఇంకా మాఫీ చేయలేకపోయారని నిలదీశారు.

రేవంత్ 3 సార్లు పిలిచినా రాహుల్ రాలె

రుణమాఫీ విషయంలో ప్రజలనే కాదు రాహుల్‌గాంధీని కూడా రేవంత్‌రెడ్డి తప్పుదోవ పట్టిస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. వరంగల్ సభకు రాహుల్‌ను రేవంత్ మూడు సార్లు పిలిచినా ఆయన రావటం లేదని తెలిపారు. రాహుల్‌గాంధీ ఎప్పుడు హైదరాబాద్ వస్తారో చెప్తే, తాను ఎయిర్‌పోర్టుకు వెళ్లి ఆయనకు స్వాగతం పలికి సీఎం సొంత గ్రామం కొండారెడ్డిపల్లికి తీసుకెళ్తానని, రుణమాఫీ అయ్యిందో లేదో తెలుతుందని స్పష్టంచేశారు. రుణమాఫీ పూర్తయితే గ్రీవెన్స్ అవసరం ఎందుకు? అని నిలదీశారు. మాఫీపై తాము నివేదిక ఇస్తే సీఎం పదవిలో ఆయనెందుకు? అని ఎద్దేవా చేశారు. ప్రజల కోసం పోరాడే బాధ్యతను ప్రజలు బీఆర్‌ఎస్‌కు ఇచ్చారని, ఆ బాధ్యతను నిర్వర్తిస్తామని తేల్చిచెప్పారు. బీఆర్‌ఎస్ అంటేనే భారత రైతు సమితి అని వెల్లడించారు. గతంలో ఓ మీడియా చిట్‌చాట్‌లో విద్యుత్తు బకాయిలను అదానీకి అప్పగిస్తామని రేవంత్ చెప్పారని, ఇదే విషయాన్ని తాము అసెంబ్లీలో అడిగితే తామెక్కడ అన్నామని బుకాయించారని గుర్తుచేశారు.

> రాహుల్‌గాంధీ అదానీ వద్దు అంటే రేవంత్‌రెడ్డి అదానీ కావాలని అంటున్నరు. అసలు ఇక్కడ ఉన్నది రాహుల్ కాంగ్రెస్సా? రేవంత్ కాంగ్రెస్సా?
>
> వక్రబుద్ధి ఉంటే అన్నీ వంకరగానే కనిపిస్తయ్. ఓటుకునోటు కేసులో రేవంత్‌కు బెయిల్ బీజేపీ ఇస్తేనే వచ్చిందా? రేవంత్‌కు సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసింది. ఇప్పటికైనా వైఖరి మార్చుకోవాలె
>
> - హరీశ్‌రావు

అసలు రేవంత్ మీడియాతో మాట్లాడేది చిట్‌చాట్ కాదని, చీట్‌చాట్ అని విమర్శించారు.

సీఎంగా ఉండి సుప్రీం తీర్పును తప్పుబట్టడమా?

సీఎం స్థాయిలో ఉండి సుప్రీంకోర్టు తీర్పును తప్పుబట్టడం నేరమని రేవంత్‌పై హరీశ్ ధ్వజమెత్తారు. సిసోడియాకు బెయిల్ వస్తే బీజేపీతో పోరాటం, కవితకు బెయిల్ వస్తే బీజేపీతో లాలూచీనా? అని సీఎంను ప్రశ్నించారు. సిసోడియాకు బెయిల్ వస్తే ఏఐసీసీ సానుకూలంగా స్పందించిందని, అదే కేసులో కవితకు బెయిల్ వస్తే రాష్ట్ర కాంగ్రెస్ విరుద్ధంగా స్పందిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సలహాదారుడిగా ఉన్న కే కేశవరావు కూడా కవిత బెయిల్ విషయంలో సానుకూలంగా స్పందించారని, రేవంత్ మాత్రం వక్రభాష్యం చెప్తున్నారని అన్నారు. బెయిల్‌పై రేవంత్, బండి సంజయ్ వ్యాఖ్యలు ఒకే తీరుగా ఉన్నాయని మండిపడ్డారు. కవిత బెయిల్ విషయంలో న్యాయం, ధర్మం గెలిచిందని.. ఈడీ, సీబీఐపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసిందని గుర్తుచేశారు.

తెలంగాణ తల్లికి రూపం ఇచ్చిందే కేసీఆర్

తెలంగాణ తల్లి విగ్రహానికి సీఎం రేవంత్ శంకుస్థాపన చేస్తే మంత్రులు ఎవరు రాలేదని హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ తల్లికి రూపం ఇచ్చిందే కేసీఆర్ అని చెప్పారు. తెలంగాణ తల్లి భావనకు రూపం ఇచ్చింది కేసీఆరేనని, తెలంగాణ లేకుండా తెలంగాణ తల్లి రూపం ఎక్కడదని, తెలంగాణను తీసుకవచ్చిందే కేసీఆర్ అని స్పష్టం చేశారు. కేసీఆర్ ఆనవాళ్లపై రేవంత్‌రెడ్డి నిలబడ్డారని గుర్తుచేశారు.

వాల్మీకి స్కాంపై కాంగ్రెస్ చప్పుడు చేయదేం?

వాల్మీకి స్కాం పట్టపగలు నిలువు దోపిడీ అని హరీశ్ రావు ఆరోపించారు. వాల్మీకి స్కాంతో డబ్బు, కార్లు, బంగారం, మద్యం షాపులకు నేరుగా వెళ్లాయని అన్నారు. తెలంగాణకు చెందిన 9 కంపెనీల అకౌంట్స్‌కు కర్ణాటక వాల్మీకి ప్రభుత్వ సంస్థ నుంచి డబ్బులు బదిలీ అయ్యాయని, వాల్మీకి స్కాంపై కాంగ్రెస్ నేతలు ఎందుకు నోరు మెదపటం లేదని ప్రశ్నించారు. ఈ డబ్బు ఎవరికి వచ్చిందో విచారణకు సిద్ధమా? అని సీఎం రేవంత్‌కు సవాల్ విసిరారు. ఈ స్కాంపై తెలంగాణ బీజేపీ ఎందుకు స్పందించటం లేదని ఎండగట్టారు. రాష్ట్రంలో ఆ రెండు పార్టీలు కుమ్మక్కయ్యాయని, స్కాంపై తెలంగాణలో ఈడీ విచారణ ఎందుకు జరగటం లేదని అనుమానం వ్యక్తం చేశారు. రాహుల్‌గాంధీ, కేంద్రమంతులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. వాల్మీకి స్కాంపై విచారణ చేయాలని బీఆర్‌ఎస్ తరఫున ఈడీని కలుస్తామని తెలిపారు. రాష్ట్రంలో పౌరసరఫరాల సంస్థపైనా ఈడీ విచారణ జరపాలని, ఎఫ్‌సీఐ కేంద్రం సంస్థ అయినందున దీనిపై కూడా ఈడీ విచారణ జరపాలని డిమాండ్ చేశారు.




మీడియా ప్రతినిధులతో హరీశ్‌రావు చిట్‌చాట్

ఫోర్త్ సిటీ పేరుతో భూ దందా

హైదరాబాద్ ఫోర్త్ సిటీ పేరుతో ప్రభుత్వ భూములు కొల్లగొట్టే కుట్ర జరుగుతున్నదని హరీశ్‌రావు ఆరోపించారు. సమయం వచ్చినప్పుడు అన్ని వివరాలను ఆధారాలతో సహా బయటపెడతామని ప్రకటించారు. కందుకూరులో సర్వే నంబర్ 9లో 385 ఎకరాల ప్రభుత్వభూమిని కొల్లగొడుతున్నారని, తుక్కుగూడలో సర్వే నంబర్ 892/1లో 25 ఎకరాలు పేద రైతుల దగ్గర బినామీల పేరుతో తీసుకుంటున్నారని ఆరోపించారు. ముచ్చర్లలో ప్రభుత్వంలో పెద్దలుగా చలామణీ అవుతున్న తమ్ముళ్ల పీఏల పేరు మీద భూములు కొంటున్నారని వెల్లడించారు. వీటన్నింటికీ తమ వద్ద ఆధారాలు ఉన్నాయని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ మెజారిటీ తగ్గిందని, రేవంత్‌రెడ్డి దగ్గర ఉండి డీకే అరుణను గెలిపించారని, మోదీతో మాట్లాడుకొని వచ్చి తెలంగాణలో బీజేపీ ఎంపీలను రేవంత్‌రెడ్డి గెలిపించారని ఆరోపించారు. ఇచ్చిన మాట ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

> రుణమాఫీ చేస్తామని మోసం చేశామని రేవంత్ అంటున్నరు..
>
> రుణమాఫీ జరగనేలేదని మంత్రులు, ఎమ్మెల్యేలు అంటున్నరు..
>
> ఓ ఎమ్మెల్యే అయితే ఏకంగా అధికారులపై పేపర్లు విసిరేశారు..
>
> రుణమాఫీ ప్రక్రియ కొనసాగుతున్నదని తుమ్మల చెప్తున్నరు..
>
> మరో 20 లక్షల మందికి రుణమాఫీ చేయాలని ఉత్తమ్ అన్నారు..
>
> ఇంకా రుణమాఫీ చేయాల్సి ఉన్నదని పొంగులేటి చెప్తున్నరు..
>
> రైతు రుణమాఫీపై కాంగ్రెస్ నేతలే తలా ఒక రకంగా మాటలు

> కాంగ్రెస్ ప్రభుత్వం అంటే కూల్చివేతల సర్కార్
>
> హైదరాబాద్ బ్రాండ్‌ను, రైతుబంధును కూల్చివేశారు
>
> వైద్య వ్యవస్థను, కేసీఆర్ కిట్‌ను కూల్చేశారు
>
> పార్టీ ఫిరాయింపులతో ప్రజాస్వామ్యాన్ని కూల్చేశారు
>
> దేవుళ్లపై ఒట్టు వేసి ప్రజల విశ్వాసాలను కూల్చేశారు
>
> గొర్రెల పంపిణీ చేయకుండా గొర్రెల కాపర్ల ఉపాధిని కూల్చేశారు
>
> చేపపిల్లల పంపిణీ చేయకుండా మత్స్యకారుల ఉపాధిని కూల్చారు
>
> - హరీశ్‌రావు



ముందు హైడ్రా ఆఫీసు కూల్చండి

చారిటీ స్టార్ట్ ఫ్రమ్ హోం అనేది సామెత ఉన్నదని, దానిలోభాగంగా ముందుగా హైడ్రా ఆఫీసును కూల్చాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. హైడ్రా ఆఫీసు బుద్ధభవన్ నాలా కింద ఉన్నదని, దాన్నీ కూలగొడతారా? రంగనాథ్ ముందుగా తన ఆఫీసును కూలగొట్టుకొని ఇతరులకు ఆదర్శంగా నిలవాలని అని సూచించారు. జీహెచ్‌ఎంసీ ఆఫీసు నాలా కింద ఉన్నదని, నెక్లెస్‌రోడ్‌లో కమర్షియల్ షాపులు, ఇతర వాణిజ్య భవనాలను కూలగొడతారా? లుంబినీ పార్కు కూడా హుస్సేన్‌సాగర్‌లోనే ఉన్నది.. బోట్స్ క్లబ్, సెయిలింగ్ క్లబ్ ఇలా ఎన్నో హుస్సేన్‌సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ఉన్నాయి.. వాటినీ కూల్చాలని హరీశ్ డిమాండ్ చేశారు. మీరాలం చెరువు, ఉప్పల్, రామాంతపూర్ చెరువుల్లో పెద్దపెద్ద టవర్లు వచ్చాయని, వాటిని కూలగొట్టి వారికి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులను సస్పెండ్ చేయాలంటున్న సీఎం.. అందరికీ ఒకటే రూల్ ఉండాలని, కాంగ్రెస్‌లో ఉన్న పట్నం మహేందర్‌రెడ్డి, గుత్తా అమిత్‌రెడ్డిని కూడా సస్పెండ్ చేయాలని సవాల్ విసిరారు. మంత్రి పొంగులేటి ఇంట్లో డ్రైనేజీ నీళ్లు చెరువులోకి వెళ్లడం లేదా? పొంగులేటి ఇంటికి ఏమైనా స్పెషల్‌గా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఉన్నదా? అంటూ నిలదీశారు. డ్రైనేజీ నీళ్లు చెరువుల్లోకి పోతున్నాయంటున్న సీఎం.. పరోక్షంగా పొంగులేటిని తిడుతున్నారని అన్నారు. తమ పార్టీ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కాలేజీని గతంలో కూల్చివేశారని గుర్తుచేశారు. హైడ్రా కొందరి భవనాలను వెంటనే కూల్చి, మరికొందరికి సమయం ఇస్తున్నదని.. ఒక్కో రకంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు.

విష జ్వరాలకు ముగ్గురి బలి

స్టేషన్ ఘన్‌పూర్/తిరుమలాయపాలెం/హసన్‌పర్తి, ఆగస్టు 29: రాష్ట్రంలో వేర్వేరు చోట్ల విష జ్వరాలతో ముగ్గురు మృతి చెందారు. వివిధ దవాఖానల్లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృత్యువాతపడ్డారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మోడల్ కాలనీకి చెందిన డీసీఎం డ్రైవర్ కొరిమి ఆంజనేయులు (48), ఖమ్మం జిల్లాలో దమ్మాయిగూడేనికి చెందిన బాలిక మహన్య (6), జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం ముల్కలపల్లికి చెందికి అనుమాల నర్సింహారెడ్డి(13) విషజ్వరాలతో మృతిచెందారు.

మెరుగైన వైద్యం అందించాలి

నిర్లక్ష్యంగా వ్యవహరించే వైద్యులపై చర్యలు .. వైద్యారోగ్య శాఖ మంత్రి రాజనర్సింహ



వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి దామోదర రాజనర్సింహ

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ) : సీజనల్ వ్యాధుల కట్టడిలో భాగంగా ఇంటింటికీ జ్వర సర్వే నిర్వహించి బాధితుల రక్తనమూనాలు సేకరించి మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కార్యాలయంలో సీజనల్ వ్యాధుల కట్టడిపై అన్ని జిల్లాల వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు, డెంగ్యూ కేసులు ఎక్కువగా నమోదయ్యే హైరిస్క్ ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల కట్టడిలో భాగంగా ఏర్పాటుచేసిన కంట్రోల్‌రూమ్‌కు రోజువారీ రిపోర్టు అందించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు, డెంగ్యూ కట్టడిపై హెచ్‌వోడీ, జిల్లా స్థాయిలో డీఎంహెచ్‌ఓలు క్షేత్రస్థాయిలో పర్యటించి తీసుకుంటున్న చర్యలపై నివేదిక సమర్పించాలని మంత్రి స్పష్టంచేశారు. ఎలీసా టెస్టు చేయకుండా ర్యాపిడ్ టెస్ట్ ద్వారా డెంగ్యూ నిర్ధారణ చేసి ప్రజలను ఆందోళనకు గురిచేసే దవాఖానలను గుర్తించి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం రాష్ట్రంలో జరుగుతున్న జీవన్‌దాన్ కార్యక్రమంలో భాగంగా అవయవ మార్పిడిపై చర్చించారు. కార్యక్రమంలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చోంగ్తూ, ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, టీజీఎంఎస్‌ఐడీసీ ఎండీ హేమంత్ వాసుదేవరావు, ప్రజారోగ్య శాఖ సంచాలకుడు డాక్టర్ రవీందర్‌కుమార్, డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ వాణి పాల్గొన్నారు.

జ్వరాలతో చస్తుంటే పట్టించుకోరా?

- సర్కార్ దవాఖానల్లో మందుల కొరత తీర్చాలి: హరీశ్‌రావు

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): పల్లె, పట్టణం తేడా లేకుండా ప్రజలు జ్వరాలతో చస్తుంటే ప్రభుత్వానికి పట్టింపు లేదా? అని మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే విషజ్వరాలతో ప్రాణాలు కోల్పోయే దుస్థితి దాపురించిందని మండిపడ్డారు. పాలన గాడి తప్పిందని, ఇందుకు మంచంపట్టిన పల్లెలే నిదర్శనమని చెప్పారు. పల్లెల్లో పారిశుధ్యం పడకేసిందని, ఏ ఊరిలో చూసినా ప్రజలు రోగాలతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రతి రెండిండ్లతో ఒకరు వైరల్ ఫీవర్‌తో వణికిపోతున్నారని తెలిపారు. ప్రభుత్వ దవాఖానల్లో మందుల్లేక, డెంగ్యూ కిట్స్ లేక రోగులు ప్రైవేట్ హాస్పిటళ్లకు వెళ్లి అప్పుల పాలవుతున్నారని గురువారం ఎక్స్ వేదికగా ఆందోళన వ్యక్తంచేశారు. 'పడకేసిన పల్లె వైద్యం', 'మంచమెక్కిన మన్యం', 'సీజనల్ వ్యాధులతో జనం విలవిల', 'ఊరంతా విషజ్వరాలే' లాంటి వార్తలను సమైక్య పాలనలో చూసేవాళ్లమని, కాంగ్రెస్ పాలన పుణ్యమా అని ప్రస్తుతం ఏ పత్రికలో చూసినా మళ్లీ ఆ వార్తలే ఇప్పుడు కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా వంటి విషజ్వరాలు విజృంభిస్తుంటే పాలకులకు చీమకుట్టినట్టయినా లేకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. తప్పుడు లెక్కలు విడుదల చేస్తూ, విషజ్వరాల కేసులను తక్కువ చేసి చూపడం వల్ల ప్రయోజనం లేదని, ప్రభుత్వం యుద్ధ ప్రాతిపాదికన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలి: పట్లోళ్ల శశిధర్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో విషజ్వరాల బారిన పడే కుటుంబాల సంఖ్య పెరుగుతుందని, గ్రామాలు, తండాలు, హరిజనవాడల్లో తక్షణమే మొబైల్ టీమ్‌ల ద్వారా వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి వైద్యం అందించాలని సీఎం రేవంత్‌రెడ్డిని మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం సీఎంకు బహిరంగ లేఖ రాశారు. ముఖ్యంగా ఆదిలాబాద్, మంచిర్యాల, కొత్తగూడెం, ములుగు, ఆసిఫాబాద్, నిర్మల్, భూపాలపల్లి జిల్లాల్లో పరిస్థితి తీవ్రంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.



బయ్యారం మండల కేంద్రంలో డీఎంహెచ్‌వోతో వాగ్వాదం చేస్తున్న ప్రజలు

మందులుండవు.. పరీక్షలు చేయరు

- సర్కారు వైద్యం అందనప్పుడు చావమంటరా?
- మహబూబాబాద్ వైద్యాధికారిని ప్రశ్నించిన గ్రామస్థులు

బయ్యారం, ఆగస్టు 29: సర్కారు వైద్యం సరిగా అందడం లేదు.. ప్రభుత్వ దవాఖానల్లో మందులుండవు.. వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయరు.. ప్రైవేటుకు పోక ఏం చేయమంటరు? చావమంటరా? అంటూ మహబూబాబాద్ జిల్లా వైద్యాధికారి మురళీధర్‌పై ప్రజలు ప్రశ్నల వర్షం కురిపించారు. బయ్యారం మండల కేంద్రంలోని శ్రీరామ, ప్రశాంతి క్లినిక్‌లను, ల్యాబ్‌లను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సరైన అనుమతులు లేవని, పరిమితికి మించి వైద్యం చేస్తున్నారని, వాటిని మూసేయాలని నిర్వాహకులను ఆదేశించారు. దీంతో విష జ్వరాలతో వైద్యం చేయించుకునేందుకు అక్కడికి వచ్చిన ప్రజలు ఒక్కసారిగా వైద్యశాఖ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్కారు దవాఖానల్లో మందులుండవని.. రోగ నిర్ధారణ పరీక్షలు కూడా చేయడం లేదని, అందువల్లే తాము ప్రైవేటును ఆశ్రయించాల్సి వస్తున్నదని చెప్పారు. ఈ వైద్యశాలలను మూసి వేస్తే తాము ఎక్కడికి పోవాలని ప్రశ్నించారు. బయ్యారం, గంధంపల్లి వైద్యశాలల్లో ల్యాబ్ టెక్నీషియన్లు లేరని, రక్త నమూనాల రిపోర్ట్ వచ్చేందుకు వారం పడుతున్నదని, దీంతో ప్రాణాల మీదకు తెచ్చుకోవాల్సి వస్తున్నదని మండిపడ్డారు. పల్లె దవాఖానల్లో సైతం మందులు, సిబ్బంది లేకనే మండల కేంద్రాల్లోని వైద్యశాలలకు వస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ దవాఖానల్లో సేవలు మెరుగు పరిచి ప్రైవేటుకు పోకుండా కట్టడి చేయాలని సూచించారు.



ఎమ్మెల్యే కోవ లక్ష్మికి తీవ్ర అస్వస్థత

- మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న ఎమ్మెల్యే
- మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలింపు


ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఆగస్టు 29: ఆసిఫాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మూడు రోజులుగా తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్నా.. ఇంటి వద్దే వైద్యం చేయించుకుంటున్నారు. గురువారం ఒక్కసారిగా బీపీ, షుగర్ పెరగడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో హుటాహుటిన జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న అభిమానులు కార్యకర్తలు, బీఆర్‌ఎస్ శ్రేణులు దవాఖానకు తరలివచ్చారు. మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, బీఆర్‌ఎస్ మహిళా నాయకురాలు మర్సుకోల సరస్వతి ఎమ్మెల్యేను పరామర్శించి ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు.

ఆహార పంట ఉత్పత్తుల్లో మనమే టాప్

- *16.42 శాతం వృద్ధితో దేశంలోనే తెలంగాణ టాప్*
- *పంజాబ్, హర్యానా రాష్ట్రాలను తలదన్ని అగ్రభాగంలోకి*
- *సాగుకు జీవం పోసిన కేసీఆర్ వ్యవసాయ పథకాలు*
- *వెల్లడించిన కేంద్ర నివేదిక*




హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): ఆహార పంటల ఉత్పత్తిలో తెలంగాణ మేటిగా నిలిచింది. ఏకంగా 16.42 శాతం వృద్ధి రేటును సాధించిన తెలంగాణ దేశంలోనే అగ్రభాగాన ఉన్నది. పంజాబ్, హర్యానా, పశ్చిమ బెంగాల్ వంటి పెద్ద వ్యవసాయ రాష్ట్రాలను వెనక్కి నెట్టి మేటి అనిపించుకున్నది. 2018-19 నుంచి 2023-24 వరకు వ్యవసాయరంగంలో వివిధ రాష్ట్రాలు సాధించిన వృద్ధిరేటుపై నివేదికను కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసింది. ఆ నివేదిక ప్రకారం ఆహార పంటల ఉత్పత్తి వృద్ధి రేటు పెరుగుదలలో తెలంగాణతో మరే ఇతర రాష్ట్రం కనీసం పోటీలో కూడా నిలువలేకపోయింది. తెలంగాణ 16.42 శాతం వృద్ధి రేటు సాధిస్తే.. 7.11 శాతం వృద్ధి రేటుతో ఆ తర్వాత స్థానంలో మహారాష్ట్ర నిలిచింది. అంటే తొలిస్థానంలో నిలిచిన తెలంగాణకు, రెండో స్థానంలో నిలిచిన మహారాష్ట్ర మధ్య తేడా 9.31 శాతం ఉన్నది. మిగిలిన రాష్ట్రాల్లో బీహార్ 5.14శాతం, మధ్యప్రదేశ్ 4.35 శాతం, కర్ణాటక 3.18 శాతం, ఉత్తరప్రదేశ్ 1.65 శాతం, పంజాబ్ 0.66 శాతం, హర్యానా 0.34శాతం, పశ్చిబెంగాల్ 0.14శాతం వృద్ధిరేటును నమోదు చేశాయి.



కాళేశ్వరం.. కేసీఆర్ పథకాలు

ఆహార పంటల ఉత్పత్తుల వృద్ధిరేటులో తెలంగాణ సాధించిన ఈ ఘనతకు వెయ్యి శాతం కేసీఆర్ మానసపుత్రిక కాళేశ్వరం ప్రాజెక్టుతోపాటు ఆయన అమలుచేసిన వ్యవసాయ, రైతు సంక్షేమ పథకాలే కారణమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణ పంట పొలాలకు గోదావరి జలాలను పరుగులు పెట్టించారు మాజీ సీఎం కేసీఆర్. చెరువులన్నీ కాళేశ్వరం జలాలతో నింపడంతో రాష్ట్రంలో భూగర్భ జలాలు ఉబికివచ్చాయి. రాష్ట్రంలో ఎక్కడా సాగు నీళ్ల కొరత, కరవు అనే మాటే వినిపించ లేదు. దీనికితోడు రైతుబంధు పేరుతో పెట్టుబడి సాయాన్ని కూడా అందించారు. రైతుబీమా పథకం ద్వారా బీమా సదుపాయం, సబ్సిడీలో ట్రాక్టర్లను అందించడం, కల్లాల వద్దకే వెళ్లి ధాన్యం కొనుగోలు వంటి చర్యలు వ్యవసాయానికి, రైతుకు దన్నుగా నిలిచాయి. దీంతో రైతులు కూడా నిబ్బరంగా వ్యవసాయం చేసి పసిడి పంటలు పండించారు.



భారీగా పెరిగిన పంటల సాగు విస్తీర్ణం

కాళేశ్వరం జలాల రాకతో రాష్ట్రంలో సాగునీటికి కొరత తీరడంతో.. 2018-19 నుంచి పంటల సాగు భారీగా పెరిగింది. 2018-19కి ముందు 1.30 లక్షలకు అటు ఇటుగా ఊగిసలాడిన సాగు విస్తీర్ణం ఆ తర్వాత క్రమంగా పెరుగుతూ వచ్చింది. 2018-19లో 1.34 కోట్ల ఎకరాల నుంచి 2022-23 నాటికి 2.21 కోట్ల ఎకరాలకు పెరిగింది. దీనికి అనుగుణంగా పంటల ఉత్పత్తి కూడా భారీగా పెరిగింది. ఒక దశలో పంజాబ్ రాష్ట్రాన్ని తలదన్నేలా 3 కోట్ల టన్నుల ధాన్యం ఉత్పత్తి చేసే స్థాయికి తెలంగాణ ఎదగడం గమనార్హం.



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు రూ.3,662.17 కోట్ల విలువైన డివిడెండ్ చెక్కును అందజేస్తున్న ఎల్ఐసీ ఎండీ, సీఈవో సిద్ధార్థ మొహంతి

రికార్డు స్థాయికి సూచీలు

82,134కి సెన్సెక్స్, 25,151 పాయింట్లకు నిఫ్టీ



ముంబై, ఆగస్టు 29: దేశీయ స్టాక్ మార్కెట్లు కదంతొక్కాయి. బ్లూచిప్ సంస్థల ర్యాలీతో సూచీలు మరో శిఖరానికి చేరుకున్నాయి. గత పదిరోజులుగా పెరుగుతూ వచ్చిన సూచీలు గురువారం మరో రికార్డు స్థాయిలో ముగిశాయి. అన్ని రంగాల షేర్లలో క్రయ విక్రయాలు జోరుగా సాగడం, అంతర్జాతీయ పెట్టుబడిదారులు భారీగా నిధులు కుమ్మరించడంతో ఇంట్రాడేలో ఆల్‌టైం హైకి చేరుకున్న సూచీలు చివర్లో ఇదే ట్రెండ్‌ను కొనసాగించాయి. ఇంట్రాడేలో 500 పాయింట్ల స్థాయిలో పెరిగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 349.05 పాయింట్లు అందుకొని 82,134.61 వద్ద ముగిసింది. సూచీలకు ఇదే గరిష్ఠ స్థాయి ముగింపు కావడం విశేషం. గత ఎనిమిది సెషన్లలో సెన్సెక్స్ 1,709.93 పాయింట్లు లేదా 2.12 శాతం లాభపడింది. మరో సూచీ నిఫ్టీ 25 వేల పాయింట్ల పైన ముగిసింది. ఒక దశలో 140 పాయింట్లు లాభపడిన నిఫ్టీ చివరకు 99.60 పాయింట్లు అందుకొని 25,151.96 వద్ద స్థిరపడింది. గత 11 సెషన్లలో నిఫ్టీ 1,012.95 పాయింట్లు లేదా 4.19 శాతం లాభపడింది. మార్కెట్లో టాటా మోటర్స్ అత్యధికంగా నాలుగు శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, ఐటీసీ, రిలయన్స్ ఇండస్ట్రీస్, టెక్ మహీంద్రా, మారుతి, ఎస్బీఐలు లాభాల్లో ముగిశాయి. బోనస్ షేరును ప్రకటించడంతో రిలయన్స్ షేరు ఏకంగా 1.50 శాతం లాభపడింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.30,389.92 కోట్లు పెరిగి రూ.20,57,382.97 కోట్లకు చేరుకున్నది. కానీ, మహీంద్రా అండ్ మహీంద్రా, సన్ ఫార్మా, జేఎస్ డబ్ల్యూ స్టీల్, కొటక్ మహీంద్రా బ్యాంక్, ఇన్ఫోసిస్, టాటా స్టీల్‌లు నష్టపోయాయి.

నిర్మాణ రంగంలోకి ఎంఎస్ఎన్ గ్రూపు



కొండాపూర్, ఆగస్టు 29 : ఫార్మా దిగ్గజాల్లో ఒకటైన ఎంఎస్ఎన్ గ్రూపు తాజాగా రియల్ ఎస్టేట్ రంగంలోకి అడుగుపెట్టింది. ఎంఎస్ఎన్ రియల్టీని స్థాపించింది. ఈ సందర్భంగా ఎంఎస్ఎన్ గ్రూపు ఫౌండర్, సీఎండీ సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. నిర్మాణరంగంలో తమకంటూ ప్రత్యేకతను చాటడానికి ఈ రంగంలోకి అడుగుపెట్టినట్లు, ముఖ్యంగా వినియోగదారులకు నాణ్యత ప్రమాణాలతో సకల సౌకర్యవంతమైన గృహాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన ప్రకటించారు. ఇందుకు సంబంధించి హైదరాబాద్‌లో ఎంఎస్ఎన్ రియాలిటీ లోగోను ఆయన ఆవిష్కరించారు. ఫార్మా రంగంలో ఎంతో కాలంగా సుదీర్ఘ సేవలనందిస్తున్న ఎంఎస్ఎన్ గ్రూపు.. రియల్ ఎస్టేట్ రంగంలోనూ ప్రత్యేక ముద్రను వేసేలా సేవలను అందించనున్నట్లు తెలిపారు. రెసిడెన్షియల్, కమర్షియల్ నిర్మాణాలను వినియోగదారులకు అందించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని, వచ్చే రెండు నెలల్లో ప్రభుత్వ అనుమతులతో హైదరాబాద్‌లో తమ మొదటి ప్రాజెక్ట్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

100జీబీదాకా ఉచిత స్టోరేజీ

రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ

- వినియోగదారులకు జియో ఏఐ, క్లౌడ్ వెల్‌కమ్ ఆఫర్
- దీపావళి నుంచి అందుబాటులోకి..
- చౌక ధరలకు డాటా-పవర్డ్ ఏఐ సర్వీసులు

ముంబై, ఆగస్టు 29: జియో వినియోగదారులకు రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) అధినేత ముకేశ్ అంబానీ బంపర్ ఆఫర్ ఇచ్చారు. ఏఐ క్లౌడ్ వెల్‌కమ్ ఆఫర్‌ను ప్రకటించారు. ఇందులోభాగంగా జియో యూజర్లు 100జీబీదాకా ఉచిత క్లౌడ్ స్టోరేజీని పొందే అవకాశాన్ని కల్పించారు. దీంతో జియో కస్టమర్లు తమ ఫోటోలను, వీడియోలను, డాక్యుమెంట్లను, డిజిటల్ కంటెంట్, ఇతర డాటాను స్వేచ్ఛగా, మరింత భద్రంగా దాచుకునే సౌలభ్యం లభించింది. రాబోయే దీపావళి నుంచి ఈ ఆఫర్ అందుబాటులోకి రానున్నది. దీంతో ఇక చాలా చౌక ధరలకే మార్కెట్‌లో క్లౌడ్ డాటా స్టోరేజీ, డాటా-పవర్డ్ ఏఐ సర్వీసులు అన్నిచోట్ల, అందరికీ దొరుకుతాయని అంబానీ అన్నారు. గురువారం ఇక్కడ జరిగిన కంపెనీ 47వ వార్షిక భాగస్వాముల సమావేశం (ఏజీఎం)లో ఈ మేరకు అన్ని వివరాలందించారు.

మా సంపదనేం దాచట్లేదు

ఒక్కో మెట్టూ ఎక్కుతూ ఈ స్థాయికి వచ్చామని, దీని వెనుక ఎంతో కష్టం దాగి ఉన్నదని ముకేశ్ అంబానీ తమ సంస్థ ఎదుగుదలను వివరించారు. ఏజీఎంలో ఒకింత ఉద్వేగపూరిత ప్రసంగం చేశారు. రిలయన్స్ కింది స్థాయి నుంచి పైకొచ్చిందన్న ఆయన.. తమకు భారీ మూలాలేమీ లేవని చెప్పుకొచ్చారు. ఈ క్రమంలోనే మా సంపదను దాచుకోవట్లేదని, మరింత సంపదను సృష్టిస్తూ జాతి గర్వించదగ్గ కంపెనీగా రిలయన్స్‌ను తీర్చిదిద్దినట్టు పేర్కొన్నారు. బహుళ వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో విస్తరించిన రిలయన్స్.. భారతీయ అత్యంత విలువైన కంపెనీగా నిలిచిన విషయం తెలిసిందే. ఆయిల్ రిఫైనింగ్, ఆయిల్-గ్యాస్ ఉత్పత్తి, పెట్రో కెమికల్స్, టెలికం, రిటైల్, మీడియా ఇలా దాదాపు అన్ని కీలక రంగాల్లో రిలయన్స్ కంపెనీలున్న సంగతీ విదితమే. కాగా, లాభాల కోసమో లేక సంపదను దాచుకోవడానికో తాము వ్యాపార కార్యకలాపాలను చేయడం లేదని ముకేశ్ అంబానీ అన్నారు. జాతి సంపద సృష్టికే పనిచేస్తున్నట్టు తెలిపారు. తర్వాతి తరాలకు రిలయన్స్‌ను గొప్ప సంపదగా అప్పజెప్తామన్నారు. ఉత్పత్తి, సేవల్లో అత్యంత నాణ్యతను పాటిస్తున్నామని, దేశ వినియోగదారుల జీవన ప్రమాణాలను పెంచుతున్నామని వెల్లడించారు.

భారత్‌కు ఎనర్జీ సెక్యూరిటీ..

భారత్‌కు ఎనర్జీ సెక్యూరిటీని కల్పించే బాధ్యతను రిలయన్స్ తీసుకున్నదని ముకేశ్ అంబానీ అన్నారు. ఈ క్రమంలోనే పునరుత్పాదక శక్తిపై దృష్టి సారించామని, సోలార్ పవర్ విస్తరణ దిశగా అడుగులు వేస్తున్నామని వివరించారు. '2018 జూలైలో 100 బిలియన్ డాలర్ల విలువను రిలయన్స్ చేరుకున్నది. 2022లో 250 బిలియన్ డాలర్లకు చేరింది. 2027 నాటికి ఇది రెట్టింపవుతుందని నేను వాగ్దానం చేస్తున్నాను. భవిష్యత్తులో లాభాలపరంగా, వృద్ధిపరంగా రిలయన్స్ కొత్త శిఖరాలను అధిరోహించగలదు' అని ముకేశ్ చెప్పారు.

ప్రపంచంలో జియోనే టాప్

ప్రపంచంలో ఇప్పుడు అతిపెద్ద మొబైల్ డాటా కంపెనీగా జియోనే ఉందని ముకేశ్ తెలియజేశారు. గడిచిన 8 ఏండ్లలో సంస్థ కస్టమర్లు 49 కోట్లకు పెరిగారని, సగటున నెలకు 30జీబీకిపైగా డాటా వాడుతున్నారని చెప్పారు. ఇక ప్రపంచంలో అతిపెద్ద డాటా మార్కెట్‌గా భారతే ఉందన్న ఆయన.. ఇందుకు జియోనే కారణమన్నారు. అంతర్జాతీయ మొబైల్ ట్రాఫిక్‌లో జియో వాటా 8 శాతంగా ఉన్నట్టు వివరించారు. అలాగే 5జీ, 6జీ టెక్నాలజీల్లో జియోకు 350 పేటెంట్లున్నట్టు ఈ సందర్భంగా ముకేశ్ అంబానీ ప్రకటించారు. ఈ క్రమంలోనే ప్రతి నెలా 10 లక్షల బ్రాడ్‌బాండ్ కనెక్షన్లను లక్ష్యంగా చేసుకోబోతున్నట్టు తెలిపారు. అంతేగాక 2 కోట్లకుపైగా చిన్న-మధ్యతరహా వ్యాపారాలను, 15 లక్షల పాఠశాలలు-కళాశాలలను, 70వేలకుపైగా దవాఖానలను, 12 లక్షల డాక్టర్లను బ్రాడ్‌బాండ్‌తో కనెక్ట్ చేసే దిశగా వెళ్తున్నట్టు వెల్లడించారు.

1:1 బోనస్ షేర్ల పరిశీలన

తమ ఈక్విటీ షేర్‌హోల్డర్లకు 1:1 శ్రేణిలో బోనస్ షేర్లను ఇవ్వాలని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ భావిస్తున్నది. ఈ అంశాన్ని సంస్థ బోర్డు సెప్టెంబర్ 5న పరిశీలించనున్నది. ఈ మేరకు స్టాక్ ఎక్స్ఛేంజీలకు కంపెనీ తెలియజేసింది. కాగా, 2017 సెప్టెంబర్‌లో చివరిసారిగా బోనస్ షేర్లను జారీ చేసింది రిలయన్స్. మళ్లీ ఏడేండ్ల తర్వాత బోనస్ షేర్లను సిఫార్సు చేసే దిశగా కంపెనీ వెళ్తుండటం గమనార్హం. 2009లోనూ 1:1 ప్రాతిపదికన వాటాదారులకు బోనస్ షేర్లను రిలయన్స్ ఇండస్ట్రీస్ అందించిన సంగతి విదితమే.



లగ్జరీ నగల వ్యాపారంలోకి..

వచ్చే 3-4 ఏండ్లలో రిటైల్ వ్యాపారాన్ని రెట్టింపు చేసే లక్ష్యంతో ముందుకెళ్తున్నట్టు రిలయన్స్ ప్రకటించింది. ఇందులో భాగంగానే లగ్జరీ జ్యుయెల్లరీ సెగ్మెంట్‌లోకి అడుగు పెట్టాలని యోచిస్తున్నట్టు రిలయన్స్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ ఇషా అంబానీ తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో రిలయన్స్ రిటైల్ రెవిన్యూ రూ.3 లక్షల కోట్ల మార్కును దాటినట్టు చెప్పారు. వచ్చే 4 ఏండ్లలో దీన్ని రూ.6 లక్షల కోట్లకు తీసుకెళ్తామన్న ఆశాభావాన్ని కనబర్చారు. రిటైల్ రంగంలో తమకు 30 కోట్లకుపైగా కస్టమర్లున్నట్టు పేర్కొన్నారు. కాగా, ఇప్పటికే రిలయన్స్ రిటైల్ విలువ 100 బిలియన్ డాలర్లను దాటిన సంగతి తెలిసిందే.

ఏజీఎం ముఖ్యాంశాలు

- రిలయన్స్ తమ తొలి సోలార్ గిగా-ఫ్యాక్టరీని ఈ ఏడాదే ఏర్పాటు చేయాలని చూస్తున్నది.
- ఇందులో పీవీ మాడ్యుల్స్, సెల్స్, వేఫర్స్-ఇంగోట్స్, పాలీసిలికాన్, గ్లాస్ తయారు కానున్నాయి.
- ఈ ఏడాదే 20 గిగావాట్స్ సోలార్ పీవీ తొలి రైలు తయారీ మొ దలు.
- 2025కల్లా మెగావాట్ స్థాయిలో సోడియం-ఐయాన్ సెల్ ఉత్పత్తిని పారిశ్రామికీకరణ. 2026లో ఏటా 50 మెగావాట్ లిథియం బ్యాటరీ సెల్స్ పైలట్.
- 2030 నాటికి 100 గిగావాట్ల పునరుత్పాదక శక్తి సామర్థ్యం ఆధారంగా కొత్త ఇంధన వ్యాపారాలను అభివృద్ధి చేసే దిశగా రిలయన్స్. ఇందుకోసం మూడేండ్లపాటు 10 బిలియన్ డాలర్లను పెట్టుబడిగా పెట్టాలని 2021లోనే నిర్ణయించుకున్న సంస్థ.
- రెన్యువబుల్ ఎక్విప్‌మెంట్, బ్యాటరీ స్టోరేజీ, ఫ్యూయల్ సెల్స్, హైడ్రోజన్ తయారీ కోసం గుజరాత్‌లోని జమ్‌నగర్‌లో 4 గిగా ఫ్యాక్టరీల నిర్మాణం.
- జియో క్లౌడ్‌లో ఏ కాల్‌నైనా యూజర్లు రికార్డు చేసుకొని, స్టోర్ చేసుకునేలా జియోఫోన్‌కాల్ ఏఐ సర్వీస్‌ను పరిచయం చేసిన ఆకాశ్ అంబానీ
- జామ్‌నగర్‌లో గిగావాట్ స్థాయిలో ఏఐ-రెడీ డాటా సెంటర్లను ఏర్పాటు చేయనున్న రిలయన్స్.
- భారతీయ వినోద పరిశ్రమలో వాల్ట్ డిస్నీతో రిలయన్స్ డీల్ ఓ నూతన శకానికి నాంది పలికిందన్న ముకేశ్ అంబానీ. ఈ డీల్‌తో రూ.70వేల కోట్ల సంస్థ ఏర్పడుతుండగా.. ఇందులో డిస్నీ హాట్‌స్టార్, జియో సినిమా ఓటీటీ స్ట్రీమింగ్ వేదికలతోపాటు 120 టెలివిజన్ చానల్స్ ఉంటున్నాయి.

అంబానీని దాటేసిన అదానీ

- 11.6 లక్షల కోట్ల సంపదతో దేశీయ కుబేరుడు
- హురూన్ ఇండియా జాబితా విడుదల



న్యూఢిల్లీ, ఆగస్టు 29: హిండెన్‌బర్గ్ దెబ్బకు లక్షల కోట్ల సంపదను కోల్పోయిన గౌతమ్ అదానీ మళ్లీ దేశీయ కుబేరుడిగా అవతరించారు. ప్రస్తుత సంవత్సరానికిగాను తన సంపద 95 శాతం పెరిగి రూ.11.6 లక్షల కోట్లతో దేశీయ శ్రీమంతుల జాబితాలో అగ్రస్థానం దక్కించుకున్నారు. ఈ స్థానంలో కొనసాగిన ముకేశ్ అంబానీ రెండో స్థానానికి పడిపోయినట్టు 2024 సంవత్సరానికిగాను హురూన్ ఇండియా విడుదల చేసిన సంపన్నవర్గాల జాబితాలో పేర్కొంది. గతేడాదికాలంలో ముకేశ్ అంబానీ సంపద 25 శాతం పెరిగి రూ.10.14 లక్షల కోట్లుగా నమోదైంది. 2023లో గౌతమ్ అదానీ సంపద 57 శాతం కరిగిపోయి రూ.4.74 లక్షల కోట్లకు పరిమితంకాగా, ఇదే సమయంలో ముకేశ్ అంబానీ సంపద రూ.8.08 లక్షల కోట్లకు ఎగబాకింది. ఆ తర్వాతి స్థానాల్లో రూ.3.14 లక్షల కోట్లతో హెచ్‌సీఎల్ ఫౌండర్ శివ్ నాడర్ మూడో స్థానంలో నిలువగా, రూ.2.89 లక్షల కోట్లతో సైరస్ పూనావాల నిలిచారు. రూ.2.50 లక్షల కోట్ల సంపదతో దిలీప్ సంఘ్వీ ఐదో స్థానం వరించింది. భారత్‌లో బిలియనీర్ల సంఖ్య నానాటికి పెరుగుతున్నదని తెలిపింది. గతేడాది భారత్‌లో ప్రతి 5 రోజులకొక బిలయనీరు తయారైనట్లు నివేదిక వెల్లడించింది.

- రూ.7,300 కోట్ల సంపదతో బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ తొలిసారిగా ఈ జాబితాలో చోటు లభించింది.
- అతి పిన్న వయస్సు కలిగిన జెప్టో కో-ఫౌండర్ కైవల్య వొహ్రా తొలిసారిగా చోటు సంపాదించుకున్నారు. రూ.3,600 కోట్ల సంపద కలిగివున్నారు.
- అపర్ణ కన్‌స్ట్రక్షన్ ఫౌండర్ సీ వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్ సుబ్రమణియన్ రెడ్డిల సంపద అత్యధికంగా పెరిగింది.
- పొంగులేటి హర్ష రెడ్డి(కాంగ్రెస్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తనయుడు) రూ.1,400 కోట్ల వ్యక్తిగత సంపదతో ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు.
- రూ.1,000 కోట్ల కంటే అధిక ఆస్తి కలిగిన వారు కొత్తగా 220 మంది జతవడంతో మొత్తం సంఖ్య 1,539కి చేరుకున్నారు.

మూడో స్థానంలో హైదరాబాద్

హైదరాబాద్ మరో ఘనతను సాధించింది. నగరాల వారీగా శ్రీమంతులు జాబితాలో తొలిసారిగా బెంగళూరును అధిగమించి హైదరాబాద్ మూడో స్థానం దక్కించుకున్నది. నగరం నుంచి 104 మంది కుబేరులు ఉన్నట్లు హురూన్ విడుదల చేసిన జాబితాలో వెల్లడించింది. 386 మందితో ముంబై ఎప్పటిలాగే తొలి స్థానంలో నిలువగా, 217 మందితో న్యూఢిల్లీ ఆ తర్వాతి స్థానం వరించింది. హైదరాబాద్‌లో కొత్తగా ఈ ఏడాది 17 మంది శ్రీమంతుల జాబితాలో చేరినట్లు పేర్కొంది. అలాగే బిలియనీర్లు ఉన్న రాష్ర్టాల్లో తెలంగాణ ఐదో స్థానంలో నిలిచింది.

తెలుగు శ్రీమంతులు వీరే..

వ్యక్తి	సంపద (రూ.కోట్లలో)
మురళీ దివీస్(దివీస్)	76,100
పీ పిచ్చిరెడ్డి(మెయిల్)	54,800
పీవీ కృష్ణా రెడ్డి(మెయిల్)	52,700
జీఎం రావు(జీఎమ్మార్)	36,300
పీవీ రాంప్రసాద్ రెడ్డి(అరబిందో)	35,100
బండి పార్థసారథి రెడ్డి(హెటిరో)	29,900
ప్రతాప్ రెడ్డి(అపోలో గ్రూపు)	28,400

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు



గురువారం నాగార్జునసాగర్ క్రస్ట్ గేట్ల నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

సాగర్‌కు భారీగా వరద

26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల శ్రీశైలానికి 2,75,218 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గద్వాల/అయిజ/శ్రీశైలం/నందికొండ, ఆగస్టు 29: కృష్ణా ప్రాజెక్టులకు మళ్లీ వరద పెరిగింది. గురువారం జూరాల డ్యాంకు ఇన్‌ఫ్లో 2,94,000 కూసెక్కులు నమోదు కాగా.. అధికారులు 39గేట్లు తెరిచారు. దిగువకు 2,88,778 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలానికి వరద పోటెత్తుతున్నది. ఇన్‌ఫ్లో 2,75,218 క్యూసెక్కులు వస్తుండగా.. 10 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 2,79,830 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు వరద పోటెత్తుతున్నది. 2,57,634 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండటంతో సాగర్‌డ్యామ్ 26 క్రస్ట్ గేట్లను ఎత్తి 2,10,600 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం పూర్తిస్థాయికి చేరుకున్నది.

టీటీడీ ప్రసాద విక్రయాల్లో మార్పులు

ఆలయ అదనపు ఈవో వెంకయ్యచౌదరి

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ) : తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ ప్రసాదం విక్రయాల్లో బ్లాక్ మార్కెటింగ్, దళారులను అరికట్టేందుకు మార్పులు చేసినట్టు ఆలయ అదనపు ఈవో వెంకయ్యచౌదరి తెలిపారు. ఇందులో భాగంగా దర్శనం టికెట్లు, టోకెన్లులేని భక్తులకు ఆధార్‌కార్డు నమోదుతో రెండు లడ్డూలు విక్రయించనున్నట్టు పేర్కొన్నారు. దర్శన టికెట్, టోకెన్ కలిగిన భక్తులకు ఉచితంగా ఒక లడ్డూతోపాటు నాలుగు నుంచి ఆరు లడ్డూలు విక్రయిస్తామని, సామాన్య భక్తులకు మేలు చేసేలా లడ్డూల విక్రయ విధానం కొనసాగనున్నట్టు తెలిపారు.

కన్నడ నటుడు దర్శన్ బళ్లారి జైలుకు తరలింపు

బెంగళూరు: కన్నడ నటుడు దర్శన్ తూగుదీపను పరప్పన అగ్రహార కేంద్ర కారాగారం నుంచి బళ్లారి జైలుకు గురువారం తరలించారు. రేణుక స్వామి హత్య కేసులో ప్రస్తుతం ఆయన జ్యుడిషియల్ కస్టడీలో ఉన్నారు. పరప్పన అగ్రహార జైలులో ఆయన ఓ రౌడీ షీటర్‌తోపాటు మరో ముగ్గురితో ఆనందంగా గడుపుతున్నట్టు ఓ ఫొటో ఆదివారం బయటకొచ్చిన సంగతి తెలిసిందే. ఆయనను బళ్లారి జైలుకు తరలించేందుకు 24వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు మంగళవారం అనుమతి ఇచ్చింది.

మర్రిగూడెం ఆలయంపై ఎమ్మెల్యే పెత్తనం

- ధ్వజస్తంభం వేడుకను అడ్డుకున్న కోరం అనుచరులు
- ధ్వజస్తంభాన్ని పునఃప్రతిష్ఠించాలి: దాత పులి ప్రమీలారెడ్డి



ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠాపనకు ముస్తాబైన మర్రిగూడెం వేట వేంకటేశ్వరస్వామి ఆలయం

గార్ల, ఆగస్టు 29: మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం మర్రిగూడెంలో 500 ఏండ్ల చరిత్ర, అత్యంత మహిమ గల శ్రీవేట వేంకటేశ్వరస్వామి ఆలయంపై ఎమ్మెల్యే కోరం కనకయ్య అనుచరులు పెత్తనం చెలాయిస్తున్నారు. ఈ నెల 24 నుంచి 28 వరకు జరగాల్సిన ఆలయ ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠాపన వేడుకలను అడ్డుకున్నారు. దీంతో గ్రామస్థులందరూ ఎమ్మెల్యే కనకయ్య, ఆయన అనుచరులపై మండిపడుతున్నారు. మర్రిగూడెంలో ఉన్న శ్రీవేట వేంకటేశ్వరస్వామి ఆలయంలోని ధ్వజస్తంభం ఇటీవల వచ్చిన గాలి దుమారానికి కూలిపోయింది. మంచి ముహూర్తాలు లేక ఇన్ని రోజులుగా పునఃప్రతిష్ఠ జరగలేదు. ఇప్పుడు మంచి రోజులు ఉండటంతో వేద పండితులు ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు ముహూర్తం నిర్ణయించారు. ఈ నెల 24 నుంచి ఆలయంలో ధ్వజస్తంభం వేడుకలు జరుగుతుండగా.. ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అనుచరులు ఆలయం నిధులపై దుష్ప్రచారం చేస్తూ దేవాదాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠాపనకు ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు ఆహ్వానం పంపలేదని ఆరోపిస్తూ.. ఈ నెల 28న జరగాల్సిన ఉత్సవాలను నిలిపివేశారు. దీంతో గతంలో ఆలయ అభివృద్ధికి రూ.కోటి 5 లక్షలు విరాళం అందించిన రాంపురం గ్రామానికి చెందిన అమెరికాలో స్థిర పడిన పులి గోపాల్‌రెడ్డి-పులి ప్రమీలారెడ్డి స్పందించారు. ధ్వజస్తంభం ప్రతిష్ఠాపనను నిలిపేయొద్దని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. ఆలయ ఈవో నందన కవిత ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ వేడుక నిర్వహించొద్దని, ఆలయ ప్రాంగణంలో మీడియా సమావేశం ఏర్పాటు చేయొద్దని ఫోన్ చేసి బెదిరిస్తున్నట్టు ప్రమీలారెడ్డి ఆరోపించారు. ధ్వజస్తంభం వేడుక కోసం అమెరికా నుంచి వచ్చామని, ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ చేయాలని ఆమె కోరారు. ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠాపన చేయకపోతే దసరా పండుగకకు జరిగే బ్రహ్మోత్సవాలు కూడా నిలిపేయాల్సి ఉంటుందని ఆలయ ప్రధాన అర్చకులు చెప్తున్నారు.

డ్రగ్స్ హాట్‌స్పాట్‌లపై నిరంతర నిఘా

- ఆపరేషన్ ధూల్‌పేట్ 95 శాతం సక్సెస్
- ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని అన్ని డ్రగ్స్ హాట్‌స్పాట్‌లపై నిరంతర నిఘా కొనసాగుతున్నదని ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి తెలిపారు. ఈ ఏడాది ఇప్పటి వరకు ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎస్టీఎఫ్ చేపట్టిన దాడులు, అరెస్టులు, స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాలు, సిబ్బంది పనితీరుపై గురువారం ఆబ్కారీ భవన్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలించేవరకూ నిద్రపోయేది లేదు. ధూల్‌పేట్‌లో దాదాపు 95 శాతం గంజాయిని నిర్మూలించాం. చాలా మందిని జైలుకు పంపాం. ఈ నెల చివరి నాటికి పెట్టుకున్న లక్ష్యాన్ని చేరుకున్నాం. డ్రగ్స్ కేసుల్లో పట్టుబడిన వారికి త్వరగా శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. రాష్ట్రవ్యాప్తంగా డ్రగ్స్‌గానీ, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిని వదిలిపెట్టొద్దు. స్థానిక పోలీసులతో కలిసి దాడులు ముమ్మరం చేయండి' అని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్లు, అడిషనల్ ఎస్పీ, ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, డీఎస్పీలు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు సేవల్లో సాంకేతిక సమస్యలు

2నుంచి పునరుద్ధరణ
- హైదరాబాద్ ఆర్పీవో స్నేహజ

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 29(నమస్తే తెలంగాణ) : సాంకేతిక సమస్యల కారణంగా పాస్‌పోర్టు సేవల్లో అంతరాయం కలిగిందని, సెప్టెంబర్ 2న ఉదయం 6 గంటల నుంచి యథావిధిగా సేవలు అందుబాటులోకి వస్తాయని హైదరాబాద్ రీజినల్ పాస్‌పోర్టు అధికారి స్నేహజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నమోదైన స్లాట్స్‌ను మరో తేదీకి మారుస్తామని, అందుకు సంబంధించిన సందేశాలు దరఖాస్తుదారులకు చేరవేసినట్టు పేర్కొన్నారు. స్లాట్స్‌కు సంబంధించి సందేహాలుంటే po. hyderabad @mea.gov.inకు మెయిల్ చేయవచ్చని సూచించారు.

బంగారం పల్లిలో పెంకుల బడి



ఇది మంత్రి సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న ములుగు నియోజకవర్గంలోని కన్నాయిగూడెం మండలంలోని బంగారుపల్లి ఊరి బడి. ఇది పెంకులతో వేసిన గుడిసెలో కొనసాగుతున్నది. ఇందులో 5వ తరగతి వరకు 25 మంది పిల్లలు చదువుకుంటున్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. పాఠశాలలో గచ్చు లేకుండా విద్యార్థులే మట్టితో అలుకుతూ పరిసరాలను శుభ్రం చేసుకుంటున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన విద్యార్థులకు అందుతున్న విద్య ఎలా ఉందో అద్దంపడుతున్నది. -ములుగు, నమస్తేతెలంగాణ



సింగరేణి కార్మిక సంఘాల నేతల సమావేశంలో మాట్లాడుతున్న సీఎండీ బలరాం

సింగరేణి మనుగడ ముఖ్యం

ఐదు జాతీయ కార్మిక సంఘాల నేతలు • సంస్థ యాజమాన్యంతో మేధోమథనం

హైదరాబాద్, ఆగస్టు 29(నమస్తే తెలంగాణ): సింగరేణి సంస్థ మనుగడ, కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా ముందుకెళ్లాలని ఐదు జాతీయ కార్మిక సంఘాల నేతలు నిర్ణయించారు. తెలంగాణ ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి కల్పన కోసం కొత్త బ్లాక్‌లను దక్కించుకొని బొగ్గు ఉత్పత్తి చేయడం అత్యంత అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో కంపెనీ మనుగడ కోసం యాజమాన్యం తీసుకునే నిర్ణయాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు. సింగరేణిలో ఉత్పత్తి, ఉత్పాదకత పెంపు, కంపెనీ భవిష్యత్తు కోసం తీసుకోవాల్సిన వ్యూహాత్మక విధానాలపై ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ, సీఐటీయూ, హెచ్ఎంఎస్, బీఎంఎస్ సంఘాల ముఖ్య నేతలంతా సింగరేణి భవన్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో కూలంకషంగా చర్చించారు. సమావేశంలో ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్, సీఐటీయూ జనరల్ సెక్రటరీ నర్సింహారావు, హెచ్ఎంఎస్ జనరల్ సెక్రటరీ రియాజ్ అహ్మద్, బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, ఇతర నాయకులు పాల్గొన్నారు. తొమ్మిదేండ్లుగా ఒక్క బ్లాక్ సింగరేణికి దక్కకపోవడంపై అన్ని సంఘాలు ఆందోళన వ్యక్తంచేశాయి. ప్రస్తుత విధానం కొనసాగిస్తే ఆరేండ్లలో బెల్లంపల్లి, మణుగూరు, ఇల్లందు ఏరియాల మనుగడ ప్రశ్నార్థకంగా మారబోతుందని, ఏటా కొత్త బొగ్గు గనులు ప్రారంభించుకోకపోతే, సింగరేణి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారనుందని సీఎండీ ఎన్ బలరామ్ తెలిపారు. రానున్న 15 ఏండ్లలో సింగరేణిలో బొగ్గు గనులు గణనీయంగా తగ్గిపోనున్నాయని డైరెక్టర్లు పేర్కొన్నారు.

ఇద్దరు వైసీపీ రాజ్యసభ సభ్యుల రాజీనామా

టీడీపీలో చేరే అవకాశం

హైదరాబాద్, ఆగస్టు 29(నమస్తే తెలంగాణ): వైసీపీ ఎంపీలు మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్‌రావు తమ రాజ్యసభ సభ్యత్వాలకు రాజీనామా చేశారు. ఈ మేరకు గురువారం రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌కు తమ రాజీనామా పత్రాలు సమర్పించారు. పార్టీ సభ్యత్వానికి కూడా రాజీనామా చేయనున్నట్టు వారు తెలిపారు. మస్తాన్‌రావుకు నాలుగేండ్లు, మోపిదేవికి రెండేండ్ల పదవీకాలం ఉండగానే రాజీనామా చేయడం గమనార్హం. తెలుగుదేశం పార్టీలో చేరనున్నట్టు మోపిదేవి ప్రకటించగా, మస్తాన్‌రావు కూడా అదేబాటలో పయనిస్తున్నట్టు తెలుస్తున్నది. మరో ఆరుగురు వైసీపీ ఎంపీలు కూడా అయిష్టంగానే పార్టీలో కొనసాగుతున్నట్టు, వారు కూడా త్వరలోనే పార్టీని వీడే యోచనలో ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది.

- మహిళల భద్రత కోసం షీ-బాక్స్ పోర్టల్
- ఎంపీలో దళిత మహిళపై దాష్టీకం
- నేవీ అమ్ములపొదిలోకి ఐఎన్‌ఎస్ అరిఘాత్
- రాత్రివేళ సూర్యకాంతి విక్రయిస్తాం!
- శునకం ఆస్తులు రూ.3,300 కోట్లు!

..లోపలి పేజీల్లో

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం మన పత్రిక

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

NAMASTE TELANGANA

www.ntnews.com /ntdailyonline

నమస్తే తెలంగాణ నిపుణ Guide to Excellence

పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..

శుక్రవారం FRIDAY 30.8.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4 | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 86 ‖ వెల (Price) రూ.6.50

శుక్రవారం, సూర్యోదయం: 6-02, సూర్యాస్తమయం: 6-31. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు శ్రావణ మాసం కృష్ణ పక్షం తిథి: ద్వాదశి రాత్రి 2-26 వరకు. నక్షత్రం: పునర్వసు సాయంత్రం 5-56 వరకు. వర్జ్యం: రాత్రి 2-31 నుంచి తెల్లవారుజామున 4-14 వరకు. రాహుకాలం: ఉదయం 10-43 నుంచి పగలు 12-16 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 8-32 నుంచి ఉదయం 9-22 వరకు, పునర్ దుర్ముహూర్తం: పగలు 12-41 నుంచి పగలు 1-31 వరకు. అమృతకాలం: పగలు 3-24 నుంచి సాయంత్రం 5-05 వరకు. పుబ్బ కార్తె పగలు 3-46 గంటలకు.

• ఆప్యాయ ఆలింగనం



ఐదున్నర నెలల విరామం తర్వాత బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కే కవిత గురువారం తన తండ్రి కేసీఆర్‌ను ఎర్రవల్లిలోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన పాదాలకు నమస్కరించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. కన్నబిడ్డను చూడగానే భావోద్వేగానికి గురైన కేసీఆర్ ఆమెను ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు.

సుప్రీంనే తప్పుపడ్తరా?

మాకు రాజకీయాలు అంటగడ్తరా?: రేవంత్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం

బీఆర్‌ఎస్-బీజేపీ ఒప్పందంలో భాగంగానే కవితకు బెయిల్ వచ్చింది. ఆమె బెయిల్ కోసం బీఆర్‌ఎస్ ఎంపీ సీట్లు త్యాగం చేసింది నిజం. సిసోడియా, కేజ్రీవాల్‌కు రాని బెయిల్ ఐదు నెలల్లోనే కవితకు ఎలా వచ్చింది?

- బుధవారం చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

మేం రాజకీయ నాయకులను పట్టించుకోం. మా ఆదేశాలను ఎవరైనా విమర్శించినా ఇబ్బంది లేదు. మా మనస్సాక్షి ప్రకారం, మేము చేసిన ప్రమాణం ప్రకారం మా కర్తవ్యాన్ని నిర్వర్తిస్తాం.

– సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం

సీఎం వ్యాఖ్యలు అవాంఛనీయం. ఆయన తరపున మేము క్షమాపణలు కోరుతున్నాం. ఆయనకు కౌన్సెలింగ్ ఇస్తాం. మరోసారి ఇలా జరుగకుండా చూసుకుంటాం.

ధర్మాసనంతో రేవంత్ తరఫు న్యాయవాదులు





జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ కేవీ విశ్వనాథన్

- రాజ్యాంగబద్ధ పదవిలో ఉండి ఇదేనా మీరు మాట్లాడేది?
- ఒక సీఎం చేసే ప్రకటనేనా ఇది.. మీ పద్ధతేం బాగోలేదు
- ఆ వ్యాఖ్యలు ప్రజల్లో భయాందోళనలు రేకెత్తిస్తాయి
- పార్టీలను సంప్రదించి నిర్ణయాలు తీసుకుంటామా?
- అత్యున్నత న్యాయస్థానంపై ఆయనకు గౌరవం లేదా?
- కవిత బెయిల్‌పై సీఎం వ్యాఖ్యల మీద ధర్మాసనం ఆగ్రహం

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ కవిత బెయిల్ విషయంలో అడ్డగోలు వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డిపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సుప్రీంకోర్టు తీర్పును తప్పు పడ్తారా? అంటూ తీవ్రస్థాయిలో మండిపడింది. 'కోర్టులంటే గౌరవం లేదా?' అంటూ కన్నెర్రజేసింది. పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని తీవ్రంగా హెచ్చరించింది. ఢిల్లీ మద్యం విధానం కేసులో ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే. అయితే బీజేపీ-బీఆర్‌ఎస్ ఒప్పందంలో భాగంగానే కవితకు బెయిల్ వచ్చిందంటూ బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో సీఎం మాట్లాడుతూ.. సిసోడియా, కేజ్రీవాల్‌కు రాని బెయిల్ ఐదు నెలల్లోనే కవితకు ఎలా వచ్చిందని ప్రశ్నించారు. కవిత బెయిల్ కోసం బీఆర్‌ఎస్ ఎంపీ సీట్లను త్యాగం చేసిందని అన్నారు. ఈ వ్యాఖ్యలపై గురువారం సుప్రీంకోర్టు తీవ్రంగా మండిపడింది. ఓటుకు నోటు కేసు విచారణను వేరే రాష్ట్రానికి తరలించాలంటూ

› 2వ పేజీలో



మహబూబ్‌నగర్‌లోని ఆదర్శనగర్ కాలనీలో అధికారులు కూల్చివేసిన నిర్మాణాలు.. ఇల్లు కూల్చడంతో రోదిస్తున్న ఓ బాధితురాలు

దివ్యాంగుల ఇండ్లపైకి బుల్డోజర్

బియ్యం, బట్టలు అన్నిట్ల మన్నువడ్డది

మేము ఇక్కడ ఇల్లు కట్టుకొని పదిహేనేండ్లయింది. పానం బాగలేక మేం దవాఖానల ఉంటే రాత్రికిరాత్రే వచ్చి మా ఇల్లు కూలగొట్టిండ్రు. మేమిద్దరం దివ్యాంగులం. అప్ప సప్ప చేసి ఇల్లు కట్టుకున్నం. అది కూడా లేకుండ చేసిండ్రు. మాకు అన్యాయం చేసిండ్రు. మా ఇంట్ల సామాన్లు అట్లనే ఉన్నయ్. బియ్యం, బట్టలు అన్నింట్ల మన్నువడ్డది. మేం రోడ్డున పడ్డం. సామాన్లు ఉండంగనే కూలగొడితె ఎట్ల. ఆడపిల్లలతోని ఏడికి పోవాలె? ఏంజెయ్యాలె? ఇంటి ట్యాక్స్ కట్టినం. ఎందుకు కూలగొట్టిండ్రో అర్థమైతలేదు. ఏం చెప్పకుండ రాత్రిపూట వచ్చి కూలగొట్టుడు ఏం పద్ధతి?

-మరుగుజ్జు భోజ్యా నాయక్ ఆవేదన



సీఎం సొంత జిల్లాలో 75 ఇండ్లు కూల్చివేత

ఆదర్శనగర్‌లో అర్ధరాత్రి బీభత్సం

రెవెన్యూ అధికారుల హైడ్రా అవతారం.. పేదలపై అధికారుల ప్రతాపం

- ఆర్డీవో, డీఎస్పీ సమక్షంలో కట్టడాలు నేలమట్టం
- లబోదిబోమంటున్న పేదలు
- 20 ఏండ్లుగా ఆక్రమణలు అధికార్లకు కనిపించలేదా?
- కలెక్టరేట్ ఎదుట ఆందోళన
- పేదలపైనా మీ ప్రతాపం?: శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం

మహబూబ్‌నగర్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఈ రోజు గడిచిందని గుండెపై చెయ్యేసుకొని పడుకున్న ఆ పేదలు.. ఈ ప్రజాపాలనలో అదే కాళరాత్రి అవుతుందని ఊహించలేదు! తమ బతుకులు బాగుపడుతాయేమోనన్న భ్రమతో గెలిపించిన ఇదే కాంగ్రెస్, తమను రోడ్డు పాలు జేస్తుందని కలగనలేదు! 15 ఏండ్ల కిందట ఇదే కాంగ్రెస్ సర్కారు ఇచ్చిన పట్టాలతో కట్టుకున్న ఇండ్లను ఇంత నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తుందని

› 5వ పేజీలో

మా భూములు చెరబట్టిండ్రు..!

దొంగ పత్రాలతో అపర్ణ రియల్ ఎస్టేట్ కంపెనీ దౌర్జన్యం

- మంత్రి పొంగులేటి పేరు చెప్పి బెదిరిస్తున్నరు
- బౌన్సర్లు, సెక్యూరిటీతో దాడులు చేయిస్తున్నరు
- సీఎం రేవంత్‌రెడ్డే మాకు న్యాయం చేయాలి

కొండకల్ తండా గిరిజనుల గోడు

› 6



100జీబీ దాకా ఉచిత స్టోరేజీ

- కస్టమర్లకు జియో ఏఐ, క్లౌడ్ వెల్‌కమ్ ఆఫర్
- దీపావళి నుంచి అందుబాటులోకి..
- చౌక ధరలకు డాటా-పవర్డ్ ఏఐ సర్వీసులు
- రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ వ్యాఖ్య

› 8

రైతును ముంచిన గజదొంగ రేవంత్

- రుణమాఫీ 100 శాతం ఏ ఊర్లో అయిందో రాహుల్‌గాంధీ వచ్చి చూపించాలి
- మంత్రులే మాఫీ పూర్తికాలేదంటున్నరు
- కొండారెడ్డిపల్లిలో అయినా అయిందా?
- రేవంత్‌రెడ్డిది చిట్‌చాట్ కాదు..చీట్‌చాట్
- ఫోర్త్ సిటీ పేరుతో సీఎం బంధువుల దందా
- హైడ్రా పేరుతో ప్రతిపక్షాలే టార్గెట్
- మీడియా ఇష్టాగోష్టిలో హరీశ్‌రావు

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): 'రూ.50 లక్షలు ఇస్తూ దొరికిన దొంగ రేవంత్‌రెడ్డి. రైతులను మోసం చేసిన గజదొంగ. దేవుళ్లు, రైతులను మోసం చేసిన చరిత్ర. బ్లాక్‌మెయిలర్లకు బాడాబాబువు. రూ.50 లక్షలతో పట్టుబడ్డ దొంగవు.. నువ్వు నన్ను దొంగ అంటవా?' అని సీఎం రేవంత్‌పై మాజీమంత్రి హరీశ్‌రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ఏ గ్రామంలోనైనా 100 శాతం రుణమాఫీ అయ్యిందా చూపించాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ప్రశ్నించారు. రాహుల్ రాష్ట్రానికి వస్తే తానే స్వాగతం పలుకుతానని, సీఎం సొంతూరు కొండారెడ్డిపల్లి అయినా,

› 3వ పేజీలో



కూల్చివేత కాదు.. షోకాజ్ నోటీసులు



- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు
- దుర్గంచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాల కూల్చివేతలపై విచారణ

› 5

అనుమతి ఇచ్చిన అధికారులపై కేసులు



ఆక్రమిత నిర్మాణాలకు సంబంధించి పోలీసులకు ఇరిగేషన్ శాఖ, హైడ్రా ఫిర్యాదు

› 5

నేటి నుంచి పెసర కొనుగోలు కేంద్రాలు

- మార్క్‌ఫెడ్‌కు మంత్రి తుమ్మల ఆదేశం
- హరీశ్‌రావు లేఖతో సర్కారులో కదలిక



హైదరాబాద్, ఆగస్టు 29(నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం నుంచే పెసర కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మార్క్‌ఫెడ్ అధికారులను ఆదేశించారు. ప్రతి రైతుకు క్వింటాకు మద్దతు ధర రూ.8,682 చెల్లించాలని ఆదేశించారు. ప్రస్తుత సీజన్‌లో 64,175 ఎకరాల్లో పెసర సాగైందని, 17,841 మెట్రిక్ టన్నుల వరకు దిగుబడి రావచ్చని అంచనా వేసినట్టు మంత్రి తెలిపారు. ప్రస్తుతం పంటకోత దశకు వచ్చిన 12 ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి, కొనుగోళ్లను ప్రారంభించాలని ఆదేశించారు. ఈ మేరకు ఖమ్మం, సంగారెడ్డి, వికారాబాద్, సూర్యాపేట, నారాయణపేట, మహబూబాబాద్, కామారెడ్డి జిల్లాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. కేంద్రాల్లో రైతులకు మార్క్‌ఫెడ్ ద్వారా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. పెసర పంట కోతలు ప్రారంభమైనా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులకు మద్దతు ధర దక్కడం లేదని, వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని హరీశ్‌రావు బుధవారమే సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. స్పందించిన మంత్రి తుమ్మల కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ఆదేశించడం గమనార్హం.

అధికారులకు పునరావాస కేంద్రంగా టీజీఐఐసీ

- నిలిచిన భూముల కేటాయింపు, మౌలిక సదుపాయాల కల్పన
- కాగితాలకే పరిమితమైన కొత్త ఇండస్ట్రియల్ పార్కులు

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): పనులు జానెడు.. పనివారు బోలెడు అన్న చందంగా తయారైంది తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ(టీజీఐఐసీ) పరిస్థితి. సంస్థలో ఏ ఒక్క అధికారికీ చేతినిండా పనిలేకపోయినా, పోస్టులను సృష్టించి మరీ ఫారిన్ సర్వీసుల కింద అధికారులను భర్తీ చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పరిశ్రమలకు అవసరమైన విధంగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసి దరఖాస్తు చేసుకున్నవారికి నిర్ణీత ధరకు భూములు కేటాయించడం టీజీఐఐసీ విధి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటినుంచి పరిశ్రమలకు భూముల కేటాయింపు, కొత్త ఇండస్ట్రియల్ పార్కుల అభివృద్ధి పనులు నిలిచిపోగా, ఇతర శాఖల అధికారులకు టీజీఐఐసీ పునరావాస కేంద్రంగా మారిపోయింది. గత బీఆర్ఎస్ హయాంలో పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శికితోడు టీజీఐఐసీకి ఒక మేనేజింగ్ డైరెక్టర్, ఒక ముఖ్య కార్యనిర్వహణాధికారి ఉండేవారు. ఇప్పుడు మరో ముగ్గురు ఉన్నతాధికారులు వచ్చిచేరారు. పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శికి తోడు కార్యదర్శిగా ఒక అఖిల భారత సర్వీసు అధికారిని నియమించారు. అంతేకాదు, టీజీఐఐసీ ఎండీకి కింద సీఈఓ ఉండగానే ఇద్దరు ఎగ్జిక్యూటివ్ అధికారుల(ఈఓ)ను నియమించారు. ఇందులో ఒకరు ఆడిట్ శాఖ నుంచి, మరొకరు ఎక్సైజ్ శాఖ నుంచి ఫారిన్ సర్వీసుల కింద వచ్చారు. టీజీఐఐసీ ఎండీగా గతంలో ఐఏఎస్ అధికారి కొనసాగగా, ఇప్పుడు సెంట్రల్ సర్వీసులకు చెందిన అధికారిని కొనసాగిస్తున్నారు.

పని లేనప్పటికీ..

పరిశ్రమల అభివృద్ధికి మౌలిక సదుపాయాలను కల్పించే టీజీఐఐసీకి చీఫ్ ఇంజినీర్‌తో పాటు ఇంజినీరింగ్ విభాగం, ఆయా రంగాలకు డైరెక్టర్లు, జిల్లాలవారీగా జోనల్ కమిషనర్లు ఉన్నారు. ఆర్థిక వ్యవహారాల నిర్వహణ, భూముల కేటాయింపునకు జిల్లాలవారీగా జోనల్ అధికారులు, ప్రధాన కారాలయంలో జీఎంలు ఉన్నప్పటికీ వారిపై కొత్తగా ఈడీలను నియమించడం గమనార్హం.

మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు

- సెప్టెంబర్ 6 నుంచి ఓటరు అభ్యంతరాల స్వీకరణ
- అదే నెల 21న తుది ఓటరు జాబితా ప్రకటన
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి



హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహిస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి వెల్లడించారు. ఎన్నికల నిర్వహణపై గురువారం కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లు, జిల్లా, డివిజనల్ పంచాయతీ అధికారులు, అసెంబ్లీ నియోజకవర్గాల ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సెప్టెంబర్ 6న ఓటరు జాబితా ముసాయిదా నోటిఫికేషన్‌ను వెలువరించి అభ్యంతరాలను స్వీకరించాలని, సెప్టెంబర్ 21న తుది ఓటరు జాబితాను వెలువరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తిస్తూ, ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కమిషనర్ ఆదేశించారు. వచ్చే నాలుగైదు నెలల వ్యవధిలో అన్ని స్థానిక సంస్థల ఎన్నికలను పూర్తి చేయనున్నట్టు ప్రకటించారు. తొలుత మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని, అనంతరం ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల ఎన్నికలు, చివరగా మున్సిపల్ ఎన్నికలు జరుగుతాయని వెల్లడించారు. ఒక్కో పోలింగ్ కేంద్రం పరిధిలో 600 ఓటర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఒక వార్డులోని ఓటరుకు మరో వార్డు పరిధిలో ఓటు హక్కు ఉండకుండా జాగ్రత్త వహించాలని, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్ల ఓట్లు ఒకేచోట ఉండేలా జాబితాలను నిశితంగా పరిశీలించాలని సూచించారు. ఈ సందర్భంగా 'గ్రీవెన్స్ మాడ్యూల్'ను పార్థసారథి ఆవిష్కరించారు. సమీక్షలో పంచాయతీరాజ్‌శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్, కమిషనర్ అనితా రామచంద్రన్, ఎన్నికల సంఘం అధికారులు పాల్గొన్నారు.

మా భూములు చెరబట్టిండ్రు

- అసైన్డ్ భూములనూ వదలట్లేదు
- దొంగ పత్రాలతో అపర్ణ రియల్ ఎస్టేట్ కంపెనీ దౌర్జన్యం
- మంత్రి పొంగులేటి పేరు చెప్పి బెదిరిస్తున్నరు
- బౌన్సర్లు, సెక్యూరిటీతో దాడులు చేయిస్తున్నరు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే మాకు న్యాయం చేయాలి
- మీడియా ఎదుట కొండకల్ గిరిజనుల గోడు



భూములకు సంబంధించిన కాగితాలను చూపిస్తున్న గిరిజనులు

ఖైరతాబాద్, ఆగస్టు 29 : 'దశాబ్దాలుగా వ్యవసాయంపైనే ఆధారపడి సాగుచేసుకుంటున్నం. మా అసైన్డ్ భూములను దొంగపత్రాలు సృష్టించి ఆ దొరలు చెరబట్టిండ్రు' అని కొండకల్ తండా గిరిజనులు వాపోయారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల ఎదుట తమ గోడు వెల్లబోసుకున్నారు. బాధితులు రవి రాథోడ్, లక్ష్మణ్, శంకర్, మోహన్ తదితరులు తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం కొండకల్ తండాలో సర్వే నంబరు 362, 363, 364, 369, 377లో ప్రొటెక్టెడ్ టెనెంట్స్ (పీటీ) భూములను తరతరాలుగా సాగుచేసుకుంటూ జీవిస్తున్నామని చెప్పారు. 1997 నాటి ప్రభుత్వం తమకు భూములను కేటాయిస్తూ ప్రొసీడింగ్స్ ఇచ్చిందని, మొత్తం 200 ఎకరాలు ఉండగా, 80 ఎకరాల్లో 400 మంది సాగు చేసుకుంటున్నట్టు తెలిపారు. అపర్ణ రియల్ ఎస్టేట్ కంపెనీ తమ భూములపై కన్నేసి దొంగ పత్రాలు సృష్టించి కబ్జా చేయడం మొదలు పెట్టిందని వాపోయారు. అసైన్డ్ భూములను కబ్జా చేయడంతో పాటు ప్రహరీ గోడలు కూడా నిర్మించిందని, తాము వ్యవసాయం కోసం భూమి వద్దకు పోతే ఆ సంస్థ బౌన్సర్లు, ప్రైవేట్ సెక్యూరిటీతో తమపై దాడులు చేయిస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. మంత్రి పొంగులేటి పేరు చెప్పుకొని కబ్జాదారులు తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆందోళనచెందారు. ఆయా సర్వే నంబర్లలో మంత్రి పొంగులేటి సతీమణి, కొడుకు పేరిట కూడా భూములు ఉన్నాయని, చాలా భూములు ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయని వివరించారు. చివరికి శ్మశాన వాటికలోని తమ పూర్వీకుల సమాధులను సైతం ధ్వంసం చేస్తున్నారని వాపోయారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. బాధ్యులను వదిలి తమపై, స్థానిక యువకులపై శంకర్‌పల్లి, మోకిల పోలీసు స్టేషన్లలో కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తంచేశారు. తమపై దాడులు చేస్తున్న దుండగులపై మోకిల పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. తమ తండా వాసులకు ప్రాణగండం ఉన్నదని, సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి న్యాయం చేయాలని కోరారు.

కల్యాణలక్ష్మిపై రాజకీయ కక్ష

- చెక్కులు మంజూరైనా ఇస్తలేరు
- 14,865 మందికి అదే పరిస్థితి
- అత్యధికం ప్రతిపక్ష ఎమ్మెల్యేలున్న చోటే
- పెండింగ్‌లో 86 వేలకు పైగా దరఖాస్తులు
- వెరిఫికేషన్‌పై అధికారుల నిర్లక్ష్యం



హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): కల్యాణలక్ష్మి/షాదీముబారక్ పథకాల కింద తులం బంగారం ఇస్తామన్న హామీని అమలు చేయకపోగా, రూ.1,00,016 ఆర్థిక సాయాన్ని అందజేయడంలో ప్రభుత్వం జాప్యం చేస్తున్నది. చెక్కులు జారీ చేసినా లబ్ధిదారులకు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నది. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఉన్నచోట ఈ సమస్య తీవ్రంగా ఉన్నది. ఇటీవల అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం ఇచ్చిన లిఖితపూర్వక సమాధానమే ఈ విషయాన్ని స్పష్టంచేస్తున్నది. చెక్కులు మంజూరైనా దాదాపు 14,865 మందికి ఇవ్వకుండా పెండింగ్ పెట్టడం గమనార్హం. సర్టిఫికెట్ వెరిఫికేషన్ దశలో మరో 86,483 దరఖాస్తులు పెండింగ్ ఉన్నట్టు ప్రభుత్వమే వెల్లడించింది. క్షేత్రస్థాయిలో 41,887 దరఖాస్తులు, ఆర్డీవోల స్థాయిలో 24,724, ఎమ్మెల్యేల స్థాయిలో 19,872 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్టు ప్రభుత్వ గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి.

ప్రతిపక్ష ఎమ్మెల్యేలున్న చోట మరీ ఎక్కువ

కల్యాణలక్ష్మి/షాదీముబారక్ పథకాల లబ్ధిదారులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు చెక్కులను మంజూరు చేసింది. ప్రస్తుత ప్రభుత్వం చెక్కుల పంపిణీని సైతం రాజకీయం చేస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా కల్యాణలక్ష్మి/షాదీముబారక్ పథకాలకు వచ్చిన దరఖాస్తులను తొలుత తహసీల్దార్, ఆ తరువాత ఆర్డీవో పరిశీలిస్తారు. లబ్ధిదారులను ఎంపిక చేసి చెక్కులను అందజేస్తారు. 14,865 మందికి చెక్కులు మంజూరైనా పంపిణీ చేయకుండా పెండింగ్‌లో పెట్టగా, వీటిలో సగాని కంటే ఎక్కువ 8,918 చెక్కులు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలవే కావడం గమనార్హం. బీజేపీ నేతలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లోనూ చెక్కుల పంపిణీ జరగడం లేదు. మొత్తంగా 11 వేలకుపైగా చెక్కులు ప్రతిపక్ష ఎమ్మెల్యేల నియోజకవర్గాలవే కావడం గమనార్హం. ప్రభుత్వ వివక్షపూరిత పాలనకు సిద్దిపేట జిల్లానే నిదర్శనంగా నిలుస్తున్నది. జిల్లాలో సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ రెవెన్యూ డివిజన్లు ఉన్నాయి. హుస్నాబాద్ డివిజన్‌లో మంత్రి పొన్నం ఎమ్మెల్యేగా ఉండగా, అక్కడ ఒక్క చెక్కూ పెండింగ్ లేదు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నియోజకవర్గం గజ్వేల్‌లో 561, హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్దిపేటలో 744 చెక్కులు పంపిణీ చేయకుండా పెండింగ్ పెట్టారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, నల్లగొండ జిల్లాలో సైతం ఒక్క చెక్కు కూడా పెండింగ్ లేవు.

10 నెలల నుంచి తిరుగుతున్న..!

మహబూబాబాద్, ఆగస్టు 29(నమస్తే తెలంగాణ): మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం తార్‌సింగ్ తండాకు చెందిన భూక్యా భద్రు– నీల దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కూతురు అనూష డిగ్రీ పూర్తి చేసింది. ఆమెకు 2023 జూన్ 4న ఇల్లందు మండలం మామిడిగుండ్ల గ్రామానికి చెందిన యువకుడితో వివాహం జరిపించారు. వివాహం చేసిన రెండు నెలల తర్వాత కల్యాణలక్ష్మి పథకానికి కేసముద్రం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. రోజూ తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఇప్పటివరకూ చెక్కు రాలేదు. వారానికోసారి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి 'సార్ మా చెక్కు వచ్చిందా?' అని ఆరా తీస్తున్నారు. వెళ్లిన ప్రతిసారీ 'బడ్జెట్ లేదు.. బడ్జెట్ రాగానే మీ చెక్కు వస్తుంది' అని అధికారులు చెప్తున్నారు. వారు దరఖాస్తు చేసి 10 నెలలు కావొస్తున్నది.. ఇప్పటికైనా వీలైనంత త్వరగా తమకు కల్యాణలక్ష్మి చెక్కు ఇప్పించాలని వారు వేడుకుంటున్నారు.

పేదింటి తల్లిదండ్రుల అవస్థలు

చెక్కుల పంపిణీ చేయడంలో తీవ్ర తాత్సారం చేస్తుండటంతో పేదింటి తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా కల్యాణలక్ష్మి చెక్కులను ఆర్డీవోలు జారీ చేస్తారు. ఆ చెక్కులపై నిర్దేశిత తేదీని వేస్తారు. ప్రస్తుతం చెక్కుల గడువు ముగిసిన తరువాత కూడా పంపిణీ చేయని దుస్థితి నెలకొన్నదని లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. చెక్కులను బ్యాంకులకు తీసుకెళ్తే బౌన్స్ అయ్యాయని చెప్తున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. దీంతో మళ్లీ చెక్కుల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షణ చేయాల్సి వస్తున్నదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెక్కుల పంపిణీ జాప్యానికి స్థానిక కాంగ్రెస్ నేతలే ప్రధాన కారణమని అధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ నేతలు ప్రాతినిధ్యం వహిస్తున్న చోట చెక్కులను పంపిణీ చేసేందుకు ప్రయత్నిస్తే.. కాంగ్రెస్ నేతలు ఒత్తిడి తేవడమే కాకుండా బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దీంతో అధికారులు సైతం ప్రొటోకాల్‌కు విరుద్ధంగా చెక్కులు పంపిణీ చేయడం పరిపాటిగా మారింది. ఫలితంగా ప్రతిపక్ష ఎమ్మెల్యేలున్న చోట చెక్కులు పెండింగ్ పెట్టాల్సి వస్తున్నదని, దీంతో లబ్ధిదారులు నష్టపోతున్నారని అధికారులు వివరిస్తున్నారు.

మనుమరాలు వచ్చినా మంజూరు కాలేదు



నేను, నా భార్య మహ్మద్ యాదాంబీ వ్యవసాయ కూలీలుగా పనిచేస్తున్నాం. మా చిన్న కూతురు మహ్మద్ ఫౌజియా వివాహం గత సంవత్సరం మే 3న చేశాం. షాదీముబారక్ డబ్బులు రాగానే అల్లుడికి కూడా కానుకలు పెడతామని పది మందిలో ఒప్పుకున్నాం. నా బిడ్డ పెండ్లి అయి 16 నెలల గడుస్తున్నది. నా బిడ్డకు ఇటీవల సంతానం కలిగి మాకు మనుమరాలు వచ్చింది. షాదీముబారక్ డబ్బులు మాత్రం రాలేదు. షాదీముబారక్ చెక్కుల కోసం ఎమ్మార్వో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా. గీ ప్రభుత్వం అసలు ఇస్తదో.. లేదోనని గుబులుగా ఉన్నది.

\- మహ్మద్ గుంషావలి, రాయపర్తి, వరంగల్

తులం బంగారం ఊసేలేదు

కల్యాణలక్ష్మి పథకం కింద రూ.1,00,016 నగదుతోపాటు ఆడబిడ్డలకు పెండ్లిరోజునే తులం బంగారం కూడా అందజేస్తామని అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఇప్పటివరకు మార్గదర్శకాలు విడుదల చేయలేదు. ఈ ఆర్థిక సంవత్సరంలో అమలయ్యే అవకాశం లేదని బడ్జెట్ కేటాయింపులు సూచిస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ వర్గాలకు సంబంధించి బడ్జెట్‌లో ఈ ఏడాది ప్రభుత్వం రూ.3,855.12 కోట్లు ప్రతిపాదించింది. ఇందులో బీసీలకు రూ.2,185.51 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మొదటి విడతగా రూ.725 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినా ఆ నిధులే ఇప్పటివరకు పూర్తిగా జమ కాలేదు. ప్రస్తుతం కేటాయించిన నిధులు లక్ష ఆర్థిక సాయానికి మాత్రమే సరిపోతాయని, తులం బంగారాన్ని ఇవ్వాలంటే బడ్జెట్ రెండింతలు చేయాల్సి ఉంటుందని అధికారుల అంచనా.

నేడు దేవాదుల ప్రాజెక్టుకు మంత్రులు

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించిన దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును రాష్ట్ర సాగునీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం సందర్శించనున్నారు. సహచర మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి శుక్రవారం ఉదయం 9 గంటలకు తుపాకులగూడెంలోని పంపింగ్ సైట్‌కు చేరుకుంటారు. ప్రాజెక్టు పనుల పురోగతిపై అక్కడే సంబంధిత ఇంజినీర్లతో ప్రత్యేక సమీక్ష నిర్వహించనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును 2025 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది.

ఈ ఏడాదిలో అత్యధిక విద్యుత్తు డిమాండు

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో 2024–25లో 15,573 మెగావాట్లతో అత్యధిక విద్యుత్తు డిమాండు (పీక్) నమోదైనట్టు ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది ఇదే సమయంలో 14,816 మెగావాట్ల విద్యుత్తు డిమాండ్ నమోదైనట్టు చెప్పారు. నిరుడుతో పోల్చుకుంటే ఇది 5.11శాతం అధికమని పేర్కొన్నారు. ఈ ఏడాది అత్యధిక పీక్ డిమాండ్ 15,623 మెగావాట్లతో మార్చి 8న నమోదైందని చెప్పారు. మార్చి 14న అత్యధికంగా 308.54 మిలియన్ యూనిట్లు సరఫరా చేసినట్లు తెలిపారు. ఆగస్టులో ఈరోజు వరకు సగటున 266.14 మిలియన్ యూనిట్లు సరఫరా చేయగా నిరుడు ఇదే సమయంలో 250.25 మిలియన్ యూనిట్లు సరఫరా చేసినట్టు వెల్లడించారు. ఈ ఏడాది విద్యుత్తు సరఫరా 6.35శాతం అధికమని తెలిపారు. ఖరీఫ్‌లో 17,000 మెగావాట్ల అవసరమున్నా సిద్ధంగా ఉన్నట్టు వివరించారు.

గణేశ్ మండపాలకు ఉచిత కరెంట్

- నిర్వాహకులు నిబంధనలు పాటించాలి : సీఎం
- ఉత్సవాల నిర్వహణపై సచివాలయంలో సమీక్ష



హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ తొలినుంచి మతసామరస్యానికి, ప్రశాంతతకు మారు పేరని, దాన్ని మరింత ఇనుమడింపజేసేలా గణేశ్ ఉత్సవాలను నిర్వహించాలని ఉత్సవ కమిటీలు, మండప నిర్వాహకులు, అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. గణేశ్ ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబీ నిర్వహణపై బుధవారం ఆయన సచివాలయంలో సమీక్షించారు. రెండు పండుగలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రభుత్వం తరఫున పోలీసు, జీహెచ్ఎంసీ, ఆర్అండ్‌బీ, నీటి పారుదల, విద్యుత్తు శాఖలతో పాటు ఇతర ముఖ్య శాఖల అధికారులు, మండప నిర్వాహకులు సమన్వయం చేసుకోవాలని చెప్పారు. మండప నిర్వాహకులు ముందస్తు అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. మండపాలకు ఉచిత విద్యుత్తు ఇవ్వాలన్న భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి విజ్ఞప్తికి సీఎం సానుకూలంగా స్పందించారు. ఉచిత విద్యుత్తుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనుమతులు లేకుండా విద్యుత్తును వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండపాల్లో డీజేలు వాడేందుకు అనుమతివ్వాలని ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ కోరగా, సుప్రీంకోర్టు నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. సమావేశంలో మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వర్‌రావు, రాజనరసింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, షబ్బీర్ అలీ, ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, మేయర్ విజయలక్ష్మి, సీఎస్ శాంతికుమారి పాల్గొన్నారు.

సిటీ ఎమ్మెల్యేలు ఏరి?

సీఎం నిర్వహించిన సమీక్షలో జీహెచ్ఎంసీ పరిధి ఎమ్మెల్యేలు లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్, అరెకపూడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్ వంటివారిని సమావేశానికి పిలవకపోవడం గమనార్హం. ఉత్సవాల నిర్వహణకు సంబంధించి నగరం పరిధిలోని నలుగురు లోక్‌సభ సభ్యులు, ఎమ్మెల్యేల అభిప్రాయాలను తీసుకోవాలని పోలీసులను సీఎం ఆదేశించారు. సీఎంకు, సిటీ ఎమ్మెల్యేలకు మధ్య గ్యాప్ పెరిగిందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

19న మిలాద్–ఉన్ నబీ ప్రదర్శనలు

సెప్టెంబరు 19న మిలాద్–ఉన్–నబీ ప్రదర్శనలు నిర్వహించుకునేందుకు మిలాద్ కమిటీ ప్రతినిధులు అంగీకరించారు. మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని వచ్చే నెల 16న వేడుకలు నిర్వహించాలని కమిటీ తొలుత నిర్ణయించింది.

సెప్టెంబరు 7నుంచి గణేశ్ నవరాత్రోత్సవాలు, 17న నిమజ్జనం విషయం సీఎం సమీక్షలో చర్చకు వచ్చింది. దీంతో మిలాద్ ఉన్ నబీ ప్రదర్శనలను వాయిదా వేసుకునే అవకాశాన్ని పరిశీలించాలని సీఎం, మంత్రులు సూచించగా మిలాద్ కమిటీ సభ్యులు సానుకూలత వ్యక్తం చేశారు.

547మంది ఎస్సై అభ్యర్థుల శిక్షణ పూర్తి

- బీఆర్ఎస్ హయాంలోనే నియామకాలు
- సెప్టెంబర్‌లో పాసింగ్ అవుట్ పరేడ్

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ హయాంలో నియామకమైన 547మంది ఎస్సై శిక్షణార్థులు మరో పది రోజుల్లో తమ పాసింగ్ అవుట్ పరేడ్‌ను నిర్వహించనున్నారు. 2022 ఏప్రిల్‌లో 17,516 పోలీసు ఉద్యోగాలను భర్తీ చేసేందుకు నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం పలు నోటిఫికేషన్లు విడుదల చేసింది. వాటిల్లో 16,929 కానిస్టేబుల్, 587 ఎస్సై పోస్టులు ఉన్నాయి. ఎస్సై పోస్టులకు విజయవంతంగా పలు దశల్లో ప్రిలిమినరీ టెస్టు, ఫిజికల్ ఈవెంట్స్, మెయిన్స్ పరీక్షలు నిర్వహించి గతేడాది ఆగస్టులోనే తుది ఫలితాలు వెల్లడించి వెంటనే సెప్టెంబర్‌లో శిక్షణకు ఆహ్వానించారు. వీరికి రాష్ట్ర పోలీసు అకాడమీలో ఇండోర్, అవుట్‌డోర్ విభాగాల్లో శిక్షణ ఇచ్చారు. సివిల్ అభ్యర్థులకు 12నెలలు, ఏఆర్ అభ్యర్థులకు 10నెలలు, టీఎస్ఎస్పీ అభ్యర్థులకు 9నెలలు శిక్షణ ఇవ్వగా.. షెడ్యూల్ ప్రకారం అన్నీ ఈ సెప్టెంబర్‌లోనే ముగిసేలా పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్త్ చర్యలు తీసుకున్నారు. మహిళా అభ్యర్థులకు సైతం ఇక్కడే శిక్షణ ఇచ్చారు. వారికి ప్రత్యేకంగా హాస్టళ్లు, మెస్ వసతి కల్పించారు. మొత్తం 587 మందిని ఎంపిక చేయగా.. శిక్షణకు ముందే కొందరు అన్‌విల్లింగ్ అని వివిధ ఉద్యోగాలకు వెళ్లిపోగా, ఇటీవల విడుదలైన గ్రూప్–1 ఫలితాలతో మరికొందరు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఇంకొందరు శిక్షణను వదిలి వెళ్లగా.. ప్రస్తుతం 547 మంది శిక్షణ పూర్తిచేసుకున్నారు. వీరిలో సివిల్ 401, ఏఆర్ 83, టీజీఎస్పీ 29, ఫింగర్ ప్రింట్ 9, ఐటీ అండ్ కమ్యూనికేషన్ 22, పీటీఓ 3 ఉన్నారు. పోలీసు అకాడమీలో నిర్వహించే పాసింగ్ అవుట్ పరేడ్‌కు సీఎం, మంత్రులు రానుండడంతో పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు డీజీ అభిలాష బిష్త్ తెలిపారు. రెండ్రోజుల క్రితం పోలీసు అకాడమీ అధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

ఆ విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం

- అఫిలియేషన్ పొందని 340కి పైగా కాలేజీలు
- గుర్తింపు లేకుండా నడుస్తున్నా మూసివేయని బోర్డు

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): మిక్స్‌డ్ ఆక్యుపెన్సీ జంజాటం.. ఇంటర్‌బోర్డు గుర్తింపునివ్వకపోవడం వంటి సమస్యలతో 340కి పైగా కాలేజీల్లోని విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం కానుంది. గుర్తింపు లేని కాలేజీల్లో చదివితే పరీక్షలు రాసే అవకాశాన్ని కోల్పోనుండటంతో వారి పరిస్థితి అగమ్యగోచరం కానుంది. ఆయా కాలేజీలు ఇప్పటివరకు ఇంటర్‌బోర్డు గుర్తింపును దక్కించుకోలేదు. కానీ కాలేజీల్లో అడ్మిషన్లు నిర్వహించి, విద్యార్థులను చేర్చుకుని, క్లాసులు కూడా నిర్వహిస్తున్నాయి. వాస్తవికంగా ఇంటర్‌బోర్డు గుర్తింపు జారీ అయిన తర్వాతే ఆన్‌లైన్ లాగిన్ ఐడీ ఇస్తారు. విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదుచేస్తేనే వార్షిక పరీక్షల ఫీజు చెల్లించే వీలుంటుంది. ఫీజు చెల్లిస్తేనే పరీక్షలకు హాజరుకావొచ్చు. కానీ ఈ విద్యాసంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడిచినా కాలేజీ అఫిలియేషన్‌లో పురోగతి లేకపోడం ఆందోళనకరంగా మారింది. సంబంధిత కాలేజీ అగ్నిమాపకశాఖ నుంచి నిరభ్యంతర పత్రం(ఎన్‌వోసీ)ను ఇంటర్‌బోర్డుకు సమర్పిస్తేనే అధికారులు అనుబంధ గుర్తింపు జారీచేస్తారు. ఎన్‌వోసీ పొందలేక, పలు కాలేజీలు ఈ ఏడాది ఇంటర్‌బోర్డు అనుబంధ గుర్తింపును పొందలేకపోయాయి. కాగా గత కేసీఆర్ సర్కారు జీవో– 29 అమలును నిలుపుదల చేసి (అబయన్స్‌లో ఉంచి) అనుబంధ గుర్తింపునకు అవకాశానిచ్చింది. 2021 నుంచి 24 వరకు మినహాయింపునిచ్చింది. అయితే 2023 – 24 తర్వాత ఎట్టి పరిస్థితుల్లో మినహాయింపు నివ్వమని అప్పట్లోనే ఆయా జీవోలో పేర్కొన్నారు. అయినా కాలేజీల యాజమాన్యాలు దిద్దుబాటు చర్యలు చేపట్టలేదు. సెప్టెంబర్ సమీపిస్తున్నా ఇంతవరకు అఫిలియేషన్‌ను దక్కించుకోలేదు. ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టలేదు. ఇదే అంశంపై ఇంటర్‌బోర్డు డైరెక్టర్ శృతి ఓజాను వివరణ కోరేందుకు ఫోన్‌లో సంప్రదించగా ఆమె స్పందించలేదు.

బషీర్‌బాగ్ 'లా' కాలేజీకి ఇంకా అఫిలియేషన్ రాలె!

బషీర్‌బాగ్ లా కాలేజీ.. ఓయూకు అనుబంధంగా నడుస్తున్న ప్రముఖ కాలేజీ. ఇంతటి ప్రముఖమైన కాలేజీ ఈ విద్యాసంవత్సరంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపును దక్కించుకోలేదు. ఈ కాలేజీతో పాటు ఖమ్మంలోని మానేరు కాలేజీ సైతం గుర్తింపు పొందలేదు. దీంతో ఈ రెండు కాలేజీలను మొదటి విడత లాసెట్ వెబ్‌ఆప్షన్ల జాబితాలో అధికారులు పొందుపరచలేదు. చివరి నిమిషంలో కొన్ని కాలేజీలు గుర్తింపును దక్కించుకోవడంతో లాసెట్ వెబ్‌ఆప్షన్ల గడువును 30 వరకు పొడగించినట్టు లాసెట్ అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ రమేశ్‌బాబు తెలిపారు. 1న సీట్లను కేటాయిస్తామని, 2 నుంచి 6 వరకు కాలేజీల్లో రిపోర్ట్ చేయాలని సూచించారు.

83 మంది డీటీలకు తహసీల్దార్లుగా పదోన్నతి

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మరో 83 మంది డిప్యూటీ తహసీల్దార్లకు ప్రభుత్వం తహసీల్దార్లుగా పదోన్నతి కల్పించింది. తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి, టీజీటీఏ కృషి ఫలితంగానే పదోన్నతులు లభించాయని అసోసియేషన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పదోన్నతులకు సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీసీఎల్ఏ నవీన్ మిట్టల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ రాములు, ప్రధాన కార్యదర్శి రమేశ్, సెక్రటరీ జనరల్ పూల్‌సింగ్ చౌహాన్, మహిళా విభాగం అధ్యక్షురాలు రాధ ఓ ప్రకటన విడుదల చేశారు.

ఇంజినీరింగ్ సీట్ల పెంపును ఎందుకు నిరాకరిస్తున్నారు?

- కారణాలు చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో వివిధ కోర్సుల్లో సీట్ల పెంపు, కుదింపు, కొత్త కోర్సులు ప్రారంభించే అంశంపై అనుమతులు నిరాకరించడానికి కారణాలు చెప్పాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఏఐసీటీఈ, యూనివర్సిటీలు అనుమతి ఇచ్చిన తర్వాత ఉన్నత విద్యా శాఖ ఎందుకు అనుమతి ఇవ్వడం లేదో చెప్పాలని ప్రశ్నించింది. తదుపరి విచారణను సెప్టెంబరు 4కు వాయిదా వేసింది. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, సాంకేతిక విద్య కమిషనర్, జేఎన్టీయూ, ఏఐసీటీఈ, రాష్ట్ర ఉన్నత విద్యామండలి, ఈఏపీసెట్ కన్వీనర్లకు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాస్‌రావుతో కూడిన ద్విసభ్య ధర్మాసనం గురువారం ఆదేశాలు జారీ చేసింది. కొత్త కోర్సుల ప్రారంభం, సీట్ల పెంపు, కుదింపు, కోర్సుల విలీనం రద్దుకు అనుమతి నిరాకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మెమోను, అనుమతులకు చెందిన సాంకేతిక విద్యాచట్టంలోని 20వ సెక్షన్‌ను సవాలు చేస్తూ మర్రి ఎడ్యుకేషనల్ సొసైటీ, విద్యాజ్యోతి ఎడ్యుకేషనల్ సొసైటీ, మల్లారెడ్డి, అనురాగ్, సీఎంఆర్‌తోపాటు పలు కాలేజీలు విడివిడిగా 11 కేసులు దాఖలు చేశాయి. సీనియర్ న్యాయవాది ప్రకాశ్‌రెడ్డి వాదిస్తూ, కంప్యూటర్ సైన్స్ కోర్సుకు డిమాండ్ ఉన్నదని, ఆ కోర్సు, దాని అనుబంధ కోర్సుల్లో సీట్ల పెంపునకు జేఎన్టీయూ నిరభ్యంతర పత్రం (ఎన్వోసీ) ఇచ్చిందని వివరించారు.



తన తండ్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు పాదాభివందనం చేస్తున్న ఎమ్మెల్సీ కవిత



తన తండ్రి కేసీఆర్ చేతిని మురిపెంగా ముద్దాడుతున్న ఎమ్మెల్సీ కవిత. చిత్రంలో ఆమె భర్త అనిల్, ఎమ్మెల్యేలు వేముల, కౌశిక్, మాజీఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

కేసీఆర్ మదిలో ఆనందం


కూతురు కవితకు బీఆర్‌ఎస్ అధినేత ఆశీర్వాదం

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): అనేక రోజుల తర్వాత తన కూతురును చూడగానే బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ కండ్లలో ఆనందభాష్పాలు.. కూతురిని ఆత్మీయంగా అలుముకుని నిండునూరేండ్లు వర్ధిల్లు అని దీవించారు. 'కవితక్క వచ్చింది.. సార్ మనసు తేలికైంది..' ఏ నోట విన్నా ఇదే ముచ్చట. ఐదున్నర నెలల సుదీర్ఘ విరామం తర్వాత ఎమ్మెల్సీ కవిత తన తండ్రి కేసీఆర్‌ను గురువారం ఎర్రవల్లిలోని ఆయన నివాసంలో కలిశారు. భర్త అనిల్‌రావు, కుమారుడు ఆదిత్యతో కవిత వ్యవసాయ క్షేత్రానికి చేరుకోగానే దిష్టితీసి ఇంట్లోకి ఆహ్వానించారు. మాజీ ఎంపీ సంతోష్‌కుమార్, కల్వకుంట్ల వంశీధర్‌రావు, పార్టీ సీనియర్ నేతలు గ్యాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి సహా పలువురు ఆమెకు స్వాగతం పలికారు.

ఉద్వేగానికి లోనైన కేసీఆర్

కన్నబిడ్డను చూడగానే బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. అక్రమ నిర్బంధం నుంచి బయటకొచ్చిన బిడ్డను తొలిసారి చూడగానే ఆయన కండ్లలో ఆనందం తొణికిసలాడింది. ఎమ్మెల్సీ కవిత తండ్రి కేసీఆర్ దగ్గరికి చేరి ఆయన పాదాలకు నమస్కరించారు. బిడ్డను కేసీఆర్ ఆప్యాయంగా అక్కున చేర్చుకొని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కవిత మురిపెంగా తన తండ్రి చేతిని ముద్దాడారు. ఆమె యోగక్షేమాలపై కేసీఆర్ ఆరాతీశారు. మధ్యాహ్న భోజనం తర్వాత సాయత్రం 4.30 గంటలకు కవిత తిరిగి హైదరాబాద్ నగరంలోని తన నివాసానికి బయలుదేరి వెళ్లారు. చాలా కాలం తర్వాత తమ పార్టీ అధినేత ఉత్సాహంగా కనిపించారని బీఆర్‌ఎస్ నేతలు పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కవిత వెంట మాజీమంత్రి, ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

లోకం పోకడ



చూస్తుండగానే ఎంత బాగా కూల్చిపారేస్తున్నారు.. మీ పార్టీ రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చేసినంత ఈజీగా కూల్చేస్తున్నారు గదా సార్?!

సుప్రీంనే తప్పుపడ్తరా?

▸ మొదటిపేజీ తరువాయి...

మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది.

సీఎం బాధ్యతగా ఉండాలి కదా..

సీఎం రేవంత్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ, సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. ఇది చాలా పాత కేసు అని, ఇప్పటివరకు 25 మంది సాక్షులను విచారించారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. 'ఆయన (సీఎం రేవంత్‌రెడ్డి) నిన్న ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను ఈ రోజు పొద్దున పత్రికల్లో చదివాం. ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ముఖ్యమంత్రి అలాంటి వ్యాఖ్యలు చేయవచ్చా?' అని ప్రశ్నించారు. 'ఆయన ఏం అన్నారో ఓసారి చూడండి. మేము రాజకీయ పార్టీలను సంప్రదించి ఆదేశాలు ఇస్తామా?. ముఖ్యమంత్రిగా బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయవచ్చా?' అని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు కొందరి మనసుల్లో భయాందోళనలు కలిగించే అవకాశం ఉన్నదని అన్నారు. 'మేం రాజకీయ నాయకులను పట్టించుకోం. మా ఆదేశాలను ఎవరైనా విమర్శించినా ఇబ్బంది లేదు. మా మనస్సాక్షి ప్రకారం, మేము చేసిన ప్రమాణం ప్రకారం మా కర్తవ్యాన్ని నిర్వర్తిస్తాం' అని స్పష్టం చేశారు. జస్టిస్ విశ్వనాథన్ మాట్లాడుతూ.. 'ఒక ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి చేయాల్సిన వ్యాఖ్యలేనా ఇవి?. ప్రభుత్వం, న్యాయస్థానాల మధ్య పరస్పర గౌరవం ఉండాలన్న ప్రాథమిక నియమం కూడా తెలియదా?. వ్యవస్థల మధ్య భేదాభిప్రాయాలు ఉన్నా.. గౌరవం ఉండాలి కదా' అని ప్రశ్నించారు. 'ఇలాంటి ప్రవర్తన, ఇంత మొండి వైఖరి ఉంటే ఎలా?. కార్యనిర్వాహక, శాసన వ్యవస్థల్లో మేము (కోర్టులు) జోక్యం చేసుకోబోమని ఎప్పుడూ చెప్తుంటాం. అంతే గౌరవాన్ని మేము వారి నుంచి కూడా ఆశిస్తాం' అని జస్టిస్ గవాయి పేర్కొన్నారు. ఈ ఒక్క కారణంతో కేసు విచారణను పిటిషనర్ కోరినట్టు మధ్యప్రదేశ్ హైకోర్టు బదిలీ చేయాలని ఆదేశాలు ఇవ్వొచ్చు అన్నారు. 'సుప్రీంకోర్టు ఆదేశాలపై ధైర్యంగా వ్యాఖ్యలు చేయచ్చని అనుకుంటున్నారా. నిన్ననే ఒక అదనపు కార్యదర్శికి నోటీసులు ఇచ్చాం' అని మహారాష్ట్రకు చెందిన ఐఏఎస్ అధికారికి కోర్టు ధిక్కరణ నోటీసులు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. దేశంలోని అత్యున్నత న్యాయస్థానం పట్ల ఆయనకు గౌరవం లేకపోతే.. వేరే రాష్ట్రంలో కేసు విచారణను ఎదుర్కోమనండి.. అని జస్టిస్ గవాయి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దశలో రేవంత్‌రెడ్డి తరఫున న్యాయవాదులు స్పందిస్తూ.. ఈ వ్యాఖ్యలు అవాంఛనీయమని, ఆయన తరఫున సుప్రీంకోర్టును క్షమాపణలు కోరారు. మరోసారి ఇలా జరుగకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డికి కౌన్సెలింగ్ ఇస్తామని చెప్పారు. సీఎం వ్యాఖ్యలపై ఎలాంటి నోటీసులు ఇవ్వవద్దని విజ్ఞప్తిచేశారు. వారి విజ్ఞప్తి మేరకు కేసు విచారణను ధర్మాసనం సోమవారానికి వాయిదా వేసింది.



> 'మేం రాజకీయ పార్టీలను సంప్రదించి ఆదేశాలు ఇస్తామా? బాధ్యతగల ముఖ్యమంత్రి చేయదగిన ప్రకటనేనా ఇది? ఆయన మాటలు ప్రజల మనస్సుల్లో భయాందోళనలు రేకెత్తించే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తారా? మీ రాజకీయ శత్రుత్వంలోకి కోర్టులను ఎందుకు లాగుతారు? ప్రభుత్వం, న్యాయస్థానాల మధ్య పరస్పర గౌరవం ఉండాలన్న ప్రాథమిక నియమం కూడా తెలియదా? ఇంత మొండి వైఖరి ఉంటే ఎలా? దేశంలోనే అత్యున్నత న్యాయస్థానమంటే గౌరవం లేదా?. ఇది న్యాయస్థానాల గౌరవ ప్రతిష్టలకు సంబంధించిన అంశం'.
>
> **- సుప్రీంకోర్టు ధర్మాసనం**

నిష్పక్షపాత విచారణ సాధ్యం కాదు..

జగదీశ్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాదులు అర్యమ సుందరం, దామ శేషాద్రి నాయుడు వాదనలు వినిపించారు. ఓటుకు నోటు కేసులో నిందితుడు రేవంత్‌రెడ్డి ఇప్పుడు ముఖ్యమంత్రి అని, హోం శాఖ సైతం ఆయన ఆధ్వర్యంలోనే ఉన్నదని చెప్పారు. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న అవినీతి నిరోధక శాఖ నేరుగా ఆయనకే రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కేసులో ప్రత్యక్ష సాక్ష్యులను, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్లను ఇప్పటివరకు ఎగ్జామిన్ చేయలేదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం తన వైఖరిని క్రమంగా మార్చుకుంటున్నట్టు కనిపిస్తున్నదని, రేవంత్ రెడ్డి ప్రత్యక్ష సాక్షులను ప్రభావితం చేస్తున్నట్టు అనుమానాలు ఉన్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో నిష్పక్షపాత విచారణ సాధ్యం కాదని, కాబట్టి విచారణను మధ్యప్రదేశ్ హైకోర్టుకు మార్చాలని కోరారు. లేదా పోలీసులు సీఎంకు రిపోర్ట్ చేయకుండా కోర్టు పర్యవేక్షణలో విచారణ జరిగినా అభ్యంతరం లేదని చెప్పారు.

రేవంత్‌రెడ్డీ.. ఇకనైనా తీరుమార్చుకో..

సుప్రీం కోర్టు వ్యాఖ్యలతో అయినా కండ్లు తెరువు

నువ్వు ఏసీబీకి పట్టుపడితే బెయిల్ రాలేదా?

అందుకు బీజేపీ సహకారం ఉన్నదనుకోవాలా?

బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): సుప్రీం కోర్టు వ్యాఖ్యలతోనైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుద్ధి తెచ్చుకొని తీరు మార్చుకోవాలని బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో హితవుపలికారు. న్యాయస్థానాలు రాజ్యాంగ పరిరక్షణ వ్యవస్థలనే కనీస ఇంగితం మరిచి సీఎం వ్యవహరించటం బాధాకరమని పేర్కొన్నారు. సుప్రీం కోర్టు తీర్పును ధిక్కరించేలా వ్యాఖ్యానించటం సరికాదనే అవగాహన రేవంత్‌రెడ్డికి లేకపోవడం దురదృష్టకరమని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు వేసిన అక్షింతలతో అయినా బుద్ధి మార్చుకోవాలని హితవు పలికారు. ఈడీ, సీబీఐ ఇప్పటి వరకు ఎమ్మెల్సీ కవిత నేరం చేసినట్టు రుజువులు చూపలేదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. రూ.50 లక్షలతో రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీకి పట్టుబడిన కేసులో రేవంత్‌రెడ్డికి బెయిల్ వచ్చిన విషయాన్ని మర్చిపోవద్దని పేర్కొన్నారు. నాడు రేవంత్‌రెడ్డికి బెయిల్ రావడం వెనుక బీజేపీ సహకారం ఉందని అనుకోవాలా? అని ప్రశ్నించారు.

బోధనా ఫీజుల బకాయిలు 5900 కోట్లు ఎప్పుడిస్తరు?

- **ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి**
- **పిల్లలు చదువుకు దూరమైతే సర్కారుదే బాధ్యత : కేటీఆర్**



హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ) : ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల విషయంలో రేవంత్‌రెడ్డి సర్కార్ నిర్లక్ష్యం వహిస్తున్నదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలైనా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కా లర్‌షిప్‌ల జాడేదని ప్రశ్నించారు. బోధనా ఫీజుల బకాయిలు రూ.5,900 కోట్లకు చేరుకున్నా ప్రభుత్వంలో చలనం లేకపోవటం ఆశ్చర్యం కలిగిస్తున్నదని, ఆ బకాయిలు ఎప్పుడు విడుదల చేస్తారని నిలదీశారు. ఈ ఏడాది స్కాలర్‌షిప్‌ల దరఖాస్తులకు కూడా దిక్కులేని పరిస్థితి తెచ్చారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ వైఖరి కారణంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఈబీసీ విద్యార్థులు చదువులకు దూరం కావాల్సిన పరిస్థితి వచ్చిందని, ఇం దుకు సర్కారే బాధ్యత వహించాలని చెప్పారు. పేద విద్యార్థులంటే ఎందుకంత చిన్నచూపని ప్రశ్నించారు. స్కాలర్‌షిప్‌లు రాక ఎంతోమంది పేద విద్యార్థులు చదువు వదిలేసి కూలి పనికి వెళ్లాల్సిన పరిస్థితి తెచ్చారని ఆగ్రహం వ్యక్తంచేశారు. వసతి గృహాల్లో మెయింటెనెన్స్ చార్జీలు కూడా రాకపోవటంతో విద్యార్థులు చదువుకు దూరం కావాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు.

తల్లిదండ్రులు అప్పులపాలవుతున్నరు

స్కాలర్‌షిప్‌లు పెండింగ్ పెట్టడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటే ఫీజులు అందక యాజమాన్యాలు కూడా విద్యార్థులకు చదువు చెప్పలేని పరిస్థితి వచ్చిందని కేటీఆర్ చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం, నిర్లిప్తత కారణంగా పేద విద్యార్థుల తల్లితండ్రులు అప్పులు తెచ్చి పిల్లలను చదివిస్తున్నారని ఉదహరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం పేద విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడటం మానేయాలని సూచించారు. వెంటనే బోధనా రుసుము బకాయిలు, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అమెరికాకు కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అమెరికాకు వెళ్లారు. బుధవారం రాత్రి పయనమైన ఆయన.. ఎక్స్ వేదికగా 'తండ్రి బాధ్యతలు నిర్వర్తించడానికి' అని పోస్ట్ చేశారు. కుమారుడు హిమాన్షు అమెరికాలో ఉన్నత విద్య అడ్మిషన్ కోసం కేటీఆర్ అమెరికాకు వెళ్లినట్టు సమాచారం.

పాస్‌పోర్టు సేవల్లో సాంకేతిక సమస్యలు

2నుంచి యథావిధిగా పునరుద్ధరణ

హైదరాబాద్ ఆర్పీవో స్నేహజ



హైదరాబాద్ సిటీ బ్యూరో, ఆగస్టు 29(నమస్తే తెలంగాణ) : సాంకేతిక సమస్యల కారణంగా పాస్‌పోర్టు సేవల్లో అంతరాయం కలిగిందని, సెప్టెంబర్ 2న ఉదయం 6 గంటల నుంచి యథావిధిగా సేవలు అందుబాటులోకి వస్తాయని హైదరాబాద్ రీజినల్ పాస్‌పోర్టు అధికారి స్నేహజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నమోదైన స్లాట్స్‌ను మరో తేదీకి మారుస్తామని, అందుకు సంబంధించిన సందేశాలు దరఖాస్తుదారులకు చేరవేసినట్టు పేర్కొన్నారు. స్లాట్స్‌కు సంబంధించి సందేహాలుంటే rpo.hyderabad@mea.gov.inకు మెయిల్ చేయవచ్చని సూచించారు.



యాదాద్రి జిల్లా కొలనుపాక సోమేశ్వరాలయాన్ని దర్శించుకుంటున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

టూరిజం క్షేత్రంగా ఓబుల కేశ్వాపూర్ ఆలయం

- తెలంగాణలో సందర్శించిన తొలి గ్రామ ప్రత్యేకతకు కృషి
- జనగామ జిల్లా పర్యటనలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వెల్లడి

జనగామ/యాదాద్రి భువనగిరి, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత సందర్శించిన తొలి గ్రామమైన జనగామ జిల్లా ఓబుల్ కేశ్వాపూర్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాన్ని టూరిజం దైవక్షేత్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మూడు రోజుల పర్యటనకు వచ్చిన ఆయన.. గురువారం జనగామ జిల్లా పర్యటనను ముగించుకొని యాదాద్రి భువనగిరి జిల్లాకు రోడ్డు మార్గంలో వెళ్లారు. తొలుత ఉదయం వరంగల్ నుంచి రోడ్డు మార్గం ద్వారా జనగామ సమీకృత కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయనకు స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ కడియం కావ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనస్వాగతం పలికారు. అనంతరం జిల్లా అధికారులు, ప్రముఖ కవులు, కళాకారులు, జాతీయ, రాష్ట్ర పురస్కార గ్రహీతలతో ముఖాముఖి నిర్వహించారు. తర్వాత గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం స్వగ్రామం జనగామ మండలం ఓబుల్ కేశ్వాపూర్‌ను సందర్శించిన గవర్నర్‌కు కళాకారులు బోనాలు, కోలాటాలతో స్వాగతం పలికారు. శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వేదపండితులు స్వామికి అభిషేకాలతో ప్రత్యేక పూజలు చేశారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఆలయ ఆవరణలో గవర్నర్ పూల మొక్కను నాటారు. అనంతరం యాదాద్రి భువనగిరి జిల్లాకు వచ్చిన గవర్నర్‌కు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతు కే జండగే, డీసీపీ రాజేశ్‌చంద్ర స్వాగతం పలికారు. ముందుగా ఆలేరు మండలంలోని కొలనుపాక జైన మందిరం, సోమేశ్వరాలయాన్ని గవర్నర్ సందర్శించారు. అనంతరం భువనగిరి పట్టణంలోని స్వర్ణగిరిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత భువనగిరి కలెక్టరేట్‌లో రచయితలు, కళాకారులు, వివిధ రంగాల అవార్డు గ్రహీతలతో ముఖాముఖిలో పాల్గొన్నారు.

బేతవోలుకు 'భాషా సమ్మాన్' ప్రదానం

ఢిల్లీలో అందజేసిన కేంద్రసాహిత్య అకాడమీ

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): బహుముఖ ప్రజ్ఞాశాలి ఆచార్య బేతవోలు రామబ్రహ్మం ప్రతిష్టాత్మకమైన కేంద్ర సాహిత్య అకాడమీ భాషా సమ్మాన్ అవార్డు అందుకున్నారు. ఢిల్లీలోని రవీంద్రభవన్‌లో గురువారం సాహిత్య అకాడమీ ప్రెసిడెంట్ మాధవ్ కౌశిక్ భాషా సమ్మాన్ పురస్కారాన్ని రామబ్రహ్మానికి ప్రదానం చేశారు. భాషా సమ్మాన్ నగదు బహుమతిగా రూ. లక్ష నగదు, తామ్రపత్రం, ప్రశంసాపత్రం అందజేశారు. ప్రాచీన, మధ్యయుగపు సాహిత్యంపై రామబ్రహ్మం వెలువరించిన రచనలకు.. 2021 సంవత్సరానికి ఈ అవార్డు దక్కింది. సాహితీ సేవకు గుర్తింపుగా దక్షిణ భారతదేశం నుంచి ఈ పురస్కారానికి ఆయన ఎంపికయ్యారు. కాగా ఆచార్య రామబ్రహ్మం కవిగా, రచయితగా, అనువాదకుడిగా, పండితుడిగా, వ్యాఖ్యాతగా, అష్టావధానిగా సుప్రసిద్ధులు. ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లలో జన్మించారు. కథలు, కవిత్వం, నాటకాలు కలిపి 34కు పైగా గ్రంథాలు రచించారు. సాహితీ వ్యాసాలను వెలువరించారు.



ఢిల్లీలో సాహిత్య అకాడమీ ప్రెసిడెంట్ కౌశిక్ నుంచి అవార్డు అందుకుంటున్న రామబ్రహ్మం



హత్నూరలో చెక్కుల పంపిణీని అడ్డుకుంటున్న వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

చెక్కుల పంపిణీని అడ్డుకున్న కాంగ్రెస్

- **నర్సాపూర్ ఎమ్మెల్యే కార్యక్రమంలో ఘటన**
- **ప్రొటోకాల్ పాటించడంలో ముందుంటా: సునీతాలక్ష్మారెడ్డి**

హత్నూర, ఆగస్టు 29: సంగారెడ్డి జిల్లా హత్నూర రైతువేదికలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పంపిణీ చేశారు. తొలుత లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తుండగా కాంగ్రెస్, బీజేపీ నాయకులు అడ్డుకోబోయారు. బీఆర్‌ఎస్ నాయకులు స్టేజీపైకి ఎలా వెళ్తారని కాంగ్రెస్, స్థానిక ఎంపీ రఘునందన్ రావుకు సమాచారం ఎందుకు ఇవ్వలేదని బీజేపీ నాయకులు అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఓ క్రమంలో ఎమ్మెల్యే చెక్కుల పంపిణీ నిలిపివేయాలని సభలో నినాదాలు చేశారు. ప్రజా సంక్షేమానికి కృషిచేయాలి తప్ప కార్యక్రమాన్ని అడ్డుకోవద్దని ఎమ్మెల్యే సూచించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు రాక ఏడాది గడుస్తున్నదని, వచ్చిన చెక్కులను పంపిణీ చేయొద్దనడం సమంజసం కాదని, ప్రొటోకాల్ పాటించడంలో నేను ఎప్పుడూ ముందుంటా' అని తెలిపారు. పోలీసులు జోక్యం చేసుకొని ఆందోళన చేస్తున్న నాయకులకు నచ్చజెప్పడంతో చెక్కుల పంపిణీ సాఫీగా సాగింది.

42% బీసీ రిజర్వేషన్లు పెంచకుంటే యుద్ధమే

బీసీ ప్రతినిధులతో ప్రభుత్వం చర్చించాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో ఎంపీ ఆర్ కృష్ణయ్య

పోరాటాల ద్వారానే హక్కుల సాధన: సిరికొండ



ఖైరతాబాద్, ఆగస్టు 29: స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచకపోతే రాష్ట్ర ప్రభుత్వంతో యుద్ధమే జరుగుతుందని ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య స్పష్టం చేశారు. హైదరాబాద్ లక్డీకాపూల్‌లోని హోటల్ సెంట్రల్ కోర్ట్‌లో గురువారం జరిగిన బీసీ కులసంఘాల అఖిలపక్ష సమావేశంలో ఆర్ కృష్ణయ్య మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు కులగణన చేసి 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలని డిమాండ్ చేశారు. ఓ వైపు లోక్‌సభలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ రాహుల్‌గాంధీ బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామని, కులగణన చేపడుతామని ప్రకటనలు చేస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నదని ధ్వజమెత్తారు. కులగణన చేపట్టకుండా స్థానిక ఎన్నికలను నిర్వహిస్తే సీఎం రేవంత్‌రెడ్డికి బీసీలు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. బీసీలు పోరాటాల ద్వారానే హక్కులను సాధించుకోవాలని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి పిలుపునిచ్చారు. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ లాల్ కృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, బీఆర్‌ఎస్ నాయకుడు ఎల్ రమణ, మాజీ ఎంపీ వీ హన్మంతరావు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

పురుగుల మందు తాగి బలవన్మరణం

మహబూబాబాద్ జిల్లాలో విషాదం



మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 29: అప్పుల బాధలు తాళలేక ఓ రైతు తనువు చాలించాడు. చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించక మనస్తాపం చెంది పురుగుల మందు తాగి బలవన్మరణానికి ఒడిగట్టాడు. ఈ విషాద ఘటన గురువారం మహబూబాబాద్ జిల్లా మహబూబాబాద్ మండల శివారులో చోటుచేసుకుంది. మండల పరిధిలోని నడివాడకు చెందిన పెద్దల పాపయ్య (51)కు రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో నిరుడు మిర్చి సాగు చేశాడు. పంటకు ముడత, బంక రోగం వచ్చి పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు. ఈ సంవత్సరం తన పొలంతో పాటు మరో రెండు ఎకరాలను కౌలుకు తీసుకుని సొంతంగా మిర్చి నారు పోసి తోట వేశాడు. అందులో కొంత మిర్చి నారు చనిపోయింది. నర్సరీ నుంచి నారు తెచ్చి మళ్లీ వేసినా బతకలేదు. ఇలా రెండేండ్లుగా పంట పెట్టుబడి ఖర్చులకు రూ.8 లక్షల వరకు అప్పులు చేశాడు. పంటల దిగుబడి రాకపోవడంతో వాటిని ఎలా తీర్చాలని మనస్తాపం చెందాడు. గురువారం వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చికిత్స కోసం స్థానికులు ఏరియా దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.